బుధవారం
28.10.2026
పేజీలు : 12 వెల : రూ. 5/-

వెలుతురు

సంపుటి : 09
సంచిక : 135
తెలుగు దినపత్రిక
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD
www.velthuru.com
Follow :

ఆరోపణలు, ప్రత్యారోపణలతో సమాజం కలుషితం

సమాజ అభివృద్ధి అనేది కేవలం రహదారులు వేయడం, భవనాలు నిర్మించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, నిధులు కేటాయించడం వంటి పనులతోనే పూర్తికాదు. ప్రజల మధ్య పరస్పర విశ్వాసం, సామాజిక బాధ్యత, నైతిక విలువలు, ప్రశాంతమైన వాతావరణం కూడా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒక గ్రామం బాగుండాలన్నా, మండలం అభివృద్ధి చెందాలన్నా, పట్టణం ప్రగతి సాధించాలన్నా, రాష్ట్రం ముందుకు సాగాలన్నా, దేశం ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించాలన్నా రాజకీయ నాయకుల మాటలు, ఆలోచనలు, ప్రవర్తన, కార్యాచరణలో బాధ్యతాయుతమైన మార్పు రావాలి. ముఖ్యంగా ఆరోపణలు, ప్రత్యారోపణల రాజకీయ సంస్కృతికి స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. ప్రజాప్రతినిధుల పనితీరును విమర్శించడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, అవినీతి లేదా అక్రమాలు జరిగితే వాటిని ప్రజల దృష్టికి తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే. అయితే విమర్శకు, నిరాధారమైన ఆరోపణకు మధ్య స్పష్టమైన తేడా ఉంటుంది. ఆధారాలతో ప్రశ్నించడం ప్రజాస్వామ్య బాధ్యత అయితే, ఆధారాలు లేకుండా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. నేటి రాజకీయ వాతావరణంలో ఒక నాయకుడు మరొక నాయకుడిపై ఆరోపణ చేయడం, దానికి ప్రతిగా ఇంకొకరు ప్రత్యారోపణలు చేయడం, ఆ తర్వాత అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం పదేపదే ప్రస్తావించడం సాధారణంగా మారుతోంది. ఆరోపణ చేసిన తర్వాత దానిని నిరూపించడానికి అవసరమైన ఆధారాలు సేకరించడం, సంబంధిత వ్యవస్థలకు ఫిర్యాదు చేయడం, విచారణ జరిగేలా చూడడం వంటి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఆరోపణలతోనే రాజకీయ ప్రచారం ముగుస్తోంది. ఫలితంగా ప్రజలకు వాస్తవాలు తెలియకుండానే అనుమానాలు, అపోహలు, అపనమ్మకాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఒక ఆరోపణ చేయడానికి కొన్ని క్షణాలు సరిపోవచ్చు. కానీ ఆ ఆరోపణ వల్ల ఒక వ్యక్తి ప్రతిష్ఠకు, ఒక కుటుంబ గౌరవానికి, ఒక సంస్థ విశ్వసనీయతకు కలిగిన నష్టాన్ని సరిచేయడానికి సంవత్సరాలు పట్టవచ్చు. అందుకే ఆరోపణ చేసే ముందు దాని నిజానిజాలను పరిశీలించడం, ఆరోపణ చేసిన తర్వాత దానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచడం నాయకుల నైతిక బాధ్యతగా గుర్తించాలి. రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులు మాత్రమే కాదు. వారి మాటలను లక్షలాది మంది ప్రజలు వింటారు, వారి ప్రవర్తనను గమనిస్తారు, కొన్నిసార్లు వారినే ఆదర్శంగా తీసుకుంటారు. అందువల్ల నాయకుల మాటలకు సాధారణ వ్యక్తుల మాటలకంటే ఎక్కువ ప్రభావం ఉంటుంది. నాయకులు పరస్పరం గౌరవించుకుంటూ, విధానపరమైన అంశాలపై చర్చిస్తూ, ప్రజా సమస్యలకు పరిష్కారాలు సూచిస్తే సమాజంలోనూ ఆరోగ్యకరమైన చర్చా సంస్కృతి పెరుగుతుంది. కానీ వ్యక్తిగత దూషణలు, కక్ష సాధింపు వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు ప్రధానంగా మారితే అదే ధోరణి క్రమంగా ప్రజల్లోకి కూడా చేరుతుంది. ఒక పార్టీకి చెందిన వ్యక్తి మరో పార్టీ నాయకుడిని శత్రువుగా చూడటం ప్రారంభిస్తే, ఆ రాజకీయ విభేదాలు కుటుంబాలు, స్నేహితులు, గ్రామాలు, కాలనీల మధ్య కూడా విభేదాలకు కారణమవుతాయి. ఒకే గ్రామంలో నివసించే ప్రజలు రాజకీయ అభిప్రాయాల కారణంగా పరస్పరం మాట్లాడుకోలేని పరిస్థితులు ఏర్పడవచ్చు. సంవత్సరాలుగా కొనసాగిన స్నేహాలు దెబ్బతినవచ్చు. ప్రజా సమస్యలపై కలిసి పనిచేయాల్సిన వ్యక్తులు రాజకీయ అనుబంధాల కారణంగా దూరమవుతారు. ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఒక్కటే. రాజకీయ నాయకుల మధ్య జరిగే మాటల యుద్ధానికి మూల్యం చెల్లించేది ఎవరు? నాయకులు తమ రాజకీయ కార్యక్రమాలను కొనసాగిస్తారు. ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు, ప్రత్యన్న ఆరోపణలు చేసిన వాళ్ళు ఎదురెదురుగా ఎదురైనా, ఏదైనా కార్యక్రమంలో కలిసినా నవ్వుతు ప్రశాంతంగా పలకరించుకుంటారు. కానీ వారు చేసినా ఆరోపణలు, ప్రత్యన్న ఆరోపణలు, వారి మాటలను నమ్మి పరస్పరం విభేదించే సామాన్య ప్రజలు మాత్రం సామాజిక సంబంధాలను కోల్పోతారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఏర్పడిన విభేదాలు, సమాజంలో దీర్ఘకాలిక చీలికలకు దారితీయడం అత్యంత ప్రమాదకరం. ప్రజలకు అవసరమైనవి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా సౌకర్యాలు, మహిళలకు భద్రత, వృద్ధులకు రక్షణ, యువతకు భవిష్యత్తుపై నమ్మకం. ఇవే ప్రజాప్రతినిధుల చర్చల్లో ప్రధాన అంశాలుగా ఉండాలి. కానీ రాజకీయ చర్చలు వ్యక్తిగత ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతివిమర్శల చుట్టూ తిరిగితే ప్రజా సమస్యలకు లభించాల్సిన ప్రాధాన్యం తగ్గిపోతుంది. ఒకసమస్యను ఎలా పరిష్కరించాలి అనే చర్చ స్థానంలో, ఆ సమస్యకు ఎవరు కారణమనే వాదన కొనసాగుతుంది. బాధ్యతను స్వీకరించాల్సిన చోట ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటారు. పరిష్కారం చూపాల్సిన సమయంలో రాజకీయ లెక్కలు వేస్తారు. ఉదాహరణకు ఒక గ్రామంలో తాగునీటి సమస్య ఉంటే దానికి పరిష్కారం చూపడం ముఖ్యం. గతంలో ఎవరు నిర్లక్ష్యం చేశారనే అంశం అవసరమైతే పరిశీలించవచ్చు. కానీ ఆ వివాదం కారణంగా సమస్య పరిష్కారం ఆలస్యం కావడం మాత్రం ప్రజలకు అన్యాయం చేయడమే. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కొరత, ఆసుపత్రుల్లో వైద్య సేవల లోపాలు, నిరుద్యోగ సమస్యలు వంటి అంశాలపై రాజకీయ పార్టీలు పరస్పరం నిందించుకోవడం కంటే, సమస్య పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం సమాజానికి మేలు చేస్తుంది. ఆరోపణలకు ఆధారాలు లేనప్పుడు ప్రజల్లో గందరగోళం పెరుగుతుంది. ఒక వర్గం ఒక నాయకుడి మాటలను నమ్ముతుంది. మరో వర్గం ప్రత్యర్థి నాయకుడి మాటలను నమ్ముతుంది. వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా, తమకు నచ్చిన వ్యక్తి చెప్పిందే నిజమని భావించే ధోరణి పెరుగుతుంది. సామాజిక మాధ్యమాల ద్వారా నిర్ధారణ కాని సమాచారాన్ని వేగంగా పంచుకోవడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఒకసారి తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లిన తర్వాత, వాస్తవాలు బయటపడినా అందరూ వాటిని అంగీకరించకపోవచ్చు. ఎందుకంటే ప్రజలు కొన్నిసార్లు వాస్తవాల కంటే తమ రాజకీయ అభిప్రాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఈ పరిస్థితి సమాజంలో నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. అయితే ఆరోపణ చేసిన ప్రతి వ్యక్తినీ తప్పుబట్టడం కూడా సరైన విధానం కాదు. నిజమైన అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజాధన దుర్వినియోగం వంటి అంశాలను వెలుగులోకి తీసుకురావడం అవసరం. అందుకు స్వతంత్ర విచారణ, పారదర్శకమైన ప్రక్రియ, చట్టబద్ధమైన చర్యలు ముఖ్యం. ఆరోపణ చేసిన వ్యక్తి రాజకీయ ప్రత్యర్థి అయినంత మాత్రాన ఆ ఆరోపణ అసత్యమని చెప్పలేం. అదే విధంగా ఆరోపణలు వినిపించాయనే కారణంతో ఎవరినీ దోషిగా నిర్ధారించలేం. ఆరోపణ, ఆధారం, విచారణ, నిర్ధారణ.. ఈ నాలుగు అంశాల మధ్య తేడాను సమాజం అర్థం చేసుకోవాలి. రాజకీయ నాయకులు తమ మాటలకు తామే బాధ్యత వహించే సంస్కృతిని అలవర్చుకోవాలి. తప్పు జరిగితే అంగీకరించే ధైర్యం, ప్రత్యర్థి చేసిన మంచి పనిని ప్రశంసించే విశాల హృదయం, ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేసే మనస్తత్వం పెంపొందించుకోవాలి. విమర్శించాల్సి వస్తే విధానాలను విమర్శించాలి. ప్రశ్నించాల్సి వస్తే పనితీరును ప్రశ్నించాలి. ఆరోపణ చేయాల్సి వస్తే ఆధారాలతో చేయాలి. తప్పు నిరూపితమైతే చట్టపరమైన చర్యలకు సహకరించాలి. ప్రజలు కూడా రాజకీయ నాయకుల మాటలను గుడ్డిగా నమ్మకుండా, వాటి వెనుక ఉన్న వాస్తవాలను పరిశీలించాలి. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ప్రతి సమాచారాన్ని నిజమని భావించకూడదు. నిర్ధారణ కాని వార్తలను ఇతరులకు పంపకుండా బాధ్యతగా వ్యవహరించాలి. రాజకీయ అభిప్రాయాలు వేరైనా మనుషుల మధ్య గౌరవం తగ్గకూడదనే అవగాహన పెరగాలి. ఒక గ్రామం బాగుండాలంటే అక్కడి ప్రజల మధ్య ఐక్యత ఉండాలి. ఒక మండలం అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాలి. ఒక పట్టణం ముందుకు సాగాలంటే బాధ్యతాయుతమైన పాలన అవసరం. ఒక రాష్ట్రం ప్రగతి సాధించాలంటే రాజకీయ పార్టీలు ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక దేశం బలంగా నిలవాలంటే ప్రజాస్వామ్య విలువలు, పరస్పర గౌరవం, సామాజిక ఐక్యత బలపడాలి. ఆరోపణలు చేయడం ద్వారా తాత్కాలిక రాజకీయ ప్రయోజనం లభించవచ్చు. ప్రత్యారోపణలతో ప్రత్యర్థిని ఇబ్బందులకు గురిచేయవచ్చనే భావన ఉండవచ్చు. కానీ వాటి వల్ల ప్రజల మధ్య పెరిగే అపనమ్మకం, ద్వేషం, విభేదాలు సమాజ అభివృద్ధికి అడ్డంకులుగా మారతాయి. రాజకీయ నాయకులు గెలవడం మాత్రమే ప్రజాస్వామ్య విజయానికి కొలమానం కాదు. ప్రజలు ప్రశాంతంగా జీవించడం, వారి సమస్యలు పరిష్కారం కావడం, సమాజంలో న్యాయం నిలవడం, అభివృద్ధి అందరికీ చేరడం నిజమైన విజయానికి గుర్తులు. నాయకుల మాటలు సమాజంలో చైతన్యాన్ని నింపాలి కానీ చీలికలను సృష్టించకూడదు. వారి ఆలోచనలు అభివృద్ధికి మార్గం చూపాలి కానీ విద్వేషాలకు వేదిక కాకూడదు. వారి చర్యలు ప్రజలకు నమ్మకాన్ని కలిగించాలి కానీ అనుమానాలను పెంచకూడదు. ఎందుకంటే సమాజాన్ని నిర్మించడానికి సంవత్సరాలు పడతాయి. కానీ బాధ్యతారహితమైన మాటలతో సమాజంలో చీలికలు సృష్టించడానికి కొన్ని క్షణాలే సరిపోతాయి. ఆరోపణల కంటే ఆధారాలకు, ప్రత్యారోపణల కంటే పరిష్కారాలకు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. రాజకీయాలు ప్రజలను విడదీయ డానికి కాదు, ప్రజలను కలిపి అభివృద్ధి వైపు నడిపించడానికి ఉండాలి.

-వై. సంజీవ కుమార్,
ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్,
స్కై ఫౌండేషన్,
9393613555/
9493613555

హిందూ మతాన్ని స్వీకరించిన
తొలి విదేశీ మహిళ సిస్టర్ నివేదిత

అక్టోబర్ 28 సిస్టర్ నివేదిత జయంతి

వివేకానందుడి బోధనలకు ప్రభావితమై హిందూ మతాన్ని స్వీకరించిన మొదటి విదేశీ మహిళగా సిస్టర్ నివేదిత చరిత్రను సృష్టించింది. మహిళలకు సరైన విద్యావకాశాలు కల్పించి విద్యా వంతులను చేసినపుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించిన సిస్టర్ నివేదిత మహిళా విద్యాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసింది. ఐర్లాండ్‌లోని కౌంటీ టైరాన్‌లో 1867 అక్టోబర్ 28న ఆమె జన్మించింది. తండ్రి శామ్యూల్ రిచ్‌మండ్ నోబుల్, తల్లి ఇసాబెల్. స్కాట్లాండ్‌కు చెందిన వాళ్లు ఐర్లాండ్‌లో స్థిరపడ్డారు. మత బోధకుడైన శామ్యూల్ కూతురికి తరచు మానవసేవ గురించి చెప్పేవారు. అయితే, ఆమెకు పదేళ్ల వయసులోనే శామ్యూల్ మరణించాడు. తల్లి ఇసాబెల్ పుట్టింటికి చేరడంతో, మార్గరెట్ అక్కడే పెరిగింది. లండన్‌లోని చర్చి బోర్డింగ్ స్కూల్‌లో, హాలిఫాక్స్ కాలేజీలో ఆమె చదువు సాగింది. ఒకవైపు చదువు కొనసాగిస్తుండగానే, పదిహేడేళ్ల వయసులోనే చిన్నపిల్లలకు టీచర్‌గా పాఠాలు బోధించేది. తర్వాతి కాలంలో వింబుల్డన్‌లో స్వయంగా ఒక పాఠశాలను నెలకొల్పింది. కాలేజీ చదువు పూర్తయ్యాక వేల్స్‌కు చెందిన ఒక యువకుడితో నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థం జరిగిన కొద్ది రోజులకే ఆయన ఆకస్మికంగా మరణించాడు. మార్గరెట్‌కు ఆ షాక్ నుండి త్వరగా తేరుకోలేకపోయింది. మనశ్శాంతి కోసం ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనేది. ఆమె అలాంటి పరిస్థితుల్లో ఉన్న కాలంలోనే స్వామీ వివేకానంద అమెరికా నుంచి 1895లో లండన్ చేరుకున్నది. లండన్‌లోని ఒక సంపన్నుని ఇంట ఏర్పాటు చేసిన స్వామీ వివేకానంద వేదాంత ప్రసంగం కార్యక్రమానికి ఒక స్నేహితురాలి ద్వారా మార్గరెట్‌కు ఆహ్వానం అందింది. అచిర కాలంలోనే సోదరి నివేదితగా భారతీయులకు చిరపరిచితు రాలైంది. వివేకానందుడి పిలుపుతో ఆమె సముద్రమార్గంలో 1898 జనవరి 28న కలకత్తా చేరుకుంది. వివేకా నందుడి గురువైన రామకృష్ణపరమహంస సాధనలతో గడిపిన దక్షిణేశ్వర ఆలయాన్ని సందర్శించు కుంది. కలకత్తాలో 1898 మార్చి 11న ఏర్పాటైన బహిరంగ కార్యక్రమంలో స్వామి వివేకానంద తొలిసారిగా మార్గరెట్‌ను ప్రజానీకానికి పరిచయం చేశారు. కొద్ది రోజులకే ఆమె రామకృష్ణ పరమహంస సతీమణి శారదా దేవిని కలుసుకుని ఆశీస్సులు తీసుకుంది. జీవితాంతం బ్రహ్మచర్య దీక్షను అవలంబిస్తానని ప్రతిన బూనడంతో స్వామి వివేకానంద ఆమె పేరును 'సోదరి నివేదిత'గా మార్చారు. నివేదిత అంటే భగవంతునికి సమర్పణ చేయబడినది అని అర్థం. నివేదితగా మారిన తర్వాత వివేకానందునితో కలసి ఆమె విస్తృతంగా భారత దేశమంతటా పర్యటించింది. వివేకానంద బోధన గురించి, తనపై వాటి ప్రభావం గురించి తాను రాసిన 'ది మాస్టర్ యాజ్ ఐ సా హిమ్' పుస్తకంలో వివరించింది. ఇతరులపై దయా గుణంతో మెలిగే ఆమె, మంచి అభిరుచిగల కళాకారిణి. సంగీతంలోనూ, చిత్రకళలోనూ ఆమెకు ప్రవేశం ఉండేది. ఉపాధ్యాయురాలిగా పనిచేసిన అనుభవం ఉన్న నివేదిత భారత్‌లోనూ విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసింది. ముఖ్యంగా బాలికల విద్యకోసం ఆమె 1898 నవంబరులో కలకత్తా లోని బాగ్‌బజారులో పాఠశాలను ప్రారంభించింది. కనీస విద్యలేని బాలికలకు విద్యను అందించడం లక్ష్యంగా ఆమె పనిచేసింది. ప్రాథమిక విద్య అందించడానికి విశేష కృషి చేసింది. అన్నికులాల మహిళలకు చదువు తప్పనిసరిగా రావాలని ఆమె ఆకాంక్షించింది. బెంగాల్ మహిళలతో, మేధావులతో పరిచయాలను ఏర్పాటు చేసుకుని బాలికల విద్యకోసం ఎంతో శ్రమించింది. విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, జగదీశ్ చంద్ర బోస్ తదితర ప్రముఖులతో స్నేహసంబంధాలను కొనసాగించింది. 1899 సంవత్సరం మార్చిలో కలకత్తావాసులకు ప్లేగ్ వ్యాధి సోకినప్పుడు తన శిష్యులతో కలిసి వైద్యసేవలు అందించింది. భారత మహిళల ఔన్నత్యం గురించి, ఆచార వ్యవహారాల గురించి న్యూయార్క్, షికాగో మొదలైన నగరాల్లో ఆమె ప్రసంగించింది. వివేకానందుని బోధలను యువతరానికి చేరవేసేందుకు అహరహం కృషి చేసింది. కలకత్తాలో ప్లేగు మహమ్మారి వ్యాపించినప్పుడు రోగుల దగ్గరే ఉండి, వారికి సేవలందించింది. భారత జాతీయ, స్వాతంత్ర్యో ద్యమాలకు ఇతోధికంగా తోడ్పాటు నందించింది. విద్యా వ్యాప్తికి, సేవా కార్యక్రమాల అమలుకు విశేషంగా కృషి చేసింది. స్వాతంత్ర్యసమర యోధుడు, ఆధ్యాత్మికవేత్త అరబిందో ఆధ్వర్యంలో వెలువడే 'కర్మయోగి' పత్రికకు సంపాదకురాలిగా సేవలందించింది. మేధా సంపత్తిలో భారత దేశం అద్వితీయమైనదని ప్రపంచానికి చాటింది. భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆమె చురుకైన పాత్ర పోషించింది. భారతీయతను పూర్తిగా ఆకలింపు చేసుకున్న ఆమె మహిళావిద్య కోసం ఎంతగానో పాటు పడింది. 1906లో బెంగాల్‌కు వరదలు వచ్చినప్పుడు బాధిత ప్రజలకు ఆమె చేసిన సేవ, అందించిన మానసిక ధైర్యం ఎంతో విలువైనవి. విదేశీయురాలు అయినప్పటికీ భారతీయతను పుణికిపుచ్చుకుని స్వామి వివేకానందతో అనేక దేశాలు పర్యటించి ప్రసంగించిన ఆమె డార్జిలింగ్‌లో ఉండగా, అనారోగ్యానికి గురైన నివేదిత 1911 అక్టోబర్ 13న తన 43వ ఏట తుదిశ్వాస విడిచింది.

-రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ జర్నలిస్ట్ కాలమిస్ట్
9440595494

బాల సాహిత్యంలో
ధృవతార అవసరాల

-అక్టోబర్ 28 అవసరాల రామ కృష్ణారావు

అవసరాల రామకృష్ణారావు ప్రముఖ సాహితీవేత్త, నవలా రచయిత. తెలుగు సాహిత్యం బతికి బట్ట కట్టి నంత కాలం గుర్తుంచుకునే కథా భీష్ముడు. ఆయన 1931, డిసెంబర్ 21న చెన్నైలో జన్మించి న రామ కృష్ణారావుకు బాల సాహిత్యంలో అజరా మరం గా నిలిచిన చందమామతో ఆయనకు గల బంధం, అనుబంధం విడదీయరానిది. ఏడు పదుల ఏళ్ళకిందట తన 15 సంవత్సరాల తొలి సంధ్య లో చందమామ 1947 జూలై సంచిక 'లో 'పొట్టిపిచిక కథ'తో ప్రారంభించింది మొదలు మలి సంధ్యలో 80ఏళ్ళ వయసు వరకు రచనా వ్యాసంగాన్ని కొనసాగించిన విశిష్ట కథా రచయిత. పొట్టి పిచిక కథ ప్రారంభ, ముగింపులు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. 'పొట్టి పిచిక కథ' రచనే తన విజయ సూత్రం అవుతుందని ఆనాడు, ఏనాడూ అనుకోలేదని చెప్పేవారు. పదిహేనేళ్ల ప్రాయంలో రాసిన, ఈ కథ ఇచ్చే సందేశం నిజంగా అద్భుతం. వెయ్యికి పైగా రచనలు చేసి, తల వంచక, కలం దించక తెలుగు కథకుడిగా కొనసాగి సుదీర్ఘ సాహితీ వ్యాసంగంలో పక్షులతో జంతువులతో మనుషుల్ని కలిపి సామాజికాంశాల్ని అలవోకగా కథా వస్తువులుగా చేసు కోవడానికి చందమామ పత్రికనే భూమిక అని చెప్పేవారు. చందమామ కథ ఇచ్చిన ఊపుతో తాను రాసిన సుప్రసిద్ధ పిల్లల రచనల్లో 'కేటూ డూప్లికేటూ,' 'మేథ మేట్రిక్స్,' మూడు భాగాలూ, 'ఆంగ్రేజీ మేడీజీ,' 'ఆంగ్రేజీ యమ ఈజీ వంటి అరడజను రచనలు భాగమని కూడా ఆయన ఘనంగా చెప్పుకున్నారు. తెలుగులో నవలలు, కథలు వెయ్యికి పైగా రాసి వన్నెకెక్కి న కథా రచయితగా పేరు తెచ్చుకున్నారు. ఆయన తుని ఎస్సార్ ఉన్నత పాఠశాలలో లెక్కలు, సైన్సు బోధించారు. ఒరిస్సాలో ఇంగ్లీషు రీడర్ గా పని చేశారు. విశాఖపట్నంలో ఇంగ్లీషు లెక్చరర్ గా పని చేశారు. వృత్తి జీవితమంతా ఆంగ్ల భాష బోధించినా, తెలుగు భాష పై ఉన్న వ్యామోహం తోనే దశాబ్దాల కాలంలో వెయ్యికి పైగా రచనలు మాతృ భాషలోనే చేశారు. ఆధునిక సమాజం తెస్తున్న మార్పుల్లో కొన్నింటికి దూరంగానే ఉన్నా నని అంగీకరించారు. మనం మనుష్యులం, సహ జీవన సౌభాగ్యం, ఇంకానా అంతరాలు? అదుగో మావయ్య, ఆ వెనకే మేరీ, సంపెంగలూ, సన్నజాజులూ, మేం చేసిన తప్పు మీరూ చేస్తారా?, అది ప్రశ్న, ఇది జవాబు, హెడ్మిస్ట్రెస్ హేమ లత, పేక ముక్కలు, కథా వాహిని, గణిత విశారద, కేటూ, డూప్లికేటూ, అర్థమున్న కథలు, రామ చిలుక, మోహన రాగం, మేథమే ట్రిక్స్ 1, మేథ మేట్రిక్స్2 మేథమే ట్రిక్స్3, అంగ్రేజీ మేడీజీ "తదితర రచనలు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం (1969), తెలుగు విశ్వ విద్యాలయం హాస్య రచయిత పుర స్కారం (1994), జ్యేష్ఠ లిటరరీ అవార్డు (1998), కొలసాని చక్రపాణి అవార్డు (1999), ఢిల్లీ తెలుగు ఎకాడమీ ఉగాది పురస్కారం (2000). ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తెలుగు వైభవం పురస్కారం (2004) తదితర అవార్డులు, పుర స్కారాలు ఆయనకు లభించాయి. అవసరాల 2011, అక్టోబర్ 28న హైదరాబాదులో తుది శ్వాస విడిచి, ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

– రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్
జర్నలిస్ట్ కాలమిస్ట్ 9440595494

భావనకు జీవం... కథనానికి ప్రాణం

అక్టోబర్ 28
అంతర్జాతీయ యానిమేషన్ డే

కాగితంపై చిందులేసే నిశ్చల గీతకు ప్రాణస్పందనను అందించి, రంగుల భావనకు ఊపిరూది, దృశ్యకావ్యంగా మలిచే అపురూప సృజనాత్మక విన్యాసమే యానిమేషన్. కేవలం కార్టూన్ బొమ్మలను గాల్లో తిప్పడమో, పిల్లలను నవ్వించడమో మాత్రమే కాదిది; మానవ నేత్రానికి గల దృష్టి నిలకడ (పెర్సిస్టెన్స్ ఆఫ్ విజన్) అనే శాస్త్రీయ ధర్మాన్ని ఆధారంగా చేసుకుని, స్వల్పమైన మార్పులతో కూడిన వేలాది చిత్రాలను సెకనుకు 24 ఫ్రేముల వేగంతో కంటిముందు కదలాడించి నిరంతర చలన భ్రమను సృష్టించే మహోన్నత దృశ్యకళ. ప్రాచీన కాలంలో మన గుహల్లో చిత్రించిన వేట దృశ్యాల్లోని బహుళ పాదాల జంతువులు, ఆలయ స్తంభాలపై శిల్పాల శ్రేణులు, తోలుబొమ్మలాటలలో వెలుగునీడల నడుమ పలికించిన నాట్యభంగిమలు ఈ కళకు ప్రాచీన వేళ్ళుగా నిలిచాయి. అయితే, శాస్త్రీయ పద్ధతిలో ఆధునిక యానిమేషన్ ఊపిరిపోసుకోవడానికి శతాబ్దాల ప్రయోగాలు పునాది వేశాయి. 1892 అక్టోబరు 28న పారిస్‌లోని గ్రెవిన్ మ్యూజియంలో ఎమిల్ రేనాడ్ తన 'థియేటర్ ఆప్టిక్' ద్వారా 'పాంటోమైమ్స్ లుమినోసెస్' పేరిట వేల చిత్రాల పట్టీలను ప్రదర్శించి చలన చిత్రణకు నాంది పలికారు. ఆ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకునే అంతర్జాతీయ యానిమేటెడ్ ఫిల్మ్ అసోసియేషన్ (అసిఫా) ప్రతియేటా అక్టోబరు 28ని 'అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవం'గా ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ఘనంగా నిర్వహిస్తోంది. ఈ రంగ ప్రస్థానంలో 1906లో జె. స్టువర్ట్ బ్లాక్‌టన్ రూపొందించిన 'హ్యూమరస్ ఫేజెస్ ఆఫ్ ఫన్నీ ఫేసెస్', 1908లో ఎమిల్ కోల్ చాక్‌బోర్డ్‌పై గీసి సృష్టించిన 'ఫాంటాస్మగోరీ' సాంకేతిక పరిణతికి మైలురాళ్లుగా నిలిచాయి. ఆపై వాల్ట్ డిస్నీ రాకతో యానిమేషన్ సామ్రాజ్యం విశ్వవ్యాప్తమైంది. 1928లో సమకాలీకృత ధ్వనితో విడుదలైన 'స్టీమ్‌బోట్ విల్లీ' మిక్కీ మౌస్ పాత్రతో ప్రపంచాన్ని మంత్రముగ్ధులను చేయగా, 1937లో వెలువడిన 'స్నో వైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్' తొలి పూర్తినిడివి సెల్యులాయిడ్ యానిమేషన్ చిత్రంగా చరిత్రకెక్కింది. నాటి సాంప్రదాయ డ్రాయింగ్ టేబుళ్ల నుంచి నేటి డిజిటల్ తెరల వరకు విస్తరించిన ఈ పయనం, 1995లో పిక్సర్ సంస్థ అందించిన తొలి పూర్తి స్థాయి త్రీడీ కంప్యూటర్ యానిమేటెడ్ చిత్రం 'టాయ్ స్టోరీ'తో సరికొత్త యుగంలోకి అడుగుపెట్టింది. కంప్యూటర్ గ్రాఫిక్స్, మోషన్ క్యాప్చర్, విజువల్ ఎఫెక్ట్స్ రంగప్రవేశంతో యానిమేషన్ కేవలం బాలసాహిత్యపు బొమ్మలకే పరిమితం కాక, సార్వజనీన భావోద్వేగాలను పండించే మహా కథన మాధ్యమంగా అవతరించింది. భారతీయ సందర్భంలోనూ యానిమేషన్‌కు ఒక ఘనమైన గతం, ఉజ్వలమైన వర్తమానం ఉన్నాయి. భారత యానిమేషన్ పితామహుడు రామ్ మోహన్ 1956లో భారత ప్రభుత్వ ఫిల్మ్స్ డివిజన్ కార్టూన్ ఫిల్మ్స్ యూనిట్‌లో ప్రవేశించి, క్లైర్ వీక్స్ మార్గదర్శకత్వంలో ఈ రంగానికి దృఢమైన బాటలు వేశారు. ఆయన రూపొందించిన 'యూ సెడ్ ఇట్' (1972), 'ఫైర్ గేమ్స్' (1983) చిత్రాలు జాతీయ చలనచిత్ర పురస్కారాలను అందుకోగా, జపాన్ దర్శకుడు యుగో సాకోతో కలిసి ఆయన దర్శకత్వం వహించిన 'రామాయణ: ది లెజెండ్ ఆఫ్ ప్రిన్స్ రామ' (1992) భారతీయ ఇతిహాస దృశ్యీకరణలో ఒక అసమాన కళాఖండంగా నిలిచింది. ఆయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2014లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. బౌద్ధ జాతక కథల ఆధారంగా వచ్చిన 'ది బన్యన్ డీర్' వంటి సృష్టింపులు ఈ మాధ్యమం ద్వారా నైతిక విలువలను, జీవకారుణ్యాన్ని సమాజంలో ఎంత లోతుగా నాటవచ్చో నిరూపించాయి. తెలుగు సాంస్కృతిక వినీలాకాశంలో యానిమేషన్ అద్భుతాలు సృష్టించగల అపరిమిత వనరులను కలిగి ఉంది. విష్ణుశర్మ పంచతంత్ర కథల నీతిసూత్రాలు, బమ్మెర పోతన అమృతతుల్యమైన భాగవత ఘట్టాలైన గజేంద్రమోక్షం, ప్రహ్లాద చరిత్రలు, కాకతీయ వీరగాథలు, మేడారం సమ్మక్క సారలమ్మల పోరాట పటిమ, పల్నాటి యుద్ధ చరిత్ర వంటి ఉదాత్తమైన ఇతివృత్తాలు దృశ్యరూపం దాలిస్తే అంతర్జాతీయ విపణిలో సంచలనం సృష్టించగలవు. తరగతి గదుల్లో సంక్లిష్టమైన సైన్స్ ప్రయోగాలను, అంకగణిత సిద్ధాంతాలను వివరించడానికి, వైద్యరంగంలో అంతర్గత అవయవాల శస్త్రచికిత్సా విన్యాసాలను ప్రత్యక్షంగా చూపడానికి, వ్యవసాయంలో వర్షపునీటి సంరక్షణ పద్ధతులను రైతులకు అరటిపండు వలిచిపెట్టినట్లు తెలియజేయడానికి యానిమేషన్ కన్నా బలమైన ప్రత్యామ్నాయం మరొకటి లేదు. ప్రస్తుత డిజిటల్ యుగంలో గేమింగ్, వర్చువల్ రియాలిటీ (వీఆర్), ప్రకటనల రంగాల్లో యానిమేషన్ కీలక ఆర్థిక చోదకశక్తిగా మారింది. కృత్రిమ మేధ (ఏఐ) విప్లవం ద్వారా చిత్రణ వేగవంతమైనప్పటికీ, పాత్రల అంతరంగ భావోద్వేగాలను పలకించడంలో, సాంస్కృతిక మూలాలను నిక్షిప్తం చేయడంలో మానవ మేధస్సు, కళాకారుడి హృదయ స్పందనలదే అగ్రస్థానం. ఈ క్రమంలో ప్రతిభావంతులైన గ్రామీణ యువతకు నాణ్యమైన సాంకేతిక శిక్షణను అందించడం, స్థానిక భాషల్లో విశిష్టమైన పాఠ్యాంశాలను రూపొందించడం, కాపీరైట్ చట్టాల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించడం తక్షణ కర్తవ్యం. సాంకేతికతకు స్వదేశీ సంస్కృతిని మేళవించి, భావనా శక్తికి నవ్య శిల్పాన్ని అద్ది, సరిహద్దులను చెరిపివేసే దృశ్యరూపకాలను మలచినప్పుడే యానిమేషన్ కళ నిజమైన మానవీయ వారధిగా భాసిల్లుతుంది; అదే అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవానికి మనం అందించే నిజమైన నివాళి.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్

హిందువుల పవిత్ర పర్వదినాలు అట్లతద్ది, కర్వా చౌత్

(28/29 అక్టోబర్ "అట్లతద్ది, కర్వా చౌత్" పర్వదినాల సందర్భంగా)

పండుగలు మన హిందూ సంప్రదాయాల్లో అతి ప్రధానమైనవి. కాయకష్టం చేసుకుంటూ జీవితాలను గడిపే నిరుపేదల కళ్లల్లో ఆనందాల కాంతులు వెదజల్లే బాధ్యతలను పండుగలు తీసుకోవడం హర్షణీయం. పండుగలు ప్రతి ఏటా దక్షిణాదికి చెందిన రాష్ట్రాలు, ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో "అట్లతద్ది" పర్వదినాన్ని, ప్రపంచవ్యాప్తంగా హిందూ బంధు వులు "కర్వా చౌత్" పండుగను ఘనంగా జరుపుకుంటున్నాం.

దక్షిణాదిన అట్లతద్ది పండుగ:
అట్లతద్ది ఆరట్లు..ముద్ద పప్పు మూడట్లు... అంటూ సినీ గేయం పాటతో చేసుకోవడం మనందరికీ తెలుసు. దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలో "అట్లతద్ది" పండుగను ఆశ్వయుజ బహుళ తదియ నాడు (28 అక్టోబర్) ఉయ్యాల పండుగ అని, గోరింటాకు పండుగ అని కూడా అంటారు. ఈ

రోజున కుజదోష నివారణకు పూజలు జరుపుకోవడం ఆనవాయితీ వస్తోంది. అట్లతద్ది రోజున తమ ఇంట్లో అట్లు వేసి ఒకరికొకరు వాయనంగా ఇచ్చిపుచ్చుకుంటారు. ఆడ పిల్లలు చెట్లకు ఊయలలు కట్టి సంతోషంగా ఊగుతూ అపూర్వ అనుభూతులను పొందుతారు. వివాహిత మహిళలు తమ భర్తల ఆయురారోగ్యాల కోసం, పెళ్లి కాని అమ్మాయిలు మంచి మొగుడు దొరకాలని అట్లతద్ది నోములు ఆచరిస్తారు.

అట్లతద్ది నోముల పురాణ కథ: పూర్వం ఓ రాజు కూతురు, ఓ మంత్రి కూతురు, ఓ సేనాని కూతురు, ఓ పురోహితుడి కూతురు నలుగురూ స్నేహంగా కలిసి మెలిసి ఉండేవారు. ఓ రోజు అట్లతద్ది పండుగ వస్తుంది. ఆ రోజు రాత్రి చంద్రుడికి పూజ చేయడానికి వాళ్లు సిద్ధమవుతారు. పెద్దలు దేవీ పూజకు నైవేద్యం సమర్పించడానికి అట్లు వేయడంలో నిమగ్నమై ఉంటారు. ఇంతలో రాజు కూతురు ఆకలితో సొమ్మసిల్లి పడిపోతుంది. వెంటనే రాజకుమారి అన్న తన చెల్లెలికి అద్దంలో తెల్లని వస్తువు చూపి చంద్రోదయం అయ్యింది తెల్లీ అని, కొన్ని పండ్లు తిని సేదదీరి పూజ కొనసాగించమని అంటాడు. అప్పుడు రాకుమారి ఉపవాసం విరమించి ఆహారం తీసుకొని పూజను చేసుకుంటుంది. ఇలా చంద్రోదయం తర్వాత మాత్రమే ఉమాదేవికి పూజలు చేయడం, 9 అట్లు నైవేద్యంగా పెట్టి, వాటిని వాయనం ఇవ్వడం, 9 పువ్వులతో ముడి తోరం కట్టుకుంటారు. ఇలా చేయడం వల్ల మంచి భర్త వస్తాడని నమ్ముతారు. నలుగురు స్నేహితుల్లో రాకుమారికి ముసలి భర్తను ఎంపిక చేస్తారు. మింగిన ముగ్గురికి మంచి యవ్వనులైన భర్తలు వస్తారు. దీనికి దుఃఖించిన రాకుమారి పారిపోయి మర్రి చెట్టు నీడన ఏడ్వడంతో పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై నీ అన్న అజ్ఞానం, నీ మీద ప్రేమ కారణంగా వ్రత భంగం జరగడంతో నీకు ముసలి భర్తను ఎంపిక చేశారని, అట్లతద్ది పూజను సరిగ్గా చేయమని సూచిస్తారు. దానితో యువరాణి మళ్లీ పద్ధతి ప్రకారం అట్లతద్ది నోము చేయడంతో తనకు మంచి అందమైన భర్త లభిస్తాడు. అట్లతద్ది రోజు చంద్రోదయం తర్వాత మాత్రమే పూజను ముగించి ఆహారం తీసుకోవాలనే ఆచారం ఏర్పడింది.

కర్వా చౌత్ పండుగ: ప్రపంచవ్యాప్తంగా హిందూ పౌర సమాజం జరుపుకునే ముఖ్య పర్వదినాల్లో "కర్వా చౌత్" లేదా "కరక చతుర్థి" కూడా ఒకటి కావడం గమనార్హం. శివపార్వతులను పూజించే పండుగగా దీనిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. కార్తీకమాసంలో కృష్ణ పక్షం చతుర్థి తిథి రోజున కర్వా చౌత్ పండుగను ఉత్తర భారతం జరుపుకుంటారు.

-డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

వెలుతురు

బుధవారం 28.10.2026

పేజీలు : 12 వెల : రూ. 5/-

సంపుటి : 09
సంచిక : 135

తెలుగు దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD

www.velthuru.com

Follow :

ఈసీ అఫిడవిట్ మోసపూరితం

- ఆ సంస్థకే నష్టం చేకూర్చేలా ఉంది
- ఈసీ అఫిడవిట్ దాఖలు చేయడంపై కాంగ్రెస్ విరమ్మలు

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 27 :

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై సుప్రీంకోర్టులో ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్‌ను కాంగ్రెస్ తీవ్రంగా తప్పుబట్టింది. ఆ వివరణలో వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం కనిపిస్తోందని తెలిపింది. ఇది ఎన్నికల సంఘం విశ్వసనీయతకే నష్టం కలిగిస్తుందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఆ అఫిడవిట్ మోసపూరితంగా ఉందని, పరస్పర విరుద్ధమైన వాదనలతో కూడుకున్నదని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ పోస్ట్ చేశారు. మరోవైపు నవంబర్ 1న - మిగతా 4 లో..

రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం, భూ హక్కుల పరిరక్షణ, పారదర్శక భూ రికార్డుల నిర్వహణ లక్ష్యంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు మంత్రులు . ప్రతి భూ యజమానికి ఆధార్ తరహాలో 'భూదార్' పేరుతో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలను పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరచనున్నట్లు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామిలు పేర్కొన్నారు.

ప్రతి భూ యజమానికి 'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య

ప్రతి పేదవాడి భూ హక్కులకు రక్షణ కల్పిస్తాం

ప్రజా ప్రభుత్వం పేదలు, నిరుపేదలు, భూములు కలిగిన రైతులు సహా అన్ని వర్గాల ప్రజల హక్కులకు రక్షణ కల్పించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన నిలిచి, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటాం.

- మంత్రి పొంగులేటి

ఉపగ్రహ చిత్రాలతో కూడిన భూ పటాలు పట్టాదారు పాస్ పుస్తకాల్లో పొందుపరుస్తాం

- ప్రతి జిల్లాలో తొలి విడతగా 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే
- రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపును 15 రోజుల్లో పూర్తి చేయాలి
- ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం.. రైతులు సహకరించాలి
- ప్రజాపాలన - ఉమ్మడి మెదక్ జిల్లా సమీక్షలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి వెల్లడి

సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 27:

మంగళవారం సంగారెడ్డి జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర్ రాజనర్సింహ ప్రభుత్వ ప్రాధాన్యతలు, భూ సర్వే, రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి సమస్యలు తదితర అంశాలపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా భూ సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గతంలో అమల్లో ఉన్న ధరణి విధానంలో ఎదురైన సమస్యలకు పరిష్కారం చూపుతూ, భూ పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి నాయకత్వంలో భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. తొలి విడతలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాల్లో భూ సర్వే నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

నిర్దేశించిన లక్ష్యాల మేరకు సర్వేను పూర్తి చేసి, భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులకు సంబంధించి స్పష్టత తీసుకురావాలని అధికారులకు సూచించామని తెలిపారు.

- మిగతా 4 లో..

క్రికెట్ ప్రపంచాన్ని అభిషేక్ చేశాడు

పవర్ ప్లేలో భారత్ ప్రపంచ రికార్డు!

- తొలి ఆరు ఓవర్లలోనే 118 పరుగులు..
- కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డ భారత ఓపెనర్ల
- ఆస్ట్రేలియా రికార్డు బద్దలు..
- అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ విధ్వంసక బ్యాటింగ్

వెల్లింగ్టన్, వెలుతురు అక్టోబర్ 27:

అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్‌తో జరుగుతున్న మూడో టీ20లో భారత ఓపెనర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. తొలి ఆరు ఓవర్ల పవర్‌ప్లేలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా భారీ షాట్లతో విరుచుకుపడ్డారు. గతంలో ఆస్ట్రేలియా పేరిట ఉన్న 113/1రికార్డును అధిగమించారు.

భారత ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. బౌండరీలు, సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. వీరిద్దరూ కలిసి తొలి ఆరు ఓవర్లలోనే జట్టును 118 పరుగుల భారీ స్కోరుకు చేర్చారు. కాగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3-0తో సొంతం చేసుకుంది.

అభిషేక్ శర్మ విధ్వంసం

199 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భారత్‌కు అభిషేక్ శర్మ అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్లతో 113 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. బౌండరీలతో పాటు భారీ సిక్సర్లతో న్యూజిలాండ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అతడి దూకుడైన బ్యాటింగ్‌తో భారత్ లక్ష్యాన్ని ఊహించిన దానికంటే వేగంగా చేరుకుంది.

ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడు అఖిలపక్ష భేటీ

- భట్టి విక్రమార్క అధ్యక్షతన సమావేశం..
- కరువు నివారణ చర్యలపై చర్చ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27:

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు, కరువు పరిస్థితులపై చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మధ్యాహ్నం 2.30 గంటలకు హైదరాబాద్‌లోని - మిగతా 4 లో..

నవంబర్ 5న కరీంనగర్‌లో మహా ర్యాలీ

4

- దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా నిర్వహిస్తాం
- 'సర్'పై విపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొడదాం
- అన్ని వర్గాలను భాగస్వాములను చేయాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు

పోలీస్ క్రికెట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

- 3వ ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నీకి తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యం
- డిసెంబరు 10 నుంచి21 వరకు ఆల్ ఇండియా పోలీస్ టీ20 (పురుషులు) క్రికెట్ టోర్నీ

- వివరాలు 12 లో..

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే!

- వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధించడమే మా లక్ష్యం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, 100 అసెంబ్లీ సీట్లు సాధించడమే తమ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షు డు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు భ్రమల్లో ఉన్నారని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు.

- హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27

4

రండి చెరువుల అభివృద్ధికి ఊతమివ్వండి

సింగిల్ విండో మాదిరి అనుమతులు మంజూరు చేస్తాం

ఢిల్లీ సదస్సులో సీఎస్ ఆర్ సంస్థలకు హైడ్రా కమిషనర్ పిలుపు

11

బుర్కా మాటున బంగారం మాయం!

- ఉప్పల్‌లో 30తులాల బంగారం చోరీ
- రూ.6 లక్షల నగదు అపహరణ
- గంటసేపు ఇంట్లోనే దుండగుడు..
- సీసీ కెమెరాలతో పోలీసుల వేట

4

చచ్చిపోతేనే బిల్లులు.. బతికుంటే పట్టించుకోరా?

సిద్దిపేట, వెలుతురు అక్టోబరు 27:

కాంగ్రెస్ పాలనలో చచ్చిపోతేనే పనులు అవుతున్నాయా? బిల్లులు వస్తున్నాయా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పౌరసరఫరాల సంస్థను రూ.లక్ష కోట్ల అప్పుల్లో ముంచారని, 16 నెలలుగా నిల్వ ఉంచిన రూ.600 కోట్ల విలువైన దొడ్డు బియ్యం పురుగులు, ఎలుకల పాలైందని ఆరోపించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రేషన్ డీలర్లకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, క్వింటాలుకు రూ.300 కమిషన్, రేషన్ దుకాణాలను మినీ సూపర్ మార్కెట్లుగా మార్చే హామీలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిందని గుర్తుచేశారు.

రూ.600 కోట్ల దొడ్డు బియ్యం వృథా..

- రూ.లక్ష కోట్ల అప్పుల్లో పౌరసరఫరాల సంస్థ
- రేషన్ డీలర్ల సమస్యలపై హరీశ్‌రావు ధ్వజం

ఓట్లు వేయించుకుని మూడేళ్లయినా హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. 17,200 మంది డీలర్ల సమస్యలపై చర్చించేందుకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజుకు కనీసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని విమర్శించారు.

రేషన్ దుకాణాలు, గోదాముల్లో లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వ ఉండగా, వాటిని సకాలంలో వేలం వేసి విక్రయించకుండా వృథా చేశారని ఆరోపించారు. ఇప్పుడు నిల్వల్లో తరుగుకు డీలర్లను బాధ్యులను చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో పౌరసరఫరాల సంస్థ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు.

మరోవైపు క్యాంపు కార్యాలయాలు, క్రీడా కార్యక్రమాలకు వందల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వానికి డీలర్లకు నెలకు రూ.10 కోట్ల గౌరవ వేతనం ఇచ్చే మనసు లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెంటనే డీలర్ల సంఘాన్ని చర్చలకు పిలిచి హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీ, మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

నవంబర్ 5న కరీంనగర్‌లో మహా ర్యాలీ

- దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా వేలాది మందితో నిర్వహిస్తాం
- 'సర్'పై విపక్షాల విష ప్రచారాన్ని తిప్పికొడదాం
- అన్ని వర్గాలను భాగస్వాములను చేయాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు

కరీంనగర్, వెలుతురు, అక్టోబర్ 27 :

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై కాంగ్రెస్, విపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నవంబర్ 5న కరీంనగర్‌లో వేలాది మందితో మహా ర్యాలీ నిర్వహించనున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం.. అరాచకత్వాన్ని అంతం చేద్దాం' నినాదంతో దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా వినూత్న రీతిలో ర్యాలీ చేపడతామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావుతోపాటు జాతీయ నేతలు హాజరవుతారని తెలిపారు. కరీంనగర్‌లోని శుభమంగళ కన్వెన్షన్‌లో నిర్వహిం చిన బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ర్యాలీ ఏర్పాట్లు, జన సమీకరణపై సమీక్షించారు.

ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించారంటూ విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారి పేర్లను తొలగించడంలో తప్పేముందని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో రోహింగ్యాలు, నకిలీ ఓట్లతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు గెలుస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో మోదీని ఎదుర్కోలేక విపక్షాలు కుట్రలకు పాల్పడుతున్నాయని విమర్శించారు.

సర్ ప్రక్రియపై వాస్తవాలను కరపత్రాల ద్వారా ఇంటింటికీ చేరవేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతోపాటు విద్యార్థులు, యువత, న్యాయవాదులు, వైద్యులు, మేధావులు సహా అన్ని వర్గాలను ర్యాలీలో భాగస్వాములను చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలవారీగా సమావేశాలు నిర్వహించి జన సమీకరణ చేపట్టాలని, రవాణా, వసతి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్,జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం, రెడ్డబోయిన గోపి, మేయర్ కొలగాని శ్రీనివాస్, ఉప మేయర్ సునీల్‌రావులు పాల్గొన్నారు. టోర్నమెంట్ నిర్వహణ కోసం అడ్మినిస్ట్రేషన్, రవాణా, మీడియా ప్రచారం,భద్రత, సాంకేతిక, మ్యాచ్‌ల సమన్వయం, ఆర్థిక వ్యవహారాల కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. జాతీయస్థాయి పోటీలకు హైదరాబాద్ వేదిక కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని డిజిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈసీ అఫిడవిట్ మోసపూరితం

(3వ పేజీ తరువాయి)

దిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ఇండియా కూటమి ర్యాలీకి అనుమతి ఉపసంహరించలేదని పోలీసులు స్పష్టం చేశారు.

ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6లో ఎలాంటి మార్పులూ చేయలేదని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొంది. అయితే, ఫారంతోపాటు జతచేసిన కొత్త డిక్లరేషన్ విషయంలో ఈసీ తన వైఖరిని మార్చు కుంటోందని జైరాం రమేశ్ ఆరోపించారు. ఆ డిక్లరేషన్‌ను తప్పనిసరిగా పూర్తి చేయనిదే ఆన్‌లైన్‌లో ఫారం-6 సమర్పించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. 1960 నాటి ఓటర్ల నమోదు నిబంధనలను ఎన్నికల సంఘం ఉల్లంఘించిందని ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక ఉత్తర్వులపై మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ వాటిని పట్టించుకోలేదని పేర్కొన్నారు.

ఎల్‌నినో, కరువు పరిస్థితులపై నేడు అఖిలపక్ష భేటీ

(3వ పేజీ తరువాయి)

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆరో అంతస్తులోని గది నంబర్ 33లో ఈ సమావేశం జరగనుంది. రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం లోటు నేపథ్యంలో ప్రజలు, రైతులపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించనున్నారు. తాగునీటి సరఫరా, నీటి వనరుల పరిరక్షణ, సాగునీటికి విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక వంటి కీలక అంశాలపై రాజకీయ పార్టీల నేతల నుంచి సలహాలు, సూచనలు స్వీక రించనున్నారు. కరువు నివారణకు అనుసరిం చాల్సిన వ్యూహాలు, అవసరమైన ముందస్తు చర్యలపై అఖిలపక్ష నేతల అభిప్రాయాలను ప్రభుత్వం తెలుసుకోనుంది. రాష్ట్రంలో కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ప్రభుత్వం కోరనుంది.

భారీ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

సికింద్రాబాద్, వెలుతురు అక్టోబరు 27:

మారేడ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంట్లో భారీ చోరీ జరిగింది. 15లక్షల నగదు, 1.18కిలోల బంగారు ఆభరణాల చోరీ కి గురయింది. పోలీసులు కేసును రెండు రోజుల్లోనే ఛేదించారు. చోరీ నగదు, బంగారం యధాతథంగా స్వాదీనం చేసుకున్నారు. ఇంటి గుట్టు తెలిసిన కార్పెంటర్ చోరీకి పాల్పడినట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ వెల్లడించారు. బోడుప్పల్ కు చెందిన వడ్రంగి వెలిశాల భరత్ ఇల్లు కట్టుకొని అప్పులపాలైయాడు. దొంగతనం చేయడం ద్వారా అప్పుల నుండి బయట పడాలనే దూరలోచన చేసాడు. దాదాపు 15ఏళ్లుగా పరిచయమున్న వైద్యుల ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డాడు. ఇంటితో పాటు పరిసరాలలో సీసీ కెమెరాలు లేక పోవడం శోచనీయం. సీపీ ఆదేశాలతో మా సురక్ష 2.ఎ కార్యక్రమం చేపడుతున్నాము. ఇందులో సీసీ కెమెరాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు. సీసీ కెమెరాల ఏర్పాటు వలన నేరాల నియంత్రణతో పాటు, నేరాల డిటెక్షన్ కూడా త్వరగా చేయడానికి సహాయ పడతాయని అన్నారు.

రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే!

- వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు సాధించడమే మా లక్ష్యం
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27:

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, 100 అసెంబ్లీ సీట్లు సాధించడమే తమ లక్ష్యమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు భ్రమల్లో ఉన్నారని, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడం లేదని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు రాజకీయ అంశాలపై మాట్లాడారు.

నవంబర్ నెలలో రాష్ట్రంలోని అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసిన మహేశ్ కుమార్ గౌడ్.. నవంబర్ తర్వాత ప్రత్యక్ష ఎన్నికలపై దృష్టి సారిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి తమకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని, కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమన్వయం దేశంలో మరే పార్టీలోనూ లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేస్తున్నారని, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కూడా తాను చూశానని చెప్పారు.

కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో బలం

ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయని, కానీ పార్టీ శాశ్వతమని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీనే తమకు ప్రధాన బలమని, క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ పథకం, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందినవారు, 90 వేల ఉద్యోగాలు పొందినవారు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌పై విమర్శలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మేధావిగా భావిస్తామని, అయితే సరైన ఆలోచన లేకుండా అప్పులు చేశారని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఎల్‌నినో అంశంపై హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలు సరికావని అన్నారు. దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉందని పేర్కొన్నారు.

బీజేపీకి భవిష్యత్తు లేదని వ్యాఖ్యలు

తెలంగాణలో బీజేపీ ఇప్పట్లో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న ఎనిమిది ఎంపీ స్థానాల్లో రెండు స్థానాలు గెలుచుకున్నా ఎక్కువేనని వ్యాఖ్యానించారు. బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరు కూడా మళ్లీ గెలవరని జోస్యం చెప్పారు. ఆది లాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో 40 శాతం సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని ఆయన పరోక్షంగా స్పష్టం చేశారు.

బుర్కా మాటున బంగారం మాయం!

- ఉప్పల్‌లో 30తులాల బంగారం చోరీ
- రూ.6 లక్షల నగదు అపహరణ
- గంటసేపు ఇంట్లోనే దుండగుడు..
- సీసీ కెమెరాలతో పోలీసుల వేట

ఉప్పల్, వెలుతురు అక్టోబర్ 27:

ఉప్పల్ ప్రాంతంలో భారీ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది. న్యూ భారత్ నగర్ కాలనీలో నివాసముంటున్న భాస్కర్ రెడ్డి ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని దుండగుడు భారీ మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదును అపహరించుకెళ్లాడు. కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి కొమరవెల్లి దేవస్థానానికి వెళ్లిన సమయాన్ని అదునుగా తీసుకున్న దుండగుడు ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన నిందితుడు సుమారు 30 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.6 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడాన్ని గమనించిన దుండగుడు పక్కా ప్రణాళికతోనే చోరీకి పాల్పడి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బుర్కా ధరించి వచ్చి.. గంటసేపు ఇంట్లోనే!

ఈ చోరీ ఘటనలో దుండగుడు బుర్కా ధరించి ఇంట్లోకి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లిన నిందితుడు దాదాపు గంటసేపు ఇంట్లోనే ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో ఇంట్లోని వస్తువులను పరిశీలిస్తూ బంగారు ఆభరణాలు, నగదును గుర్తించి అపహరించినట్లు తెలుస్తోంది. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే నిందితుడు ఇంట్లోకి ఏ సమయంలో ప్రవేశించాడు? ఏ మార్గంలో వచ్చాడు? చోరీ అనంతరం ఎటు వైపు వెళ్లాడు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాల్లో కీలక దృశ్యాలు రికార్డైనట్లు సమాచారం.

సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు

ఇంట్లో చోరీ జరిగిన విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఉప్పల్ పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ జరిగిన ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుడి కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. బుర్కా ధరించి వచ్చిన వ్యక్తి ఎవరనే కోణంలోనూ విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. నిందితుడు ఒక్కడే ఈ చోరీకి పాల్పడ్డాడా? మరెవరైనా సహకరించారా? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీవాసుల్లో ఆందోళన

ఒకే ఘటనలో 30 తులాల బంగారం, రూ.6 లక్షల నగదు అపహరణకు గురైనట్లు తెలియడంతో న్యూ భారత్ నగర్ కాలనీ వాసుల్లో ఆందోళన నెలకొంది. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడటం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించాలని స్థానికులు భావిస్తున్నారు. ఈ భారీ చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు త్వరగా గుర్తించి, అపహరణకు గురైన బంగారు ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు ఆశిస్తున్నారు. ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితుడి ఆచూకీ, చోరీకి సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

నైనీ బొగ్గు రవాణా మార్గాల నిర్మాణానికి సహకారం అందించండి

- అంగూల్ జిల్లా కలెక్టర్‌ను కోరిన సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి
- 40 మంది ప్రాజెక్టు ప్రభావిత నిర్వాసితుల కోసం ఆర్ అండ్ ఆర్ కేంద్రానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి
- ఒడిశాలో సింగరేణి కార్యాలయం, ఉద్యోగుల కాలనీ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని ప్రతిపాదన
- సింగరేణికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్

సింగరేణి భవన్, వెలుతురు అక్టోబరు 27

సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో తమ నైనీ బొగ్గు గని సమీపంలో నిర్మించ తలపెట్టిన సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం, నైనీ నిర్వాసితులకు ఉద్దేశించిన ఆర్ అండ్ ఆర్ కాలనీ, బొగ్గు రవాణాకు అవసరమైన రోడ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల కేటాయింపు వంటి అంశాలపై అంగూల్ జిల్లా కలెక్టర్ మహ్మద్ అబ్దల్ అక్తార్‌తో సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి మంగళవారం ప్రత్యేకించి సమావేశం అయ్యారు.అంశాల వారీగా చర్చించి తగిన సహకారం అందించాల్సిందిగా కోరారు. దీనికి జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

ఈ సమావేశంలో ఛైర్మన్ తో పాటు సింగరేణి డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్. వి సూర్యనారాయణ, ఈడీ(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు నిర్మాణాలకు అవసరమైన స్థల సేకరణ, అనుమతులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. నైనీ బొగ్గు గని వల్ల నిర్వాసితులైన 40 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణం కోసం తగిన స్థలాన్ని మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను సింగరేణి ఛైర్మన్ కోరారు. అలాగే త్వరలోనే రిహాబిలిటేషన్ అండ్ పెరిఫెరి అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, కాలనీ నిర్మాణానికి భూసేకరణ, పునరావాసం ప్యాకేజీలు మొదలైన సమస్యలపై నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సింగరేణి సంస్థ నైనీ బొగ్గు గనికి అనుబంధంగా సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, దీనికి సంబంధించి తుకుడా, జరపడా గ్రామాలకు చెందిన స్థలం అనుకూలమైనదిగా గుర్తించామని, ఈ స్థల సేకరణకు సహకారం అందించాలని కోరారు. ప్రస్తుతం నైనీ బ్లాక్ నుండి ఉత్పత్తి చేస్తున్న బొగ్గును సమీపంలో గల జరపడా రైల్వే జంక్షన్‌కు రవాణా చేయడం కోసం చండీపడా -జరపడా గ్రామాల మధ్య నిర్మించ తలపెట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం సింగరేణి సంస్థ తనవంతుగా ఇప్పటికే 35 కోట్ల రూపాయలు డిపాజిట్ చేసిందని, ఈ రోడ్డు కోల్ కారిడార్ మాదిరిగా మారి ఇతర బొగ్గు ఉత్పత్తి పరిశ్రమలకు కూడా ఉపయోగపడుతుంది, కాబట్టి సంబంధిత శాఖల సహకారంతో నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. సింగరేణి సంస్థ ఒడిశాలో తన కార్యకలాపాలు విస్తరిస్తున్న నేపథ్యంలో సింగరేణి కార్యాలయ నిర్మాణానికి, ఉద్యోగుల నివాస కాలనీ నిర్మాణానికి తగిన స్థలాన్ని గుర్తించి తమకు కేటాయించాలని కూడా కోరారు. స్థానిక గ్రామాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బొగ్గు రవాణా జరపడం కోసం మార్ఖికా బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకరించాలని, ఇప్పటికే సింగరేణి సంస్థ ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కోసం నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సింగరేణి సంస్థకు తాము అన్ని రకాలుగా సహకరిస్తామని, దేశ విద్యుత్ అవసరాల కోసం కృషి చేస్తున్న సింగరేణికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

ప్రపంచంలోనే తొలి కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్ సందర్శన

అంగూల్ జిల్లాలో జిందాల్ సంస్థ ఏర్పాటు చేసిన ప్రపంచంలోనే తొలి కోల్ గ్యాసిఫికేషన్ ప్లాంట్ ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, సింగరేణి డైరెక్టర్లు గౌతమ్ పోట్రు, ఎల్. వి సూర్యనారాయణ, ఈడీ(కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్ సందర్శించారు. ఈ ప్లాంట్‌లో దేశీయ బొగ్గుతో గ్యాస్ ఉత్పత్తి చేస్తూ దాన్ని జిందాల్ స్టీల్ కోసం వినియోగిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. సింగరేణిలో మూతపడిన భూ గర్భ గనుల నుంచి కోల్ గ్యాసిఫికేషన్‌కు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలు, కేంద్ర ప్రభుత్వ రాయితీలు తదితర అంశాలపై నిపుణులతో చర్చించారు. ఈ జిందాల్ ప్లాంట్ కు సింగరేణి నైనీ గని నుంచి కూడా కొంత బొగ్గు రవాణా అవుతోండటం విశేషం. ఈ సమావేశంలో ఇంకా నైనీ గని జనరల్ మేనేజర్ శ్రీ బైద్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'భూదార్' ప్రత్యేక గుర్తింపు సంఖ్య

(3వ పేజీ తరువాయి)

ఇప్పటికే ఏడు ఉమ్మడి జిల్లాల్లో ఇదే తరహా సమీక్షా సమావేశాలు నిర్వహించామని, ఎనిమిదో సమావేశాన్ని ఉమ్మడి మెదక్ జిల్లాలో నిర్వహిస్తున్నామని మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు భూయజమానుల హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.

ప్రతి పేదవాడి భూ హక్కులకు రక్షణ

ప్రజా ప్రభుత్వం పేదలు, నిరుపేదలు, భూములు కలిగిన రైతులు సహా అన్ని వర్గాల ప్రజల హక్కులకు రక్షణ కల్పించేలా అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ, అర్హులైన వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజల పక్షాన నిలిచి, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. గతంలో అసంపూర్తిగా వదిలేసిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలను ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేస్తోందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు 90శాతం ఇళ్లను అర్హులైన పేదలకు కులం, మతం, ప్రాంతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా 15 రోజుల్లోగా అర్హులకు కేటాయించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అదేవిధంగా, ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అవసరమైన ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో నీటి లభ్యతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ గార్లు తెలిపారు. ఇప్పటికే సింగూరు వంటి ప్రాజెక్టుల్లో నీటి సమస్యలు తలెత్తుతున్నాయని, రాబోయే రోజుల్లో ఇతర ప్రాజెక్టుల్లోనూ తాగునీటి లభ్యతకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా కరువు పరిస్థితులు తీవ్రతరం అయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రెండో పంట సాగుకు అవసరమైన నీరు, విద్యుత్‌ను సమకూర్చేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసినా, నీటి లభ్యతే ప్రధాన సమస్యగా మారే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఈ సమస్య ఒక్క తెలంగాణకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా నీటి ఎద్దడి పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయని మంత్రులు తెలిపారు.

ఈ నేపథ్యంలో రైతులు పరిస్థితులను అర్థం చేసుకొని, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో పంట సాగుకు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణలో రైతులు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. నీటి కొరతపై ప్రజలు, రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించడంలో ప్రతిపక్షాలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రులు కోరారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధులను అందించి సహకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. ఈ అంశాలపై చర్చించేందుకు రేపు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని పూర్తిగా నమ్ముతున్నామని మంత్రులు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాలు, తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

తొర్రూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల అలాయ్ బలాయ్

- తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్లపట్టాలు ఇబ్రహీంపట్నం నుంచే శ్రీకారం జీవో వచ్చిన 24 గంటల్లో స్థలాలు చూపించే బాధ్యత నాది
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం వెలుతురు అక్టోబర్ 27:
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తొర్రూర్‌లో తెలంగాణ ఉద్యమకారుల.అలయ్ బలయ్‌కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూకేసీఆర్ ఒక్కరు కాదు ఎందరో పోరాడితే రాష్ట్రం వచ్చిందన్నారు ఈ దఫా ఇళ్ల పట్టాలుమళ్లీ గెలిచాక ఉద్యమకారులకు గృహనిర్మాణం ఈసారి 80వేల మెజార్టీతోనే గెలుస్తానన్న మల్‌రెడ్డి రంగారెడ్డి హైలెవెల్ కమిటీ నిర్ణయం మేరకు జీవో వచ్చిన 24 గంటల్లో తెలంగాణ ఉద్యమ కారులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు ఇబ్రహీంపట్నం నియోజక వర్గం నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు అర్హులైన ఉద్యమకారులందరికీ వారు కోరిన చోట ఇంటిస్థలం చూపించే బాధ్యత తనదని చెప్పారు తొర్రూర్‌లో మంగళవారం రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో జరిగిన అలయ్ బలయ్కార్యక్రమానికిముఖ్యఅతిథిగా మల్‌రెడ్డి హాజరయ్యారు కేసీఆర్ ఒక్కరితోనే తెలంగాణ రాలేదని ఎంతో మంది త్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం వచ్చినట్లు మల్ రెడ్డి తెలిపారు ఏలక్ష్యంతోనైతే సోనియాగాంధీ తెలంగాణ ఇ చ్చిందో పదేళ్లలో అది నెరవేరకుండా ఒక్క కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు కబ్జాలు లంచాలతో కొందరు దోచుకొని రాష్ట్రాన్ని మాత్రం ఆగం చేశారన్నారు ఉద్యమలక్ష్యం నెరవేర్చేందుకే పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు రేషన్‌కార్డులు సన్నబియ్యం పంపిణీలాంటి నిర్ణయాలు ప్రజాప్రభుత్వం తీసుకున్నట్లు చెప్పారు తెలంగాణ కోసం పోరాడిన వారికి పదేళ్లలో ఎలాంటి గుర్తింపు లభించలేదన్న మల్‌రెడ్డి ఉద్యమకారులందరికీ ఇళ్లస్థలాలు పంపిణీ చేసేందుకే హైలెవెల్ కమిటీ వేసినట్లు చెప్పారు జీవో వచ్చిన 24గంటల్లో నియోజ కవర్గంలో ఉద్యమకారులకు స్థలాలు చూపించే బాధ్యత తనదని ఎ మ్మెల్యే హామీ ఇచ్చారు రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్న మల్‌రెడ్డి రంగారెడ్డి తాను 80 వేల మెజార్టీతో గెలువకపోతే రాజకీయాలనుంచి తప్పుకుంటా నన్నారు ఈ దఫా ఇళ్లపట్టాలిస్తామని మళ్లీ గెలిచాక ఉద్యమకారు లందరికీ గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పారు కార్యక్రమం ఉద్యమకారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ

విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం

మంచాల వెలుతురు అక్టోబర్ 27:
మంచాల మండలం కేంద్రంలోని మండల ప్రాథమిక పాఠశాలలో హ్యాండ్స్ టుగెదర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మహేందర్ సార్ ఆధ్వర్యంలో మంగళవారం మంచాల మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశా రు. విద్యార్థులను ప్రోత్సహించ దంతో పాటు వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఉద్దేశంతో ఈకార్య క్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను అందజేశారు విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందించడం ద్వారా చదువుపై ఆసక్తిని పెంపొందించవచ్చని ఇలాంటి సేవా కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలువురు పేర్కొన్నారు విద్యార్థుల అభ్యున్నతికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు ఈ కార్యక్రమంలో నోముల యూపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదయ్య సార్ మంచాల ఎంపీపీఎస్ పా ఠశాల ప్రధానోపాధ్యాయురాలు రూబియానా మేడం ఐరవ్ యా దయ్య సార్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారువిద్యార్థులకు సహకారం అం దించిన హ్యాండ్స్ టుగెదర్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ మహేందర్‌కు ఉపాధ్యాయులు అభినం దనలు తెలిపారు

ఆరుట్లలో బెల్ట్ షాపులను నియంత్రించి మూసివేయాలి

- ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ ఎస్ఐకి మంచాల పోలీస్ స్టేషన్

ఎస్ఐకి వినతి పత్రం అందజేసిన సర్పంచ్, ఉపసర్పంచ్

మంచాల వెలుతురు అక్టోబర్ 27:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో బెల్టు షాపులను నియంత్రించి మూసివేయాలని కోరుతూ ఆరుట్ల గ్రామ సర్పంచ్ మానిపాటి శోభాకుమార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ మరియు వార్డు సభ్యులు కలిసి సంబంధిత ఎక్సైజ్ కార్యాలయంలో ఎస్సైకి మంచాల పోలీస్ స్టేషన్ సీఐ అ నుమతితో ఎస్సైకి అధికారులకు వినతిపత్రం అందజేశారు ఈసందర్భంగా మాట్లాడుతూ మ న గ్రామంలో యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండే ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడాలని

పాలకమండలి ఆకాంక్షిస్తోంది నేటి యువతే రేపటి పౌరులు అనే ఆలోచనతో యువతను మంచి మార్గంలో నడిపించేందుకు ప్రతిఒక్కరూబాధ్యతగా సహకరించాలి ఈవిషయాన్ని ఆరుట్ల గ్రామపెద్దలు మహిళలు యువత మరియు ప్రజానీకం అందరూ దృష్టిలో పెట్టుకుని గ్రామంలో మంచి వాతావరణం కోసం సహకరించాలని కోరుతున్నాముమన గ్రామంమన బాధ్యత మన యువత మన భవిష్యత్ అని అన్నారు వెంటనే ఎక్సైజ్ అధికారులు పోలీసు అధికారులు స్పందించి గ్రామంలో బెల్ట్ షాపులను నియం త్రించి మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు ఈకార్యక్ర మంలో గ్రామపంచాయతీ వార్డు స భ్యులు పంది శేఖర్ కొండిగారి శ్రావణ్ కుమార్ లాలగారి మన్నెమ్మ గ్రామస్తులు మానిపాటి కు మార్ మొగ్రి ఐలయ్య తదితరులు పాల్గొన్నారు

శంకర్‌పల్లిలో నీటి సరఫరాపై సమీక్ష..

- లీకేజీల నివారణకు చర్యలు
- ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత రాకుండా ముందస్తు ప్రణాళికలు
- అవసరమైన చోట అదనపు బోర్‌వెల్స్ ఏర్పాటు

శంకర్‌పల్లి, వెలుతురు అక్టోబర్ 27 :
శంకర్‌పల్లి పురపాలక సంఘం పరిధిలో నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా మంగళవారం పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ కార్యనిర్వాహక ఇంజనీర్, లైన్‌మెన్లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణ ప్రజలకు సకాలంలో నీరు అందించడంతో పాటు, రానున్న రోజుల్లో నీటి కొరత తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరా వ్యవస్థలో ఉన్న లీకేజీలను గుర్తించి అరికట్టాలని, సరఫరా సమయాలను క్రమబద్ధీకరించి ప్రజలకు నిర్దేశిత సమయాల్లో నీరు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా నీటి లభ్యతపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తాత్కాలిక, శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న నీటి సరఫరా వ్యవస్థ నిర్వహణను మెరుగుపరచాలని చర్చించారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి కొరతను నివారించేందుకు అదనపు బోర్‌వెల్స్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని నిర్ణయించారు. పురపాలక సంఘం పరిధిలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. నీటి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

కాంగ్రెస్ పాలనలో చచ్చిపోతేనే పనులు అవుతాయా?

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్లోని బింగి ఎల్లయ్య గార్డెన్స్లో ఈరోజు నిర్వహించిన రాష్ట్రవ్యాప్త రేషన్ డీలర్ల సమావేశానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తరలివచ్చిన రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి,ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, ధరావత్ మోహన్ నాయక్, అజీజ్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయికోటి రాజును నేను గత 25 ఏళ్లుగా చూస్తున్నాను. ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి సునీతా లక్ష్మారెడ్డి గారిని, పద్మా దేవేందర్ రెడ్డి గారిని, ఇప్పుడు గూడెం మహిపాల్ రెడ్డిని గౌరవ అధ్యక్షులుగా పెట్టుకుని డీలర్ల సమస్యల పరిష్కారం కోసం ఎవరిని ఎలా ఒప్పించాలో తెలిసిన నేర్పరి. అయితే ఈరోజు వేదిక మీద నాయికోటి రాజు మాట్లాడుతూ.. డీలర్ల సమస్యలు పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా, ప్రాణత్యాగానికైనా సిద్ధం అనడం నన్ను కదిలించిందని అన్నారు.

నిన్ననే జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే, డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు అనిరుధ్ రెడ్డి కూడా ఒక మాట అన్నారు.. మంత్రుల నియోజకవర్గాలకే నిధులు పోతున్నాయి, జడ్చర్లలో రోడ్లు పగుళ్లు పడ్డా రూ. 30-40 కోట్ల బిల్లులు రావడం లేదు, ఒక కాంట్రాక్టర్ చనిపోతేనే రూ. 5 కోట్ల బిల్లు పడింది, నేను

చచ్చిపోతేనే మా నియోజకవర్గ బిల్లులు వస్తాయంటే ప్రాణత్యాగానికి సిద్ధం అని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు రాష్ట్రంలో పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే.. చచ్చిపోతేనే పనులు అవుతాయా? చచ్చిపోతేనే బిల్లులు వస్తాయా? అధికార పార్టీ ఎమ్మెల్యేనే చచ్చిపోవడానికి సిద్ధమనే దుస్థితి వచ్చింది. కానీ ఎవరూ చచ్చిపోవద్దు, అందరూ బాగుండాలి. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప.. అందరం కలిసి గట్టిగా కొట్లాడి బిల్లులు, డీలర్ల కమిషన్ సాధించుకుందాం.కానీ మూడేళ్లు గడిచినా డీలర్ల వైపు కన్నెత్తి చూసే నాథుడే లేడు. కనీసం సివిల్ సప్లైస్ కమిషనర్ గానీ, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గానీ అపాయింట్మెంట్ కూడా ఇవ్వడం లేదని అధ్యక్షుడు రాజు బాధపడుతున్నారు. రేవంత్ రెడ్డి తమది ప్రజా ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటారు. ప్రజలను ఎప్పుడైనా కలిసేదే ప్రజా ప్రభుత్వం కదా! మరి 17,200 మంది రేషన్ డీలర్లు ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడికే మూడేళ్లలో అపాయింట్మెంట్ దొరకకపోతే ఇదెక్కడి ప్రజాపాలనఅని ప్రశ్నించారు.

కొడంగల్‌లో కానిస్టేబుల్, ఎస్ఐ ఉచిత శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐంఆం ఆధ్వర్యంలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ (రాఎ) ఉద్యోగాల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కేంద్రాన్ని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో నేరుగా మాట్లాడి, వారి లక్ష్యాలు, పరీక్షల సన్నద్ధత గురించి తెలుసుకుని, పోలీస్ ఉద్యోగాల సాధనకు అవసరమైన పలు సూచనలు చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారుఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలనతో నిరంతరం కృషి చేయాలని సూచించారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుతూ, ప్రతి అంశంపై పట్టు సాధించాలని, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని తెలిపారు.రాత పరీక్షలతో పాటు శారీరక దారుఢ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. అపజయాలకు నిరాశ చెందకుండా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు కృషి చేయాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.పోలీస్ ఉద్యోగం అనేది కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేయడంతో పాటు సమాజంలో శాంతిభద్రతలను కాపాడే గొప్ప బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు.

సీనియర్ నాయకులను గుర్తించండి

- జిల్లా అధ్యక్షుడు జిల్లాపై అవగాహన పెంచుకోవాలి
- జిల్లా అధ్యక్షునిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ ఆర్‌టీఏ మెంబర్ ఎర్రవల్లి జాఫర్

వికారాబాద్ లోని సత్యభారతి ఫంక్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యులు మోహన్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎర్రవల్లి జాఫర్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన సీనియర్ నాయకులను గుర్తించాలని, జిల్లా అధ్యక్షుడు జిల్లాపై పూర్తి అవగాహన పెంచుకోవాలని అన్నారు. పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వకపోతే కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నవంబర్ 1న ఢిల్లీలో జరగనున్న ఓట్ బచావో - దేశ్ బచావో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని, వికారాబాద్ జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సంస్మరణ బైక్ ర్యాలీ

పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఈరోజు జిల్లా ఎస్పి నరసింహ అధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పోలీసు అమరవీరుల సంస్మరణ బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగినది. పట్టణ పౌరులు, యువత పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఈరోజు సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఖమ్మం చౌరస్తా నుండి పిఎస్ఆర్ సెంటర్, కోర్టు చౌరస్తా మీదుగా ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వరకు పోలీసు అమరుల సంస్మరణ బైక్ ర్యాలీ నిర్వహించడం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ అధికారులతో కలిసి జిల్లా ఖమ్మం చౌరస్తా వద్ద బైక్ ర్యాలీ ప్రారంభించారు, పిఎస్అర్ సెంటర్, కల్నల్ సంతోష్ బాబు చౌరస్తా మీదుగా ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వరకు జరిగినది. ఎస్వీ కళాశాల వద్ద పౌరులతో కలిసి జై జావాన్ , జై కిసాన్, జై పోలీస్ అంటూ, పోలీసు అమరవీరుల ఆశయాలను సాధిస్తాం అని పౌరులతో కలిసి

నినాదాలు చేశారు. అమరుల స్మారకార్థం ఘనంగా నివాళి ఘటించారు.ఈ సందర్భంగా ఎస్పి నరసింహ గారు మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని సదుద్దేశంతో మరియు పోలీసులు చేసే కఠినతరమైన విధులను ప్రజలకు తెలియజేయాలని ఉద్దేశంతో నిర్వహించడం జరుగుతుందని. ప్రతి పౌరుడు పోలీసు సమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలని, పోలీసు త్యాగాలకు గుర్తుగా ప్రతి ఒక్కరు సత్రృవర్తనతో చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు, పోలీసు అమరవీరులను అనునిత్యం స్మరించుకుంటూ, నిరంతరం ప్రజలలో చిరస్మరణీయంగా ఉండటానికి నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, అర్మడ్ డిఎస్పీ నరసింహ చారి, సెక్రెటరీ కిరణ్, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు హక్కులకు భంగం కలగకుండా సవరణలు చేపట్టాలి

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

మునుగోడు,అక్టోబర్ 27 (వెలుతురు):
ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకుండా ప్రతి దరఖాస్తును, ధ్రువపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని నల్గొండ జిల్లా ఓటరు జాబితా ఎన్నికల పరిశీలకురాలు,రాష్ట్ర కళాశాల,సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపులు, మార్పులు,చేర్పుల విషయంలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.మంగళవారం మునుగోడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉన్న 171వ పోలింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. బీఎల్ఓ పద్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు.కొత్త ఓటర్ల దరఖాస్తులు, ధ్రువపత్రాల పరిశీలన, మ్యాపింగ్ కాని ఓటర్ల గుర్తింపు,నోటీసుల జారీ,ఇంటింటి తనిఖీలపై ఆరా తీశారు.ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్న సందర్భాల్లో పూర్తిస్థాయిలో నిర్ధారించుకున్న తర్వాతే అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.వీఐపీ ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని,నోటీసులు అందుకున్నవారికి విచారణ అనంతరం వారి పేరు ఓటరు జాబితాలో కొనసాగుతుందా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా తెలియజేయాలని ఆదేశించారు.నోటీసులు జారీ చేసిన ఓటర్లకు విచారణ అనంతరం వారి పేర్ల స్థితిని ఇంటికి వెళ్లి తెలియజేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వివరించారు. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, దేవరకొండ సబ్‌కలెక్టర్ కరోలిన్ చింగ్ థియాన్ మావి,చండూరు ఆర్డీవో శ్రీదేవి, మునుగోడు తహసీల్దార్ నేలపట్ల నరేష్ , ఎంఈఓ మల్లేశం, ఆర్ఐ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

మునుగోడు,అక్టోబర్ 27 (వెలుతురు):
మునుగోడు ప్రాంతానికి కృష్ణా జలాలు అందించి బీడు భూములను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన మూడేళ్ల కృషి ఫలించిందని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, మునుగోడు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు అన్నారు. ఏదుల రిజర్వాయర్ నుంచి శివన్నగూడెం ప్రాజెక్టుకు కృష్ణా జలాలను తరలించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో మంగళవారం మునుగోడు మండల కేంద్రంలోని చౌరస్తాలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా శివన్నగూడెం ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ప్రభుత్వం రూ.1,800 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే మునుగోడు, దేవరకొండ నియోజకవర్గాల్లో తాగునీరు, సాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు కృష్ణా జలాలు అందడంతో పాటు రైతుల సాగునీటి కష్టాలు తీరే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులు త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలి

- నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి
- ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలి

గుండాల అక్టోబర్ 27:(వెలుతురు):
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని, నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని గుండాల మండలం మరిపడిగ గ్రామ సర్పంచ్ గూడెపు కుమార్ సూచించారు. మంగళవారం గ్రామంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. భూగర్భ జలాలను సంరక్షించేందుకు ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి ఏ. కిషన్, విద్యుత్ శాఖ ఏఈ అంబాల నరసింహులు, పశువైద్యాధికారి ప్రత్యూష, ఏఈఓ పవన్, పంచాయతీ కార్యదర్శి మధు, మిషన్ భగీరథ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలమణి, ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్, విద్యుత్ శాఖ లైన్‌మెన్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.డి. సోనీ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అత్యాశే సైబర్ మోసగాళ్ల ఆయుధం..

- ఉచితాలు, అధిక లాభాల ఆశ చూపే మాయమాటలకు మోసపోవద్దు
- సోషల్ మీడియాలో పరిచయమయ్యే అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా
- సైబర్ మోసాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించిన జిల్లా ఎస్పీ కె. నరసింహ

సైబర్ మోసాల పట్ల ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులు, యువతను చైతన్యపరచి, ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించడమే లక్ష్యంగా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ కె. నరసింహ హాజరై విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల సమయంలో పాటించాల్సిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని ఎవరైనా ఆశ చూపితే అలాంటి మాటలను నమ్మవద్దని సూచించారు. ఉచితంగా డబ్బులు వస్తాయని, సులభంగా సంపాదించవచ్చని చెప్పే ఆకర్షణీయమైన ఆఫర్ల వెనుక మోసాలు దాగి ఉండే అవకాశం ఉందని హెచ్చరించారు. కష్టపడి సంపాదించిన డబ్బుకే విలువ ఉంటుందని, డబ్బు ఊరికే రాదనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థల విశ్వసనీయతను

పరిశీలించాలని, అధిక లాభాల ఆశతో గుర్తుతెలియని వ్యక్తులకు డబ్బులు పంపి ఆర్థికంగా నష్టపోవద్దని విద్యార్థులకు సూచించారు.సోషల్ మీడియాలో పరిచయమయ్యే వ్యక్తులతో జాగ్రత్త.. ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కూడా కొత్త మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమయ్యే కొందరు వ్యక్తులు మొదట స్నేహంగా మాట్లాడుతూ, నమ్మకం కలిగించి, ఆ తర్వాత తమ అసలు స్వరూపాన్ని బయటపెడతారని వివరించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన ప్రతి వ్యక్తిని గుడ్డిగా నమ్మకూడదని, వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, కుటుంబ సమాచారం, ఆర్థిక వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా ఖాతాల్లో వ్యక్తిగత సమాచారాన్ని అధికంగా ఉంచడం వల్ల సైబర్ నేరగాళ్లు ఆ వివరాలను సేకరించి, వాటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులు డబ్బులు అడిగినా, అనుమానాస్పద లింకులు పంపినా, పెట్టుబడుల పేరుతో ఆకర్షించినా వెంటనే స్పందించకుండా వాస్తవాలను నిర్ధారించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండటమే ఆర్థిక నష్టాల నుంచి రక్షించుకునేందుకు ప్రధాన మార్గమని పేర్కొన్నారు.

వికారాబాద్‌లో రాస్తారోకో, దిష్టిబొమ్మ దహన యత్నం

దేశ ప్రధాని నరేంద్ర మోడీపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ నాయకులు రాస్తారోకో మరియు మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించారు. ఈ నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడంతో వివాదం చెలరేగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు మీడియాతో మాట్లాడుతూ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు:

మంచిర్యాల జిల్లాలో పెద్ద పులి సంచారం

జిల్లాలో పెద్ద పులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. హాజీపూర్ మండలంలోని ర్యాలీ అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ప్రాంతానికి సమీపంలో పులి సంచరిస్తున్నట్లు తెలియడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు, పశువుల మేత కోసం అడవులు, పొలాల వైపు వెళ్లే వారు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఎటువైపు నుంచి పులి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పులి సంచారం నేపథ్యంలో సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అటవీ శాఖ అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో ఒంటరిగా తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు సూచించారు. పులి సంచారంపై అధికారులు నిఘా ఉంచి.. దాని కదలికలను గుర్తించడం ద్వారా ప్రజలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. పులి కనిపించినా.. దాని పాదముద్రలు లేదా ఇతర ఆనవాళ్లు గుర్తించినా ప్రజలు దాని దగ్గరకు వెళ్లకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. కాగా, పులి సంచారానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యావ్యవస్థ లోపాలపై తీవ్ర విమర్శలు

ఖమ్మం జిల్లాలో ఐదేళ్ల చిన్నారి ధనశ్రీ మృతి ఘటనపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో పిల్లలకు సరైన వసతులు, భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. పిల్లల విద్య, భద్రత విషయంలో ప్రభుత్వానికి అవసరమైన నిబద్ధత కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.ఖమ్మం జిల్లా కేవీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో విషకీటకం కుట్టడంతో ఐదేళ్ల ధనశ్రీ మృతి చెందిన ఘటనపై మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సారీ తల్లీ ధనశ్రీ.. నిన్ను ఈ ప్రపంచానికి దూరం చేసుకున్నాం. అన్ని బడుల్లో మంచి వసతులతో కూడిన ప్రీప్రైమరీ తరగతులు, గదులు ఉండి ఉంటే నువ్వు ఈ రోజు బతికి ఉండేదానివి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.పిల్లల విద్య, భద్రత ప్రభుత్వానికి ప్రాధాన్య అంశాలు కావాలని ఆకునూరి మురళి సూచించారు. కనీస సౌకర్యాలు లేని ప్రీప్రైమరీ పాఠశాలలను ప్రారంభించి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. రాష్ట్రంలోని 60 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా కమిషన్ సిఫార్సుల ప్రకారం నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులతో తెలంగాణ ఫౌండేషన్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యా బడ్జెట్‌ను పెంచాలని, విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ప్రభుత్వం తక్షణమే ఐదేళ్ల ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని కోరారు.మరోవైపు, అంగన్‌వాడీ టీచర్ స్థానికంగా ఉండకపోవడం, నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి మృతి చెందిందని స్థానికులు ఆరోపించారు. టీచర్‌పై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులతో కలిసి టేకులపల్లి రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ నిరసనకు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

రైతులకు సాగునీరు, మద్దతు ధర విషయంలో రాజీ లేదు

- దళారుల చేతుల్లో రైతులు మోసపోవద్దు..
- కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి
- పది రోజుల పాటు ఎస్సారెస్పీ నీరు అందించి పంటలను కాపాడాం
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు

: రైతులకు సాగునీరు అందించడం, పంటలకు మద్దతు ధర కల్పించడం విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో ఎస్సారెస్పీ ద్వారా పది రోజుల పాటు నీరు అందించి రైతుల పంటలను కాపాడామని తెలిపారు. రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల, తుర్కలమద్దికుంట గ్రామాలతో పాటు సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో మంగళవారం సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజయరమణ రావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.రైతులను మోసం చేసే దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాలిఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు విషయంలో దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు వడ్లు కొనుగోలు చేసి, మార్కెట్‌లో ధరలను తగ్గించే ప్రయత్నాలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకే పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభిస్తున్నామని వివరించారు.రైతులు ఐకేపీ, సింగిల్ విండో సొసైటీల ద్వారా ఏర్పాటు చేసిన కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. బయట మార్కెట్‌లో అధిక ధర లభిస్తే అక్కడ విక్రయించుకోవచ్చని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడం కూడా రైతుల ఇష్టమేనని స్పష్టం చేశారు.48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులుప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు క్వింటాలుకు రూ.2,462 మద్దతు ధర చెల్లిస్తామని, విక్రయించిన 48 గంటల్లోనే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందని, దీనితో కలిపి క్వింటాలుకు రూ.2,962 వరకు లభిస్తుందని వివరించారు.కొనుగోలు కేంద్రాల్లో తూకం విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత కేంద్రాల ఇన్‌చార్జీలపై చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులను తొలగిస్తామని హెచ్చరించారు.వర్షాలు, తుఫాను ప్రభావంపై రైతులకు సూచనలుతుఫాను ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు కోసిన ధాన్యం తడవకుండా పాలిథిన్ కవర్లతో కప్పి భద్రపరచుకోవాలని సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో భవిష్యత్తులో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని కోరారు. వ్యవసాయ బావుల్లో నీటి లభ్యతను బట్టి వరికి వినియోగించే నీటితో ఎక్కువ విస్తీర్ణంలో ఆరుతడి పంటలు సాగు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. వేసవిలో నీటి కొరత కారణంగా పంట నష్టం జరగకుండా రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు.రైతులకు సాగునీరు అందించడం నుంచి ధాన్యం కొనుగోలు వరకు ప్రతి విషయంలో అండగా ఉంటామని, రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమని విజయరమణ రావు పేర్కొన్నారు.

ఈటల రాజేందర్ పాదయాత్రకు బ్రేక్..

అనుమతి నిరాకరించిన పోలీసులు

మల్కాజ్‌గిరి ఎంపీ, భారతీయ జనతా పార్టీ నేత ఈటల రాజేందర్ తలపెట్టిన "మహా పాదయాత్ర"కు పోలీసులు అనుమతి నిరాకరించారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈరోజు ఉదయం ఈ యాత్ర ప్రారంభం కావాల్సి ఉండగా, చివరి నిమిషంలో పోలీసులు అనుమతి నిరాకరించడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ నుంచి నాలుగు రోజుల పాటు ఈ పాదయాత్ర జరగాల్సి ఉంది. ఇందులో భాగంగా ఈటల రాజేందర్ ఉదయాన్నే ఏదులాబాద్ చేరుకుని, స్థానిక రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 5,000 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి యాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు ఆయనను అడ్డుకున్నారుపోలీసుల చర్యపై ఈటల రాజేందర్ తీవ్రంగా స్పందించారు. తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకునే హక్కు తనకుందని ఆయన స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌కు లేఖ రాసి అనుమతి కోరినట్లు వెల్లడించారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై పార్లమెంటులో మాట్లాడారని ఈటల గుర్తుచేశారు. నాడు రేవంత్ రెడ్డి లేవనెత్తిన అంశంపైనే ఇప్పుడు తాను పాదయాత్ర చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.పోలీసుల అనుమతి నిరాకరణ నేపథ్యంలో పాదయాత్ర ముందుకు సాగుతుందా? లేదా? అనే దానిపై అనిశ్చితి నెలకొంది. ఈ క్రమంలో ఏదులాబాద్‌లో ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

భూ రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లాలో జరుగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. మంగళవారం బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి రీసర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. రీసర్వే పనులను మరింత కచ్చితత్వంతో నిర్వహించలన్నారు. రీసర్వే బృందాలకు గ్రామస్థులు, రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో యువకుడి మృతి

పట్టణంలోని హరిజనవాడలో విషాద ఘటన చోటుచేసుకుంది. కస్తాల మధు (21) అనే యువకుడు మంగళవారం తన ఇంట్లో మృతి చెందాడు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. హుజూర్‌నగర్ ఎస్సై చలిగంటి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హరిజనవాడకు చెందిన కస్తాల మధు పట్టణంలోని ఓ సీసీ కెమెరాల సర్వీసింగ్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం భోజనం చేయాలని తల్లిదండ్రులు చెప్పడంతో పై అంతస్తులోని గదిలోకి వెళ్లాడు. అయితే ఎంతసేపటికీ కిందకు తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు గదిలోకి వెళ్లి చూడగా, అతను అపస్మారక స్థితిలో కనిపించాడు.

జయేష్ రంజన్.. వీఆర్ఎస్‌కు దరఖాస్తు

తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయన నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే, ఈ దరఖాస్తుపై కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ), రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.ప్రస్తుతం జయేశ్ రంజన్ తెలంగాణ ప్రభుత్వంలో మెట్రోపాలిటన్ ప్రాంత, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యూత్ అడ్వాన్స్‌మెంట్, పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖలకు సంబంధించిన అదనపు బాధ్యతలు కూడా చూస్తున్నారు.1992 బ్యాచ్‌కు చెందిన జయేశ్ రంజన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక పదవుల్లో పనిచేశారు. వైఎస్సార్ కడప, గుంటూరు, మెదక్ జిల్లాల కలెక్టర్‌గా సేవలందించారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా, ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారుతెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య రంగాల అభివృద్ధిలో కీలక బాధ్యతలు నిర్వహించారు. హైదరాబాద్‌లో టీ-హబ్ ఏర్పాటు, ఐటీ రంగానికి సంబంధించిన విధానాల రూపకల్పనలో ముఖ్య పాత్ర పోషించారు. పరిశ్రమలకు పెట్టుబడులను ఆకర్షించే కార్యక్రమాల్లోనూ పనిచేశారు.ఈ ఏడాది ప్రభుత్వంలోని కీలక బాధ్యతలు చేపట్టిన ఆయన.. పదవీకాలం ముగియడానికి ముందే వీఆర్ఎస్ కోరడం ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా 2027 సెప్టెంబర్ 30న పదవీ విరమణ చేయాల్సి ఉండగా, ఏడాది ముందుగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

తాగు నీటిని వృధా పోనివ్వకుండా కాపాడుకుందాం

పంచాయితీ పాలకవర్గ సమావేశంలో సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 27:
ఎల్ నినో ప్రభావంతో రాబోవు రోజులలో త్రాగునీటికి చాలా గడ్డు పరిస్థితులు ఉంటాయని ఇప్పటినుండే త్రాగునీటిని పరిరక్షించుకుందామని కౌడిపల్లి పంచాయితీ లో ఏర్పాటుచేసిన పాలకవర్గ సమావేశంలో సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి దగ్గర కానీ, గల్లీలో కానీ నల్ల నీళ్లు కానీ, సింగిల్ ఫేస్ మోటారు నీళ్లు కానీ వృధా పోకుండా చూసే బాధ్యత సంబంధిత వార్డు మెంబర్ లు తీసుకోవాలని చెప్పారు. ఏ గల్లీలో కూడా త్రాగునీరు వృధా పోనివ్వకుండా చేసి మన గ్రామంలో త్రాగునీటి సమస్య లేకుండా మన పాలకవర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, వార్డు సభ్యులు రెడ్డి మాధవి మహేష్, గౌడ చర్ల ప్రశాంత్, లక్ష్మీ శరత్ కుమార్, సందీప్ కుమార్, దేవేందర్, మక్బూల్, బొంతమ్మ సంగప్ప, రమేష్, పంచాయతీ కార్యదర్శి నగేష్, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికి ఇంటి స్థలం ఇవ్వాలి

- హెల్త్ కార్డు ఇవ్వకపోవడంతో రోడ్డున పడుతున్న జర్నలిస్టు కుటుంబాలు
- మిగిలిన వారికి కూడా అక్కడేషన్ కార్డులు తక్షణమే ఇవ్వాలి
- మంత్రి పొంగులేటికి పియూడబ్ల్యూజే ఐజేయు వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి

సంగారెడ్డి వెలుతురు అక్టోబర్ 27:
సంగారెడ్డి జిల్లాలో ఉన్న అర్హులైన జర్నలిస్టులందరికీ వెంటనే ఇంటి స్థలాలను మంజూరు చేయాలని రాష్ట్ర రెవిన్యూ ,హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డిని టియుడబ్ల్యూజే ఐజేయు సంగారెడ్డి జిల్లా శాఖ కోరింది. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్తు లో మంగళవారం మంత్రి పొంగులేటి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం టియుడబ్ల్యూజేఐజేయు సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో సంఘ నేతలు మంత్రికి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మూడు సంవత్సరాలు కావస్తున్నదని, ఇప్పటివరకు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించలేదని ఈ సందర్భంగా బండారు యాదగిరి పేర్కొన్నారు. తక్షణమే అర్హులైన వారి జాబితాన్ని సేకరించి, ఇంటి స్థలాలను మంజూరు చేయాలని కోరారు. అంతేకాకుండా హెల్త్ కార్డులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా నగదు రహిత వైద్య సేవలను జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు అందే విధంగా చూడాలని పేర్కొన్నారు. హెల్త్ కార్డులు ఇవ్వకపోవడం వల్ల..పేద జర్నలిస్టులు, వారి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ ,హెల్త్ కార్డును ఇవ్వక పోవడం సమంజసం కాదని అన్నారు. దీనివల్ల జర్నలిస్టుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని బండారు యాదగిరి వివరించారు. ఇంకా అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు అందలేదని వారికి కూడా అక్రిడేషన్ కార్డులను అందించాలని మంత్రికి మూడో డిమాండ్ గా విన్నవించారు. దీంతో మంత్రి వెంటనే స్పందించారు. హైదరాబాద్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలను త్వరలో ఇవ్వబోతున్నామని చెప్పారు. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లాలో అర్హులందరికీ ఇంటి స్థలాలను కచ్చితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో నిశ్చింతగా ఉండాలని మంత్రి పొంగులేటి తెలిపారు. జిల్లాకు చెందిన మంత్రి రాజనర్సింహ కూడా సానుకూలంగా స్పందించారు. సంగారెడ్డి జిల్లా జర్నలిస్టుల సమస్యలను మంత్రి పొంగిలేటికి సంక్షిప్తంగా వివరించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కూడా వేదికపై ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఐజేయు నాయకులు రాజు నాయక్, హెచ్ఎంటీవీ శ్రీనివాస్, బాలయ్య, శ్రీకాంత్, ఫోటో జర్నలిస్టుల సంఘ అధ్యక్షుడు ఆరిఫ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో “ ఖేత్ బచావో అభియాన్”

- పాల్గొన్న జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్
- పాల్గొన్న కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రవి, ఏడిఏ పుణ్యవతి

కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 27:
కౌడిపల్లి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన “ఖేత్ బచావో అభియాన్”కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా సర్పంచ్ ల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఈసారి రైతులందరూ యాసంగిలో వరి కానీ, నీరు ఎక్కువ కావలసిన పంటలు వేయకుండా మెట్ట పంటలను వేసుకోవాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రవి మాట్లాడుతూ పంటల వైవిధ్యం పాటించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని, కృత్రిమంగా ఎరువులను తయారు చేసుకొని పంటలకు వాడితే భూమి కలుషితం కాదు మరియు మంచి సారవంతంగా ఉంటుందని అందులో పండిన పంటలను తింటే ఎలాంటి అనారోగ్యాలు రావని చెప్పారు. ఏడిఏ పుణ్యవతి మాట్లాడుతూ రైతులందరూ కూడా ప్రకృతి వ్యవసాయం చేయాలని రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి కృత్రిమంగా తయారు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, వార్డు సభ్యులు సందీప్ కుమార్, లక్ష్మీ శరత్, మాసన్న గారి హరీష్, బొంతమ్మ సంగప్ప,వ్యవసాయ అధికారి స్వప్న, ఏఈఓ స్వాతి, పంచాయతీ కార్యదర్శి నగేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

11 కేవీ విద్యుత్ తీగ తగిలి నలుగురికి తీవ్ర గాయాలు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామంలో ఇంటి నిర్మాణ పనులు చేపడుతుండగా 11 కేవీ విద్యుత్ తీగ తగిలి నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారు. ఈ ప్రమాదంలో కల్లూరి రాధ (25), కత్తుల రజిత, చిర్ర రాజు (36), కుంచం సంతోష్ (34) గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే వారి పరిస్థితి విషమంగా మారడంతో నలుగురినీ మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిలో కల్లూరి రాధ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం.

బాలల రక్షణకు చట్టాలపై అవగాహన తప్పనిసరి

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 27:
సురక్షా బచపన్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు మాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల, సనా పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి. కవితాదేవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మొహమ్మద్ ఖలీల్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి పాల్గొని విద్యార్థులకు పలు ముఖ్యమైన చట్టాలపై వివరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలని సూచించారు. పెద్దలను, తోటివారిని గౌరవిస్తూ చదువుతోపాటు సాధారణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా లేదా దురుసుగా ప్రవర్తిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తూ, లైంగిక వేధింపులకు సంబంధించిన చట్టాలు, వాటి నుంచి రక్షణ పొందే మార్గాలను వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టం (గాజుజూ) గురించి విస్తృతంగా తెలియజేశారు. ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా, తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధనకు ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని న్యాయమూర్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పాఠశాలల ప్రధానోపాధ్యా యులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 27:
చౌటుప్పల్ మండలంలోని చిన్న కొండూరు, పెద్ద కొండూరు, మసీదు గూడెం, గుండ్ల బావి ఐకెపి సెంటర్లు మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య గారు ప్రారంభించడం జరిగింది ఇట్టి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి గారు,గాజుజూ చైర్మన్ గారు మస్తాన్ బాబు గారు,గాజుజూ వైస్ చైర్మన్ శివారెడ్డి గారు సంబంధిత గ్రామాల సర్పంచ్ లు ఉప సర్పంచ్ లు మార్కెటింగ్ డైరెక్టర్లు మండల సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు కార్యదర్శి రమణ ఏపీఎం యాదయ్య సీసీలు నరసింహ విమల పిఎసిఎస్ డైరెక్టర్లు గ్రామాల పాలకవర్గం సభ్యులు, మహిళా సంఘ సభ్యులు మరియు రైతులు పాల్గొనడం జరిగింది కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గారు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని తెలియజేయడం జరిగింది రైతులందరూ కమిటీకి సహకరించాలని తెలియజేశారు.

చామనపల్లి బాధితులకు రూ. 300 కోట్లతో పునరావాసం

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చామనపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ముంపు సమస్యను ఏనాడూ పట్టించుకోలేదని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ధర్మారం మండలం చామనపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. తొలుత కటికెనపల్లికి చేరుకున్న మంత్రికి చామనపల్లి గ్రామ యువకులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి బైక్ ర్యాలీలో గ్రామానికి చేరుకున్న మంత్రికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి, గజమాలతో సత్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ముంపు సమస్య పరిష్కారం, భూ సేకరణ, పునరావాసం పై నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ.. చామనపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయి ముంపు గ్రామంగా ప్రకటించి, పునరావాసం కోసం సుమారు రూ.300 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చామనపల్లి గ్రామాన్ని దత్తత తీసుకున్నప్పటికీ, ముంపు సమస్య పరిష్కారంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణ, పునరావాస ప్రక్రియలో రాజకీయాలకు అతీతంగా అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేసి, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఎన్నికల సమయంలో చామనపల్లి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పై కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతుంటే మాజీ మంత్రి హరీశ్‌రావు విషం కక్కుతున్నారని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణంతో ఉత్తర తెలంగాణ సస్యశ్యామలం అవుతుందనే భయం బీఆర్ఎస్ నాయకుల్లో మొదలైందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు, రైతులు సుఖసంతోషాలతో ఉండటం బీఆర్ఎస్ పార్టీకి మొదటి నుంచి ఇష్టం లేదని ఆరోపించారు. ప్రజలే ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

మహిళా రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

- మహిళా రైతుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలి
- పస్తాపూర్‌లో మహిళా రైతుల హక్కుల వేదిక డిమాండ్

జహీరాబాద్ వెలుతురు అక్టోబరు 27:
మహిళా రైతులను గుర్తించి రైతులుగా గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వారి హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళా రైతుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డీడీఎస్), పస్తాపూర్ మహిళా సంఘాలు, మకాం మహిళా రైతుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం పస్తాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా రైతుల గుర్తింపు, హక్కులు, సేంద్రియ వ్యవసాయం, చిరుధాన్యాల ప్రాధాన్యంపై చర్చించారు. సెర్ప్ సలహాదారు పి.జమున మాట్లాడుతూ రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని, ప్రతి కుటుంబం ఆరు నెలలకు సరిపడా జొన్నలు, పప్పుధాన్యాలను నిల్వ చేసుకోవాలని సూచించారు. భూములను విక్రయించకుండా, సంప్రదాయ ఆహారపు అలవాట్లను కొనసాగించాలని కోరారు. మహిళా రైతుల దినోత్సవాన్ని ప్రభుత్వం గుర్తించి, వారి సమస్యలపై వినతిపత్రం స్వీకరించాలని అన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న మహిళా రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్త్రీపురుషులకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. డీడీఎస్ బోర్డు సభ్యురాలు డాక్టర్ రుక్మిణీరావు మాట్లాడుతూ మహిళలు రైతులుగా ఎదిగి సమాజానికి ఆహారాన్ని అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళా రైతుల కోసం ప్రత్యేక చట్టం తీసుకురావడంతోపాటు వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. ఆదివాసీ రైతులకు కూడా గుర్తింపు కార్డులు ఇవ్వాలని సూచించారు. డీడీఎస్ బోర్డు సభ్యురాలు మెట్లకుంట సూర్యకళమ్మ మాట్లాడుతూ వ్యవసాయంలో మహిళలకు ఎంతో అనుభవం ఉందన్నారు. కుటుంబ అవసరాలకు సరిపడా ఆహార పంటలను సాగు చేయాలని సూచించారు. నిమ్జ్ ప్రాజెక్టులో భూములు కోల్పోయినా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. సంఘం సభ్యురాలు పొట్టుపల్లి మొగులమ్మ మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసిన పంటలు తక్కువ వర్షపాతం ఉన్నప్పటికీ మంచి దిగుబడులు ఇచ్చాయని పేర్కొన్నారు. ఏడాదికి సరిపడా ఆహార ధాన్యాలను పండించుకుంటే కరువు పరిస్థితులను ఎదుర్కోవచ్చన్నారు. విత్తనాల సంరక్షణ, సంప్రదాయ సాగు పద్ధతుల ప్రాధాన్యాన్ని వివరించారు. డీడీఎస్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ మహిళా రైతులు భూసారాన్ని కాపాడుతూ సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 30 గ్రామాల్లో సేంద్రియ సాగు కొనసాగుతోందన్నారు. డాక్టర్ వైద్యనాథ్ మాట్లాడుతూ వర్షాధార, మిశ్రమ పంటల సాగుతో నీటి కొరతను అధిగమించవచ్చని సూచించారు. విత్తన సంరక్షకురాలు లక్ష్మమ్మ మాట్లాడుతూ డీడీఎస్ ద్వారా 85 రకాల విత్తనాలను సేకరించి, వాటి ప్రాధాన్యాన్ని ప్రచారం చేసినట్లు తెలిపారు. సివిల్ జడ్జి కవితాదేవి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పద్ధతుల్లో పంటలు పండించడం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా రైతులు పండించిన ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ కల్పించుకుని ఆదాయం పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో మహిళా రైతులు, సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందాలి
- దిగ్వాల్ భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలి
- జిల్లా పరిషత్ కార్యాలయంలో మంత్రుల సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 27:
జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామితో పాటు జిల్లా శాసనసభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్లినో ప్రభావం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని, దిగ్వాల్ గ్రామ భూ సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ఎల్లినో ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులందరికీ ఎలాంటి పక్షపాతం లేకుండా ప్రయోజనాలు అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.

దిగ్వాల్ భూ సమస్యలను పరిష్కరించాలి

కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామ పరిధిలో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదిత భూసేకరణ అంశాలను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సమగ్రంగా పరిశీలించి పరిష్కరించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు కోరారు. తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ/గా××జ)కు అనుకూలంగా మొత్తం 782.22 ఎకరాల అసైన్డ్, పట్టా భూముల సేకరణకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఇందులో 572.01 ఎకరాల అసైన్డ్ భూములు, 210.21 ఎకరాల పట్టా భూములు ఉన్నట్లు పేర్కొన్నారు.
ఆయా భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, పట్టాదారుల వివరాలు, యాజమాన్య హక్కులు, భూములు సంక్రమించిన విధానంపై స్పష్టత తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని సర్వే నంబర్ల పరిధిలో అటవీ, వక్ఫ్ భూములు ఉన్నట్లు నివేదికల్లో ప్రస్తావించినందున సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

రైతులకు నష్టం కలగకుండా చర్యలు

భూముల వాస్తవ స్థితిగతులను నిర్ధారించిన తర్వాతే చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రైతులు, భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా అన్ని అంశాలను పారదర్శకంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల సమన్వయంతో సమగ్ర నివేదిక రూపొందించి, దిగ్వాల్ గ్రామ భూ సమస్యలకు పరిష్కారం చూపాలని ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

అవయవదానంతో ముగ్గురికి పునర్జీవనం

చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 27:
నల్గొండ జిల్లా, హైదరాబాద్ రోడ్‌లోని వెంకటేశ్వర కాలనీకి చెందిన 51 ఏళ్ల గృహిణి శ్రీమతి చాడ నీరజ (భర్త: శ్రీ గొర్రె నర్సిరెడ్డి) అక్టోబర్ 22, 2026న అకస్మాత్తుగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఇంట్లోనే స్పృహ కోల్పోయి కుప్పకూలి పోయారు. వెంటనే ఆమెను అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్య బృందం అత్యుత్తమ చికిత్స అందించడంతో పాటు అత్యవసర న్యూరో సర్జరీలు నిర్వహించినప్పటికీ, ఆమె ఆరోగ్య పరిస్థితిలో మెరుగుదల కనిపించలేదు. దీంతో 26-10-2026న ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈమె చౌటుప్పల్ మండలం దామెర గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త శ్రీ గొర్రె నర్సిరెడ్డి గొప్ప ధైర్యాన్ని, మానవత్వాన్ని చాటుతూ అవయవదానానికి అంగీకరించారు. వారి నిస్వార్థ నిర్ణయం ద్వారా పలువురి ప్రాణాలను కాపాడటంతో పాటు మరి కొందరికి మెరుగైన జీవితం లభించే అవకాశం కలిగింది.

దానం చేసిన అవయవాలు:
మూత్రపిండాలు (కిడ్నీలు) -- 2
ఊపిరితిత్తులు -- 1
మొత్తం: 3 అవయవాలులి

ఈ సందర్భంగా జీవందాన్ తెలంగాణ (సోటో తెలంగాణ) బృందం శ్రీమతి చాడ నీరజ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తోంది. వారి నిస్వార్థమైన, ఉదారమైన నిర్ణయం మానవత్వానికి గొప్ప నిదర్శనంగా నిలుస్తూ, మరెందరో అవయవదానానికి ముందుకు రావడానికి స్ఫూర్తినిస్తుంది. జీవందాన్ తెలంగాణ ఈ ఏడాది ఇప్పటివరకు 169 బ్రెయిన్ డెడ్ అవయవదానాలను విజయవంతంగా నమోదు చేసుకోగా, నేడు జరిగిన ఈ అవయవదానం 2026 సంవత్సరంలో 170వ బ్రెయిన్ డెడ్ అవయవదానంగా నిలిచింది.

రక్తహీనతను గుర్తించి సకాలంలో చికిత్స అందించాలి

- గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27
రక్తహీనతను గుర్తించి, దాని తీవ్రతకు అనుగుణంగా చికిత్స అందించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో 'అనీమియా ముక్త్ భారత్ అభియాన్'పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలకు వచ్చే అర్హులైన వారికి హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, రక్తహీనతను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. పిల్లలు, కౌమార దశ బాలబాలికలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, ప్రసవపూర్వ, ప్రసవానంతర సంరక్షణ అందించాలని సూచించారు. అవసరమైన వారికి తదుపరి పరీక్షలు నిర్వహించి, ఉన్నత వైద్య కేంద్రాలకు పంపించాలని, చికిత్స అనంతరం నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. అన్ని రకాల రక్తహీనతలకు ఐరన్ మాత్రలే పరిష్కారం కాదని, మలేరియా, తలసేమియా, ఇతర పోషకాహార లోపాలు, వైద్యపరమైన సమస్యల వల్ల కూడా రక్తహీనత రావచ్చని

తెలిపారు. అసలు కారణాన్ని గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. ఐరన్ మాత్రలను వైద్యుల సూచనల మేరకు తీసుకోవడం, ఐరన్ అధికంగా ఉండే ఆహారం తినడం, పిల్లలకు వయసుకు తగిన పోషకాహారం అందించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఐరన్-ఫోలిక్ యాసిడ్ మాత్రల వినియోగం, పోషకాహారం, నులిపురుగుల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటి సందర్శనల ద్వారా పిల్లలు, కౌమార దశ బాలబాలికలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అనిత, డాక్టర్ సాయిబాబా,

సీనియర్ ప్రజారోగ్య అధికారులు, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, వనరుల వ్యక్తులు డాక్టర్ మనోజ్, డాక్టర్ విశాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో పరిస్థితులపై ముందస్తు చర్యలు చేపట్టాలి

జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని యాసంగి సాగు, తాగునీటి సరఫరా, భూగర్భ జలాల సంరక్షణ పై అధికారులు ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 21 శాతం లోటు నమోదైందని తెలిపారు. నీటి లభ్యతను బట్టి యాసంగిలో వరి సాగును గణనీయంగా తగ్గించి, ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే మొక్కజొన్న, ఆయిల్‌పామ్, ఉద్యాన పంటల వైపు రైతులు మళ్లేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. రానున్న 6 నెలల పాటు కొత్త బోర్ల తవ్వకాలు కఠినంగా నిరోధించాలని ఆదేశించారు. కోరుట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మార్కెట్ పరిస్థితులను బట్టి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు ముందస్తుగా సిద్ధం చేయాలన్నారు. రెండో పంటగా వరి సాగు చేయవద్దని రైతులకు సూచించారు. అలాగే, గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై స్పందిస్తూ నియోజకవర్గంలో పెరగనున్న భక్తుల రద్దీకి అనుగుణంగా రూ. 226.41 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పుష్కర పనులను, టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రసూనాంబ, ఆర్డీవో జీవాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సదాశివపేటలో భారీగా గంజాయి మొక్కల స్వాధీనం

సదాశివపేట మండల పరిధిలో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలు అలాగే ఎండు గంజాయిని ఎక్సైజ్ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి కె. శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 26న సదాశివపేట మండలం కోనాపూర్ శివారులోని సర్వే నంబర్ 206లో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించి, అక్కడి నుంచి 55 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి పండిస్తున్న మహ్మద్ ఖదీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే మరో నమ్మదగిన సమాచారం మేరకు, అంకెనపల్లి గ్రామంలోని గౌండ్ల విఠల్ గౌడ్ ఇంటిపై అధికారులు దాడి చేశారు. అక్కడ 150 గ్రాముల ఎండు గంజాయితో పాటు 10 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పట్టా భూముల్లో ఎవరైనా నిషేధిత గంజాయి సాగు చేసినట్లు తేలితే, వారికి ప్రభుత్వం అందించే 'రైతు భరోసా' పథకాన్ని నిలిపివేయడం జరుగుతుందని ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. ఎవరైనా గంజాయి సాగు చేసినా లేదా విక్రయించినా వెంటనే ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ దాడులలో ఏఎస్పీ అభినవ్ రెడ్డి, సీఐ సరిత, ఎస్ఐ సృజన్, హెడ్ కానిస్టేబుళ్లు కుద్దూస్, మహేశ్వర్, కానిస్టేబుళ్లు కుమార్, మహేశ్వర్, ఖదీర్, జ్యోతి ఇతర సిబ్బంది పాల్గొన్నారు. గంజాయిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన జిల్లా సిబ్బందిని మెదక్ డివిజన్ డిప్యూటీ కమిషనర్ చంద్రయ్య ప్రత్యేకంగా అభినందించారు.

ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం..

నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు డిమాండ్ల సాధన కోసం 15 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగులకు బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండనోళ్ల నరేష్, గజ్వేల్ అసెంబ్లీ ఇంచార్జి కేతుజు వినోద్ చారి, నాయకులు కొమ్ము చంద్రం, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు 'స్వేచ్ఛ రథం'

అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణ, వెట్టి చాకిరీ నిర్మూలన, కార్మికులపై జరుగుతున్న దోపిడీని అరికట్టడమే లక్ష్యంగా 'అసంఘటిత రంగ కార్మికుల స్వేచ్ఛ రథం' జిల్లా వ్యాప్తంగా పర్యటించనుంది. ఈ ప్రచార రథాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ జెండా ఊపి ప్రారంభించడంతో పాటు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ, భవన నిర్మాణ, హమాలీ, ఇటుక బట్టీలు, చిన్న పరిశ్రమలు, గృహ, వలస కార్మికులు సహా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న వారికి వారి హక్కులు, చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

అప్పుల పేరుతో కార్మికులను బలవంతంగా పనిచేయించడం, బెదిరింపులకు గురిచేయడం, స్వేచ్ఛను హరించడం, చేసిన పనికి తగిన వేతనం చెల్లించకపోవడం వంటి దోపిడీ పద్ధతులను అరికట్టాల్సిన అవసరం ఉందని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ డి. లక్ష్మీపతి పేర్కొన్నారు. బంధిత కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం--1976 ప్రకారం వెట్టి చాకిరీ నిషేధితమని, బాధితులను గుర్తించి విముక్తి, రక్షణ, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

కనీస వేతనాలు, సకాలంలో వేతన చెల్లింపులు, సురక్షిత పని వాతావరణం, సామాజిక భద్రతా ప్రయోజనాలు, పని ప్రదేశాల్లో ప్రమాదాల నివారణ, వేతన బకాయిలపై ఫిర్యాదుల విధానం గురించి కార్మికులకు ఈ వాహనాల ద్వారా అవగాహన కల్పించనున్నారు. ఈ-శ్రమ్ నమోదు, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రయోజనాలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమాచారం అందించి, అర్హులు వాటిని పొందేందుకు మార్గనిర్దేశం చేయనున్నారు. స్వేచ్ఛ రథం గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలు, నిర్మాణ ప్రదేశాలు, పారిశ్రామిక ప్రాంతాలు, మార్కెట్లలో పర్యటిస్తూ సమావేశాలు, కరపత్రాల పంపిణీ ద్వారా చైతన్యం కల్పించనుంది. కార్మికుల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. కార్మిక దోపిడీని అరికట్టి, ప్రతి కార్మికుడికి గౌరవప్రదమైన పని వాతావరణం, సామాజిక భద్రత కల్పించేందుకు సమష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ డి. లక్ష్మీపతి, సహాయ కార్మిక అధికారులు రేణుక, గోపిరెడ్డి, సాయి సుమన్, ఆంజనేయులు, ఏహెచ్‌టీయూ ప్రతినిధులు ఖలీల్, వీరస్వామి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్.. 17 మందికి జైలు శిక్ష- జరిమానా

మేడ్చల్: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై న్యాయస్థానం కఠిన చర్యలు చేపట్టింది. మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన విస్తృత తనిఖీల్లో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 17 మందికి న్యాయస్థానం జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించింది. మేడ్చల్‌లోని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, ఎనిమిదవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో మంగళవారం మొత్తం 24 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు విచారణకు వచ్చాయి. కేసులను క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయమూర్తి, నేరం రుజువు కావడంతో 17 మందికి జైలు శిక్ష ఖరారు చేశారు. ఇందులో 11 మందికి 2 రోజులు, నలుగురికి 3 రోజులు, ఇద్దరికి 5 రోజుల చొప్పున జైలు శిక్ష విధించడంతో పాటు నిందితులందరికీ కలిపి మొత్తం రూ.22,500 జరిమానా విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని

హెచ్చరించారు. దీనివల్ల డ్రైవర్ల ప్రాణాలతో పాటు రోడ్డుపై ప్రయాణించే ఇతర అమాయకుల ప్రాణాలకు సైతం పెను ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతో సరిపెట్టకుండా జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

గండిపేట: నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేట్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపట్టడంతో పాటు, రాక్‌వెల్ పాఠశాల విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సర్కిల్ పరిధిలోని కోకాపేట్, నార్సింగి ప్రాంతాల్లో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ, నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి తో కలిసి పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. కోకాపేట్‌లోని బీఎస్ఆర్ అపార్ట్‌మెంట్స్ వద్ద తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వాటి నివారణకు ట్రాఫిక్ సిగ్నలింగ్ లేదా స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలని అపార్ట్‌మెంట్ వాసులు ఎమ్మెల్యేను కోరారు. అలాగే రాక్‌వెల్ పాఠశాల

సమీపంలో విద్యార్థుల రాక పోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే చిన్నారుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు అశోక్ యాదవ్, వెంకటేష్ యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కోట వేణు గౌడ్ తదితరులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం నార్సింగి డివిజన్ పరిధిలోని మాక్స్ కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడి నాలాను అభివృద్ధి చేసి, బాక్స్ కల్వర్టు నిర్మించడం ద్వారా వరద నీరు సజావుగా మూసీలో కలిసేలా చర్యలు చేపట్టాలని స్థానికులు చేసిన విజ్ఞప్తిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

యాదాద్రి భువనగిరి జిల్లాలో జరుగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పరిశీలించారు. మంగళవారం బీబీనగర్ మండలం అన్నంపట్ల గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, ఆర్డీఓ కృష్ణా రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ సరిహద్దుల రీసర్వే పురోగతిపై తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడి రీసర్వే నిర్వహణకు అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అనంతరం గ్రామ రైతులు, ప్రజలతో మాట్లాడి భూ రీసర్వే ద్వారా భూముల వివరాలు కచ్చితంగా నమోదు కావడంతో పాటు భూ హక్కులకు భద్రత లభిస్తుందని వివరించారు. రీసర్వే పనులను మరింత కచ్చితత్వంతో నిర్వహించలన్నారు. రీసర్వే బృందాలకు గ్రామస్థులు, రైతులు సహకరించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యామ్ సుందర్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావంతో అప్రమత్తత అవసరం

భూసారాన్ని పరిరక్షిస్తూ, భావితరాలకు ఆరోగ్యకరమైన నేలలను అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హుజూరాబాద్ ఏడీఏ సునీత స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం 'రైతు నేస్తం' వీడియో కాన్ఫరెన్స్‌తో పాటు వ్యవసాయ శాఖ, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 'ఖేత్ బచావో అభియాన్' అవగాహన సదస్సు నిర్వహించారు. ?ఈ సందర్భంగా హుజూరాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.సునీత మాట్లాడుతూ.. రైతులు రసాయనాలపై అతిగా ఆధారపడకుండా సమతుల్య ఎరువుల వినియోగాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు సాగునీటి పొదుపు, సుస్థిర పోషక యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. అనంతరం జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడుతూ...ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాబోయే యాసంగి సీజన్ విషయంలో రైతులు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులు, నేల స్వభావాన్ని బట్టి తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. పంట కాల వ్యవధి, సరైన విత్తే సమయం, శాస్త్రీయ ఎరువుల యాజమాన్యం పై అధికారుల సలహాలు పాటిస్తే పెట్టుబడి వ్యయం తగ్గి మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.

హైదరాబాద్‌లో ఆల్ ఇండియా పోలీస్ టీ20 క్రికెట్ టోర్నీ

తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యంలో 2026 27 సంవత్సరానికి గాను మూడవ అఖిల భారత పోలీస్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ పురుషుల విభాగం.. డిసెంబర్ 10 నుండి 21 వరకు హైదరాబాద్‌లో జరగనుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు,పోలీస్ సంస్థల నుండి సుమారు 35 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం ఉంది. మంగళవారం డీజీపీ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో డీజీపీ సి.వి. ఆనంద్ సమీక్షా సమావేశం నిర్వహించి, టోర్నమెంట్ ఏర్పాట్లపై చర్చించారు. ఈ ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పోలీస్ క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇస్తుండటం పట్ల సంతోషం వ్యక్తం చేసిన డీజీపీ, ఈ క్రీడా పోటీలు విజయవంతంగా జరిగేలా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ టోర్నమెంట్ కోసం ఆరు ప్రధాన క్రికెట్ మైదానాలను, రెండు రిజర్వ్ మైదానాలను ఎంపిక చేశారు. మొయినాబాద్‌లోని ఆసిస్ నగర్‌లో ఉన్న క్రికెట్ మైదానాలను మ్యాచ్‌ల నిర్వహణ కోసం ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు డీజీపీకి వివరించారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే క్రీడాకారుల కోసం తెలంగాణ పోలీస్ అకాడమీలో వసతి కల్పించనున్నారు. క్రీడాకారులకు రవాణా సౌకర్యాలు, భోజన వసతి, మైదానాల నిర్వహణ, భద్రత మ్యాచ్‌ల సమన్వయం వంటి కీలక అంశాలపై డీజీపీ అధికారులతో చర్చించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. టోర్నమెంట్ నిర్వహణ కోసం పరిపాలన, రవాణా, మీడియా ప్రచారం, భద్రత, సాంకేతిక వ్యవహారాలు, మ్యాచ్ సమన్వయం ఆర్థిక వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి, వాటికి బాధ్యతలను అప్పగించారు. హైదరాబాద్‌లో జరగనున్న ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలు విజయవంతమయ్యేలా, అన్ని ఏర్పాట్లను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.

కన్నేపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలి

- కరువు పరిస్థితుల్లో కాళేశ్వరమే శ్రీరామరక్ష
- నీటిమట్టం సరిపోకుంటే కాఫర్ డ్యాం నిర్మించాలి
- ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చు
- రైతులను పంటలు వేయొద్దనడం ప్రభుత్వ వైఫల్యమే
- మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి విమర్శలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: ఎల్‌నినో ప్రభావంతో నెలకొనే ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కన్నేపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీటిని ఎత్తిపోసేందుకు తగినంత నీటిమట్టం లేకపోతే నెల రోజుల్లో కాఫర్ డ్యాం నిర్మించి నీటిని నిల్వ చేయవచ్చన్నారు. సీతారామ ప్రాజెక్టు వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేస్తామని మంత్రి తుమ్మల చెప్పిన విధానాన్నే ఇక్కడా అమలు చేయవచ్చని సూచించారు. రోజుకు ఒక టీఎంసీ చొప్పున ఎత్తిపోసినా ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని వినియోగించుకోవచ్చన్నారు. వృథాగా పోతున్న ప్రాణహిత జలాలను తాగు, సాగునీటితోపాటు విద్యుత్ అవసరాలకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కరువు పరిస్థితుల్లో శ్రీరామరక్షగా నిలుస్తుందన్నారు. వరి విత్తనాలు కొనుగోలు చేసే రైతుల నుంచి నీరు, విద్యుత్ అడగబోమంటూ స్వీయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవడం మూర్ఖపు ఆలోచన అని విమర్శించారు. రైతులు పంటలు పండించకపోతే ఆ ప్రభావం సమాజంలోని అన్ని వర్గాలపైనా పడుతుందన్నారు. ఇప్పటికే బియ్యం ధరలు పెరిగాయని, ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి రైతులను పంటలు వేయొద్దని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తుమ్మిడిహెట్టి విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని జీవన్‌రెడ్డి ఆరోపించారు. 30 నెలలు నిద్రపోయిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు మహారాష్ట్ర వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో తుమ్మిడిహెట్టి కోసం ఎన్నో ప్రయత్నాలు జరిగాయని, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. కేసీఆర్ మూడేళ్లలో ప్రాజెక్టు నిర్మిస్తే, రేవంత్‌రెడ్డి కనీసం మరమ్మతులు కూడా చేయలేకపోయారని విమర్శించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గురుత్వాకర్షణ ద్వారా నీటిని తీసుకొస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రేవంత్‌రెడ్డికి ఇప్పటికీ కలలో కేసీఆర్ మాత్రమే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా నాన్చివేత ధోరణి వీడి రైతుల ప్రయోజనాల కోసం కన్నేపల్లి నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. పాలన చేతకాకపోతే రేవంత్‌రెడ్డి తప్పుకొని గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించాలని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ కె.విప్లవ్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల సర్టిఫికెట్లపై సమగ్ర విచారణ చేపట్టాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27

రెగ్యులరైజ్ అయిన కాంట్రాక్టు లెక్చరర్ల విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను పారదర్శకంగా పరిశీలించి, నకిలీవని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజినీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్ బోర్డు ఎదుట ధర్నా నిర్వహించి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. 2023లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,800 మంది కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించగా, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సమర్పించినట్లు గుర్తించి ఇప్పటికే 35 మందిని తొలగించారని రజినీకాంత్ తెలిపారు. మరో 700 నుంచి 800 మంది వరకు ఇతర రాష్ట్రాల్లో పీజీ చదివినట్లు సర్టిఫికెట్లు సమర్పించి క్రమబద్ధీకరణ పొందారనే ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. అలాగే, అనుబంధ గుర్తింపు లేకుండానే విద్యార్థులను చేర్చుకుంటూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ

కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. కిరణ్, గర్ల్స్ కన్వీనర్ మమత, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలు సమృద్ధిగా కురిసి..

రైతులు సుభిక్షంగా ఉండాలి

- వనదుర్గ మహా రుద్ర యాగం, వరుణ యాగంలో వీహెచ్



అంబర్‌పేట్, వెలుతురు, అక్టోబర్ 27 : హైదరాబాద్ అంబర్‌పేట్ శ్రీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆధ్వర్యంలో అమ్మవారి ఆశీస్సులతో మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీ వనదుర్గ మహా రుద్ర యాగం, వరుణ యాగం రెండవ రోజు వైభవంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, జలాశయాలు నిండి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలనే సంకల్పంతో ఈ యాగాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ, వర్షాలు సకాలంలో కురవకపోవడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, నీటి కొరత తీరాలని, చెరువులు, కుంటలు, జలాశయాలు నిండాలని వరుణ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి రైతన్నలు ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో వరుణ యాగం చేపట్టినట్లు పేర్కొన్నారు. అమ్మవారి కృపతో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న యాగాలు విజయవంతమై, రాష్ట్రం సుభిక్షంగా మారాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. వచ్చేనెల నవంబర్ 1వ తేదీన రామ్ లీలా మైదానంలో ఓటు చోరీపై జరిగే భారీ ఎత్తున ప్రదర్శనకు ప్రతి ఒక్కరు తరలిరావాలని హనుమంతరావు కోరారు.

యువతిపై సామూహిక లైంగిక దాడి

ముగ్గురి అరెస్ట్.. రిమాండ్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27 : వివాహం చేసుకుంటానని నమ్మించి హైదరాబాద్‌కు తీసుకొచ్చిన 18 ఏళ్ల యువతిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు నిందితుల్లో ముగ్గురిని అరెస్ట్ చేశారు. చంద్రాయణగుట్ట ఏసీపీ వెల్లడించిన వివరాల ప్రకారం.. మయన్మార్/బంగ్లాదేశ్ ప్రాంతానికి చెందిన యువతిని మహమ్మద్ ఫయాజ్ వివాహం చేసుకుంటానని నమ్మించి ఈ ఏడాది మేలో హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. ఖాజీ సమక్షంలో వివాహం చేసుకున్న అనంతరం హఫీజ్‌బాబా నగర్‌లోని క్యాంపు నంబర్ 21లో అద్దె ఇంట్లో కాపురం పెట్టారు. కొంతకాలం తర్వాత ఫయాజ్ తన సహచరులైన అహ్మద్ ముజీబ్, నూర్ కమాల్, జియా ఉర్ రెహ్మాన్ అలియాస్ ఇబ్రహీంలను అదే ఇంటికి తీసుకొచ్చాడు. ఫయాజ్ బయటకు వెళ్లేటప్పుడు ఇంటికి తాళం వేసేవాడని, ఆ సమయంలో అతడి సహచరులు తనపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు తెలిపింది. ఈ నెల 23న రాత్రి 10 గంటల సమయంలో అద్దె డబ్బుల కోసం ఇంటి యజమాని వచ్చి చూడగా బయట తాళం వేసి ఉంది. దీంతో తాళాన్ని పగలగొట్టగా బాధితురాలు బయటపడింది. అనంతరం కుటుంబ సభ్యులను సంప్రదించి బాలాపూర్ రాయల్ కాలనీలోని బంధువుల ఇంటికి చేరుకుంది. ఈ నెల 26న కంచన్‌బాగ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహితలోని 64(2)(ఎం), 127(4), 351 సెక్షన్ల కింద క్రైమ్ నంబర్ 295/2026గా కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు నూర్ కమాల్ (ఏ2), అహ్మద్ ముజీబ్ (ఏ3), జియా ఉర్ రెహ్మాన్ అలియాస్ ఇబ్రహీం (ఏ4)లను అరెస్ట్ చేశారు. వీరిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుడు మహమ్మద్ ఫయాజ్ (ఏ1) అరెస్ట్ కావాల్సి ఉంది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు.

మస్కట్‌లో ఆర్మూర్ వాసి అదృశ్యం

- ఆచూకీ కనుగొనాలని సీఎం ప్రజావాణిలో విజ్ఞప్తి
- జీ.ఏ.డీ. ద్వారా ఓమన్ దేశ ఎంబసీకి లేఖ
- బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పిన సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: ఓమన్ దేశం మస్కట్ సిటీలో రెండు నెలల కిందట అదృశ్యమైన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణానికి చెందిన చెందిన ఆకుల రాజ్ కుమార్ అనే వ్యక్తి ఆచూకీ కనుగొని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని మంగళవారం సీఎం ప్రజావాణికి వచ్చిన విజ్ఞప్తిపై రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి స్పందించారు. ఈ విషయంపై జీఏడీ (జీఏడి) ద్వారా ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయానికి లేఖ పంపించి, అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ కనుగొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు, మిస్సింగ్ అయిన వ్యక్తి భార్య స్వాతికి ధైర్యం చెప్పి, వారికి అండగా ఉంటామని గద్వాల్ విజయలక్ష్మి భరోసా ఇచ్చారు. ఆర్మూర్ కు చెందిన ఉజ్వల ట్రస్ట్ చైర్మన్ మీనీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు సంఘం నాయకులు తేలు పెద్ద ఒడ్డెన్న, నడ్పి ఒడ్డెన్న సీఎం ప్రజావాణికి వచ్చారు. ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి కూడా పాల్గొన్నారు.

సీఎం ప్రజావాణిలో 140 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన 264వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 140 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. రెవెన్యూ శాఖకు 29, మున్సిపల్ శాఖకు 20, హోం శాఖకు 17, ఇతర శాఖలకు 74 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు,ఏ.సీ.పీ. ఉమేందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో శిక్షలు పడింది 32 కేసుల్లోనే

- మూడేళ్లలో 213 మంది దళితులు, గిరిజనుల హత్య
- డీజీపీని కలిసి వినతిపత్రం అందజేసిన ఎర్రోళ్ల శ్రీనివాస్ బృందం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27 : తెలంగాణలో దళితులు, గిరిజనులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ డీజీపీని కోరారు. ఈ మేరకు మాజీ కార్పొరేషన్ చైర్మన్ మేడే సాగర్, రాంబాల్ నాయక్, మాజీ కమిషన్ సభ్యులతో కలిసి మంగళవారం డీజీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో గత మూడేళ్లలో 9,102 అట్రాసిటీ కేసులు నమోదవగా, కేవలం 32 కేసుల్లోనే శిక్షలు పడటం పోలీసు వ్యవస్థ పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కేసుల్లో 159 మంది దళితులు, 54 మంది గిరిజనులు కలిపి 213 మంది హత్యకు గురయ్యారని తెలిపారు. 1,305 మంది బాలికలు, మహిళలపై లైంగిక దాడుల కేసులు నమోదైనట్లు వివరించారు. గ్రామసభల్లో మాట్లాడినా, ఆలయాల్లోకి వెళ్లినా, బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నా దళితులు, గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని ఎర్రోళ్ల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా ఫిర్యాదులు స్వీకరించడంలో, ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం జరుగుతోందని విమర్శించారు. నిందితులను సకాలంలో అరెస్టు చేయకపోవడం వల్ల వారిలో చట్టమంటే భయం లేకుండా పోతోందన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నీరుకుల శివారులో దళిత యువకుడు చిలుక ఉదయ్‌పై దాడి, నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలో గ్రామసభలో మాట్లాడిన గనిపాల్లి మాధవిపై దాడి, వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లిలో దళిత కుటుంబాన్ని గ్రామ ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న ఘటనలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. మెదక్ జిల్లాలోని పలు గ్రామాల్లో బతుకమ్మ వేడుకల సందర్భంగా దళితులపై దాడులు జరిగినా నిందితులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని తెలిపారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తల్లపేటలో గిరిజన మహిళ, సర్పంచ్ కుర్సింగ కళావతితో పాటు ఉపసర్పంచ్‌పై పోలీసు అధికారి దాడి చేశారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, చార్జిషీట్ల దాఖలుకు గడువు విధించాలని ఎర్రోళ్ల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో సమీక్ష నిర్వహించి కేసుల విచారణలో జాప్యానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అట్రాసిటీ ఫిర్యాదు అందిన రోజే ఎఫ్ఐఆర్ నమోదు చేసేలా ఆదేశాలు జారీ చేయాలని, నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షల శాతం పెంచేందుకు సాక్ష్యాధారాల సేకరణను పటిష్ఠం చేయడంతోపాటు ప్రత్యేక కోర్టులకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని కోరారు. ప్రతి మూడు నెలలకోసారి జిల్లాల వారీగా కేసులు, చార్జిషీట్లు, శిక్షల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులకు పూర్తి భద్రత కల్పించి, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం కఠినంగా వ్యవహరించాలని కోరారు.

అక్రమబోర్లపై కొనసాగుతున్న హైడ్రా కొరడా

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: చెరువుల చెంత అక్రమ బోర్లపై హైడ్రా ఆపరేషన్ కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా.. బోర్లు వేసి నీటి దందా చేస్తున్న వారి భరతం పడుతోంది. మాధాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువు చెంత బోర్లకు చెక్ పెట్టిన హైడ్రా మంగళవారం జీడిమెట్ల ప్రాంతంలోని ఫాక్స్ సాగర్ దిగువన హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది. కొంపల్లి శివారు ప్రాంతంలో చెరువుకు ఆనుకుని కంటెయినర్ల మధ్య గుట్టు చప్పుడు కాకుండా నీటిని ట్యాంకర్లకు నింపి తరలిస్తున్న వైనాన్ని హైడ్రా కనిపెట్టింది. ఆఖరకు చెందిన హెచ్ ఎం డబ్ల్యూ ఎస్ ఎస్ బి స్టిక్కర్లు నీటి ట్యాంకర్లకు అతికించి జలమండలి ట్యాంకర్ల మాదిరి చెలామణి చేస్తూ నీటి దందాకు తెగబడిన వారికి హైడ్రా చెక్ పెట్టింది. ఆ వాహనాలను కూడా సీజ్ చేసింది. ఫాక్స్ సాగర్ చుట్టూ ఇలా ఎక్కడికక్కడ బోర్లు వేసి నీటిని అక్రమంగా తోడేసి... వ్యాపారం చేస్తున్న వారికి హైడ్రా కట్టడి చేసింది. మొత్తం 7 బోర్లను పైపులతో సహా పెకిలించి నీటి దందాను నిలువరించింది. పెద్ద షెడ్డులు వేసి ప్లాస్టిక్ ట్యాంకర్లు వినియోగించిన వైనాన్ని హైడ్రా బయట పెట్టింది. కొత్తగా బోర్లు వేయడానికి చేస్తున్న ఏర్పాట్లను కూడా హైడ్రా భగ్నం చేసింది. అక్రమ బోర్లను తొలగించడంతో స్థానిక ప్రజలు హైడ్రాకు అభినందనలు తెలిపారు. చెరువు చెంతనే ఉన్న నివాస ప్రాంతాల్లోని బోర్లలోకి నీరు రాకుండా చేస్తున్న వారికి హైడ్రా చెక్ పెట్టడం సంతోషకరమన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ప్రవళికకు అండగా ప్రభుత్వం

- ఉద్యోగుల భద్రతకు ప్రాధాన్యం
- దాడులకు పాల్పడితే కఠిన చర్యలు : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: ఇటీవల ప్రయాణికుడు తోసివేయడంతో గాయపడిన ఖమ్మం రీజియన్ మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళికను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రవళిక త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రవళిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఆర్టీసీ సిబ్బందికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగుల ప్రాణాలకు ముప్పు కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖమ్మం ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పేద ప్రజలను గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ సిబ్బంది పట్ల ప్రయాణికులు గౌరవంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. సిబ్బంది ప్రవర్తనపై ప్రయాణికులకు ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆర్టీసీ యాజమాన్యానికి, సంబంధిత అధికారులకు తెలియజేయాలని అన్నారు. ప్రజలకు సేవ చేయడం ఉద్యోగుల బాధ్యత అయినప్పటికీ, వారి ప్రాణాల రక్షణ, భద్రత కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం, సంస్థ పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు.

మహేష్‌కుమార్ గౌడ్ దంపతులకు

షర్మిల వివాహ ఆహ్వానం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ దంపతులను ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ మహేష్‌కుమార్ గౌడ్ దంపతులకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వివాహ వేడుకకు తప్పక హాజరై వధూవరులను ఆశీర్వదించాలని ఆమె కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొల్లి సత్యనారాయణ



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27 : నల్లగొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థిగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ పోటీ చేయనున్నారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి అధ్యక్షతన ప్రజా సంఘాల నాయకులు అభ్యర్థిని ప్రకటించారు. డబ్బు, మద్యానికి అతీతంగా ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న అభ్యర్థిని ఎన్నుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. గతంలో పీడీఎఫ్ నుంచి ఎనిమిది మంది ఎమ్మెల్సీలు ఉన్నప్పుడు శాసనమండలిలో ప్రజా సమస్యలపై విస్తృత చర్చ జరిగేదని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలని కోరారు. ప్రస్తుతం సుమారు 2.90 లక్షల మంది మాత్రమే నమోదైనట్లు వస్తున్న వార్తలపై ఆందోళన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, టీయూసీఐ నాయకురాలు ఎస్.ఎల్.పద్మ, కేవీపీఎస్ నాయకుడు స్కైలాబ్ బాబు తదితరులు సత్యనారాయణకు మద్దతు ప్రకటించారు. ప్రజా సంఘాలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని కొల్లి సత్యనారాయణ తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు, కార్మికులు, న్యాయవాదుల సమస్యలపై గళమెత్తుతానన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం సీఐటీయూ మొదటి విడతగా రూ.లక్ష విరాళం ప్రకటించింది.

రాజ్యాంగ పరిరక్షణ కోసం

ప్రజాస్వామ్య పోరాటానికి సిద్ధం కావాలి

తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27 : దేశ చరిత్రలో కొన్ని సందర్భాలు ఎంతో కీలకమైనవి. మనం మౌనంగా ఉండాలా? మన హక్కుల కోసం నిలబడాలా? మన రాజ్యాంగ విలువలను కాపాడుకోవాలా? భావితరాల భవిష్యత్తు కోసం బాధ్యత తీసుకోవాలా? అని మనల్ని మనమే ప్రశ్నించుకోవాల్సిన సందర్భాలు వస్తాయి. అలాంటి కీలకమైన బాధ్యతను గుర్తుచేసుకోవాల్సిన సమయం ఇది. రాజ్యాంగ పరిరక్షణ కోసం... ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం... ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం ముందుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది! ఒక్కసారి మన చరిత్రను గుర్తుచేసుకుందాం. మన పూర్వీకులు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం పోరాడినప్పుడు ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. జైళ్లకు వెళ్లారు, లాఠీ దెబ్బలు తిన్నారు, ఎన్నో త్యాగాలు చేశారు. అయినా వెనక్కి తగ్గలేదు. ఎందుకంటే వారి లక్ష్యం ఒక్కటే --- భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలి! భారతీయులకు స్వేచ్ఛ కావాలి! మన దేశానికి ప్రజాస్వామ్య భవిష్యత్తు కావాలి! ఆ మహనీయుల త్యాగాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం వచ్చింది. ఆ స్వాతంత్ర్యానికి అర్థాన్ని ఇచ్చింది మన భారత రాజ్యాంగం. మరి ఈరోజు మన బాధ్యత ఏమిటి? మనకు స్వేచ్ఛను అందించిన రాజ్యాంగాన్ని గౌరవించడం, అది కల్పించిన హక్కులను కాపాడటం, సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం అనే విలువలను భావితరాలకు అందించడం కాదా? రాజ్యాంగం కేవలం పుస్తకం కాదు... అది సామాన్యుడి హక్కులకు భరోసా! రాజ్యాంగం కేవలం అక్షరాల సమాహారం కాదు... అది ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి ప్రతీక! రాజ్యాంగం కేవలం పాలనకు సంబంధించిన నిబంధనలు కాదు... అది మన ప్రజాస్వామ్యానికి పునాది, మన స్వేచ్ఛకు రక్షణ, మన భవిష్యత్తుకు దిక్సూచి! అందుకే రాజ్యాంగ పరిరక్షణ అనేది ఒక పార్టీకి మాత్రమే సంబంధించిన అంశం కాదు. ఇది దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. ప్రతి పౌరుడి హక్కులకు సంబంధించిన అంశం. రేపటి తరాల జీవితాలకు సంబంధించిన అంశం. రాజ్యాంగం బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది. ప్రజాస్వామ్యం బలంగా ఉంటేనే ప్రజల గొంతుకకు విలువ ఉంటుంది. ప్రజల హక్కులు సురక్షితంగా ఉంటేనే నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం ఉంటుంది. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీపై, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉంది. కాంగ్రెస్ అగ్రనేతలు శ్రీ రాహుల్ గాంధీ గారు, శ్రీమతి ప్రియాంక గాంధీ వాద్రా గారు రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువలు, ప్రజల హక్కుల కోసం చేస్తున్న కృషి నుంచి స్ఫూర్తి పొంది మనమంతా ప్రజల్లోకి వెళ్లాలి. రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించాలి. ప్రజాస్వామ్య విలువల ప్రాముఖ్యతను చాటిచెప్పాలి. ప్రజల సమస్యలపై నిలబడాలి. రాహుల్ గాంధీ గారు ముందుకు తీసుకెళు న్న రాజ్యాంగ పరిరక్షణ సంకల్పానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తన వంతు బాధ్యతతో అండగా నిలవాలి. మన బలం కేవలం మన సంఖ్యలో ఉండకూడదు. మన సిద్ధాంతంలో, మన నిబద్ధతలో, మన ప్రజాసేవలో, రాజ్యాంగం పట్ల మనకున్న గౌరవంలో ఉండాలి. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రతి గ్రామంలో రాజ్యాంగ స్ఫూర్తిని చాటాలి. ప్రతి పట్టణంలో ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కల్పించాలి. యువతలో చైతన్యం నింపాలి. సామాన్య ప్రజల హక్కుల గురించి మాట్లాడాలి. ఎక్కడ ప్రజలకు సమస్య ఎదురైతే అక్కడ వారి గొంతుకగా నిలబడాలి. మన పోరాటం శాంతియుతంగా ఉండాలి. మన ఉద్యమం ప్రజాస్వామ్యబద్ధంగా సాగాలి. మన కార్యాచరణ రాజ్యాంగ విలువలకు అనుగుణంగా ఉండాలి. ప్రజల్లో అవగాహన పెంచుతూ, చట్టబద్ధమైన మార్గాల్లో మన లక్ష్యాల కోసం కృషి చేయాలి. కార్యకర్త అంటే కేవలం పార్టీ జెండా మోసేవాడు కాదు. ప్రజల బాధలను తన బాధలుగా భావించేవాడు. ప్రజల హక్కుల కోసం నిలబడేవాడు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేవాడు. అవసరమైనప్పుడు ముందుండి బాధ్యత తీసుకునేవాడు. ఈరోజు మనకు కావాల్సింది అలాంటి నిబద్ధత కలిగిన కార్యకర్తలు. అలాంటి ఐక్యత, అలాంటి కార్యాచరణ, అలాంటి ప్రజాసేవా సంకల్పం. మన పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం తమ జీవితాలను అంకితం చేశారు. మనం రాజ్యాంగం అందించిన స్వేచ్ఛను, సమానత్వాన్ని, న్యాయాన్ని, సౌభ్రాతృత్వాన్ని భావితరాలకు భద్రంగా అందించాలి. మన పిల్లలు రేపు స్వేచ్ఛగా ఆలోచించే, తమ హక్కులను గౌరవంగా వినియోగించుకునే, సమాన అవకాశాలతో ముందుకు సాగే భారతదేశాన్ని చూడాలంటే ఈరోజు మన బాధ్యతను నిర్వర్తించాలి. గుర్తుంచుకోండి... మనం ఈరోజు తీసుకునే నిర్ణయాలు రేపటి తరాల భవిష్యత్తును ప్రభావితం చేస్తాయి. మనం ఈరోజు చూపించే బాధ్యత రేపటి ప్రజాస్వామ్యానికి బలాన్ని ఇస్తుంది. మనం ఈరోజు కాపాడే రాజ్యాంగ విలువలే రేపటి భారతదేశానికి పునాదిగా నిలుస్తాయి. అందుకే నా కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు నా విజ్ఞప్తి ఒక్కటే --- మనమంతా ఐక్యంగా ముందుకు సాగుదాం. రాజ్యాంగ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చేందుకు కృషి చేద్దాం. ప్రజాస్వామ్య విలువలను ప్రతి గడపకు తీసుకెళ్దాం. రాహుల్ గాంధీ గారికి, ప్రియాంక గాంధీ గారికి మన సంఘటిత కృషి ద్వారా అండగా నిలుద్దాం. ప్రజల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం.

చివరిగా ఒక్క మాట!

మన పూర్వీకులు స్వాతంత్ర్యం కోసం పోరాడారు... మనం రాజ్యాంగ పరిరక్షణ కోసం కృషి చేద్దాం! వారు దేశానికి స్వేచ్ఛను సాధించారు... మనం ఆ స్వేచ్ఛకు అర్థాన్నిచ్చే ప్రజాస్వామ్య విలువలను కాపాడు కుందాం! వారు భావితరాల కోసం త్యాగాలు చేశారు... మనం భావితరాల హక్కుల కోసం బాధ్యతగా నిలబడదాం! రాజ్యాంగమే మన బలం! ప్రజాస్వామ్యమే మన పునాది! ప్రజల హక్కుల పరిరక్షణే మన బాధ్యత! జై హింద్! జై కాంగ్రెస్!

ఇప్పుడు నా వంతు- నా కథ నేనే చెబుతా

-ఆత్మకథపై సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 27: తన జీవితంపై దశాబ్దాలుగా ఇతరులు ఎన్నో కథనాలు రాశారని, ఇప్పుడు తన కథను తానే స్వయంగా చెప్పాలనుకుంటున్నానని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తెలిపారు. తన జ్ఞాపకాలతో, జీవిత విశేషాలతో త్వరలో రానున్న ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఆమె తాజా వ్యాఖ్యలు చేశారు. తన జీవితం గురించి గతంలో వచ్చిన ఎన్నో అపోహలు, కల్పిత కథనాలను సరిదిద్దడానికే ఈ పుస్తకాన్ని రాయాలని నిర్ణయించుకున్నట్లు ఆమె చెప్పారు. ఈ పుస్తకం విడుదలయ్యాక తనను ప్రజలు చూసే కోణంలో కచ్చితంగా మార్పు వస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం రోజు (అక్టోబర్ 27) సోనియా గాంధీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ వీడియోను పోస్ట్ చేశారు. పుస్తకం విడుదలయ్యాక కొంత తమాషా (రచ్చ లేదా దుమారం) తప్పదని ఆమె పేర్కొన్నారు. ఇన్నేళ్లుగా ఇతరులు తన కథను చెబుతూ వచ్చారని, ఇప్పుడు తన వంతు వచ్చిందని స్పష్టం చేశారు.

కాళేశ్వరం.. హరీశ్ హయాంలోనే 'కూలేశ్వరం'

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీపై మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న వ్యాఖ్యలను భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీటి లెవల్స్ గురించి తాను మాట్లాడితే హరీశ్‌రావుకు ఎందుకు కోపం వస్తోందని ప్రశ్నించారు. మేడిగడ్డ నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు ఏపీకి వెళ్తోందంటూ బీఆర్ఎస్ దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని విమర్శించారు. హరీశ్‌రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు 'కూలేశ్వరం'గా మారిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన తప్పిదాల కారణంగానే గోదావరి నీళ్లన్నీ కిందకు జారిపోయే పరిస్థితి ఏర్పడిందని చామల ఆరోపించారు.

లక్ష్య సాధనకు క్రమశిక్షణే కీలకం

- **పట్టుదల, ప్రణాళికతో చదివితే పోలీసు ఉద్యోగం సొంతం**
- **రాత పరీక్షలతోపాటు శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టాలి**
- **అభ్యర్థులకు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా దిశానిర్దేశం**

కొడంగల్, వెలుతురు అక్టోబర్ 27 : పోలీసు ఉద్యోగాల సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన ఎంతో అవసరమని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాడా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కానిస్టేబుల్, ఎస్ఐ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అభ్యర్థులతో నేరుగా మాట్లాడి వారి లక్ష్యాలు, పరీక్షల సన్నద్ధతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదవాలని, ప్రతి అంశంపై పట్టు సాధించాలని సూచించారు. రాత పరీక్షలతోపాటు శారీరక దారుఢ్యానికి సమాన ప్రాధాన్యమివ్వాలన్నారు. అపజయాలకు నిరాశ చెందకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. పోలీసు ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాదని, ప్రజలకు సేవ చేస్తూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడే గొప్ప బాధ్యతని పేర్కొన్నారు. కాడా అందిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాడా అధికారి వెంకట్‌రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రపంచ సహకారాన్ని బలోపేతం చేయడానికి

భారత్ కట్టుబడి ఉంది : డాక్టర్ పి.కె. మిశ్రా

- **ప్రకృతి విపత్తుల ముప్పు తగ్గింపునకు పటిష్ఠమైన సంస్థల ఆర్థిక సహకారం అవసరం: డాక్టర్ పి.కె. మిశ్రా**

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 27 : ప్రకృతి విపత్తుల ముప్పును తగ్గించేందుకు సమగ్ర విధానాన్ని అనుసరించాలని ప్రధానమంత్రి ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి.కె. మిశ్రా పిలుపునిచ్చారు. ప్రాణాలను కాపాడటంతో పాటు అభివృద్ధి ఫలితాలను పరిరక్షించడం, ఆర్థిక నష్టాలను తగ్గించడం రాబోయే దశాబ్దంలో ప్రధాన లక్ష్యాలుగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి విపత్తుల ముప్పు తగ్గింపు కార్యాలయం నిర్వహించిన, భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ సంయుక్తంగా అధ్యక్షత వహించిన విపత్తుల ముప్పు తగ్గింపుపై సీనియర్ అధికారుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. వాతావరణ మార్పులు, పట్టణీకరణ, మౌలిక సదుపాయాల విస్తరణ, పర్యావరణ క్షీణత పరస్పరం ముడిపడి ఉన్నాయని ఆయన వివరించారు. ముందస్తు హెచ్చరికలు, సంసిద్ధత, అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థల్లో మెరుగుదలల వల్ల ప్రాణనష్టాన్ని తగ్గించగలిగినప్పటికీ, ఆర్థిక నష్టాలు మాత్రం అధికంగానే కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. వివిధ శాఖలు విడివిడిగా పనిచేసే విధానాన్ని అధిగమించి, విపత్తుల ముప్పును సమగ్రంగా అర్థం చేసుకోవడంతో పాటు వాటి వల్ల ఏర్పడే వరుస పరిణామాలను పరిగణనలోకి తీసుకోవాలని పిలుపునిచ్చారు. విపత్తుల ముప్పు తగ్గింపుపై సేందాయ్ ఫ్రేమ్‌వర్క్‌ను ప్రస్తావిస్తూ, 2030 నాటికి దాని అమలును వేగవంతం చేయాలని డాక్టర్ మిశ్రా కోరారు. విపత్తుల నివారణ, ఉపశమన చర్యలు, సంస్థాగత సామర్థ్యాల పెంపునకు మరిన్ని పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ చేపట్టిన చర్యల్లో భాగంగా, 2016లో ప్రకటించిన విపత్తుల ముప్పు తగ్గింపుపై పది సూత్రాల కార్యాచరణ ప్రణాళిక (వఅ-ాశీఱఅ్ ాూస్త్రవఅఖు), 2025లో విపత్తు నిర్వహణ చట్టానికి చేసిన సవరణలను ఆయన ప్రస్తావించారు. విపత్తుల నిర్వహణకు కేటాయించే నిధులు స్పష్టమైన, కొలవదగిన ఫలితాలను అందించాలని ఆయన నొక్కిచెప్పారు. విపత్తులను తట్టుకోగల మౌలిక సదుపాయాల నిర్మాణం, పట్టణ సంస్థలను బలోపేతం చేయడం, అభివృద్ధి ప్రణాళికల్లో ప్రకృతి ఆధారిత పరిష్కారాలను మరింత విస్తృతంగా భాగం చేయడం అవసరమని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు (ూా×), మెషిన్ లెర్నింగ్, బహుళ విపత్తులకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థల ప్రాధాన్యాన్ని డాక్టర్ మిశ్రా వివరించారు. హెచ్చరికలు జారీ చేయడానికే పరిమితం కాకుండా, సకాలంలో చర్యలు తీసుకునేలా, అవసరమైన నిధులు అందేలా వ్యవస్థలు పనిచేయాలని స్పష్టం చేశారు. విపత్తుల అనంతర పునరుద్ధరణకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పునర్నిర్మాణం ద్వారా గతంలో ఉన్న బలహీనతలు పునరావృతం కాకుండా, వాటిని తగ్గించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతర్జాతీయ సహకారానికి భారత్ కట్టుబడి ఉందని పునరుద్ఘాటిస్తూ, 2023లో భారత జీ20 అధ్యక్షత సమయంలో విపత్తుల ముప్పు తగ్గింపుపై జీ20 వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతల సందర్భంగా కూడా ఈ రంగంలో ప్రపంచ సహకారాన్ని బలోపేతం చేసేందుకు భారత్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. తన ప్రసంగం ముగింపులో డాక్టర్ మిశ్రా మూడు ప్రధాన ప్రాధాన్యతలను వివరించారు. అవి: ఉద్భవిస్తున్న, పరస్పరం అనుసంధానమైన విపత్తుల ముప్పులను మెరుగ్గా అర్థం చేసుకోవడం. ప్రభుత్వ ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాలు, నగరాలు, సహజ పర్యావరణ వ్యవస్థల్లో విపత్తులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సమర్థవంతమైన పెట్టుబడులు పెట్టడం. ఆచరణాత్మక అంతర్జాతీయ సహకారంతో సంస్థాగత వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం. సేందాయ్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సాధించిన పురోగతిని మరింత పటిష్ఠం చేస్తూ, 2030 నాటికి దాని అమలును వేగవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రాణాలను కాపాడటమే కాకుండా, ప్రజలు నిర్మించుకున్న ఆస్తులు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ఫలితాలను కూడా పరిరక్షించగలమని రాబోయే దశాబ్దం నిరూపించాలని డాక్టర్ మిశ్రా స్పష్టం చేశారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువు.. రైతులకు కన్నీళ్లు!

- **తుమ్మిడిహట్టి డీపీఆర్ బయటపెట్టాలి.. కాంగ్రెస్, బీజేపీలది నాటకమే..**
- **మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శలు**

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీరు, విద్యుత్ సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. రైతుల సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే తుమ్మిడిహట్టి ప్రాజెక్టు పేరుతో కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మిస్తామని గొప్పలు చెబుతున్నారని, అక్కడ నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం స్పష్టం చేసిన నేపథ్యంలో నీరు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. ప్రాజెక్టు ద్వారా ఎన్ని ఎకరాలకు నీరిస్తారు, ఎంత ఖర్చవుతుందో వెల్లడించాలని, సమగ్ర ప్రాజెక్టు నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంపుహౌస్ నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువకు వదిలేశారని, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి ఉంటే ఆయా జిల్లాలకు నీరు అందేదని అన్నారు. తమ నియోజకవర్గంలో విద్యుత్, సాగునీరు అందక రైతులు ట్యాంకర్లతో వరి పంటకు నీరు పోస్తున్నారని తెలిపారు. వరి విత్తనాల విక్రయాలపై నోటీసులు ఇవ్వడం, రైతులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు కోరడం దారుణమన్నారు. సీతారామ, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా ఎంత నీటిని ఎత్తిపోశారో ప్రభుత్వం వివరించాలని కోరారు. మేడిగడ్డ బరాజ్ మరమ్మతులపై బీజేపీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై కాంగ్రెస్, బీజేపీలు నాటకాలాడుతున్నాయని విమర్శించారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునే ధైర్యం కాంగ్రెస్ నేతలకు ఉందా అని సవాల్ విసిరారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే నిధులు, నీళ్లు అందడం లేదంటున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కే. కిషోర్ గౌడ్, గెల్లు శ్రీనివాస యాదవ్, కురువ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టి పేరుతో కాలయాపన

- **రేవంత్‌ది ప్రచార ఆర్భాటమే.. తెలంగాణకు నీళ్లేవి?**
- **మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శలు**

తొర్రూరు, వెలుతురు అక్టోబర్ 27: తెలంగాణను కరువు ప్రాంతంగా మారుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు పరిమితమవు తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. తమ్మిడి హెట్టి ప్రాజెక్టుపై ఎలాంటి ఒప్పందాలు కుదరకముందే చర్చలు సఫలమయ్యా యని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. చర్చలు సఫలమైతే వివరాలను వెల్లడిస్తూ విలేకరుల సమావేశం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మూడుసార్లు తమ్మిడి హెట్టి ప్రాజెక్టుపై సానుకూల చర్చలు జరిపారని గుర్తుచేశారు. తమ్మిడి హెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచాలని కేసీఆర్ ప్రతిపాదించినప్పటికీ, మహారాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అది కార్యరూపం దాల్చలేదన్నారు. కేంద్ర జల సంఘం నివేదికల ప్రకారం తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత సరిపోని పరిస్థితుల నేపథ్యంలో కేసీఆర్ ముందుచూపుతోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేం దుకు బీఆర్ అంబేద్కర్ వార్ధా ప్రాజెక్టుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. మేడిగడ్డను సాకుగా చూపి కాంగ్రెస్ ప్రభుత్వం వార్ధా ప్రాజెక్టును నిలిపి వేసిందని ఆరోపించారు. మేడిగడ్డ బ్యారేజీని బాగుచేసి నీళ్లందించలేని ప్రభుత్వం, పక్క రాష్ట్రాలకు వెళ్లి ఫొటోలకు పోజులిస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశమయ్యేందుకు మూడేళ్లు పట్టిందని విమర్శించారు. తమ్మిడిహెట్టి పేరు చెప్పి కాలయా పన చేయడం తప్ప తెలంగాణకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదన్నారు. గతంలో వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల హయాంలోనూ ఈ ప్రాజెక్టుపై కమిటీలు వేయడం తప్ప తెలంగాణకు ఒరిగిందేమీ లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి ఇకనైనా మోసపూరిత మాటలు, ప్రచారాలు మానుకోవాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల స్మృతిలో రోగులకు అన్నదానం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్జీవోస్) కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సైనీ ముజీబ్ ఆధ్వర్యంలో అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జె. క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, డాక్టర్ ముజీబ్‌తో కలిసి స్వయంగా భోజనం పంపిణీ చేశారు.

తల్లిదండ్రుల స్మారకార్థం సేవలు

తన తల్లిదండ్రులు స్వర్గీయ అసదుల్లా హుస్సేనీ, అన్వరున్నీసా స్మారకార్థం ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా డాక్టర్ ముజీబ్ ప్రతి వారం క్యాన్సర్ రోగులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులకు, వారి సహాయకులకు ఈ కార్యక్రమం అండగా నిలుస్తోంది. ఈ సందర్భంగా మారం జగదీశ్వర్ మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ఆహారం అందించడం గొప్ప మానవతా సేవ అని అన్నారు. తల్లిదండ్రుల స్మారకార్థం ప్రతి వారం రోగులకు భోజనం అందిస్తున్న డాక్టర్ ముజీబ్ సేవలు అభినందనీయమన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు సామాజిక బాధ్యతలోనూ టీఎన్జీవోస్ ముందుంటుందని, పేదలకు సేవ చేసే కార్యక్రమాల్లో నాయకులు, సభ్యులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న రోగులకు కడుపునిండా భోజనం పెట్టడం ఎంతో తృప్తినిస్తుందని అన్నారు. సమాజం నుంచి పొందిన దానిలో కొంతైనా తిరిగి సమాజానికి అందించాలనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జనగణన నిర్వహణపై అధికారులకు శిక్షణ

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27: భారత జనాభా గణన--2027 రెండో దశలో భాగంగా జనాభా గణన నిర్వహణపై జీహెచ్ఎంసీ పరిధిలోని 31 నుంచి 60 సర్కిళ్ల ఛార్జ్ అధికారులు, అదనపు ఛార్జ్ అధికారులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ జనగణన కార్యకలాపాల సంచాలకురాలు భారతి హోళ్లికేరి, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ బి. సంతోష్ కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అధికారులకు మార్గదర్శనం చేశారు. జనగణనలో భాగంగా గణన విభాగాల ఏర్పాటు, గృహాల జాబితాల తయారీ, జనగణన నిర్వహణ, పర్యవేక్షణ వ్యవస్థ పోర్టల్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో గణకులు, పర్యవేక్షకులు ఉపయోగించే మొబైల్ అనువర్తనం ద్వారా 1 నుంచి 40 ప్రశ్నలకు సమాధానాలు సేకరించడం, నమోదు చేయడం వంటి అంశాలను వివరించారు. ప్రజలు స్వయంగా అంతర్జాలం ద్వారా వివరాలు నమోదు చేసుకునే విధానంపైనా అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ, ప్రచార కార్యక్రమాల నిర్వహణ, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. రాష్ట్ర జనగణన కార్యాలయ సంయుక్త సంచాలకుడు, జాతీయ శిక్షకుడు వి. శ్రీకాంత్, గణాంక అధికారి శివరాజు శిక్షణ అందించారు. జనగణన--2027 జాతీయ ప్రాధాన్య కార్యక్రమమని, అధికారులు కచ్చితత్వం, నిబద్ధతతో విధులు నిర్వహించాలని భారతి హోళ్లికేరి, బి. సంతోష్ కుమార్ సూచించారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ పచ్చ జెండా

ఒంగోలు, వెలుతురు అక్టోబర్ 27:

ఏపీకి కేంద్రం భారీ చేయూత అందింది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను ఆధునీకరించే దిశగా రూ.27,370 కోట్ల వ్యయంతో చేపట్టే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ సర్కార్ పచ్చ జెండా ఊపింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త కరెంట్ లైన్లను వేసేందుకు, అలాగే రామాయపట్నం, కొప్పాక ప్రాంతాల్లో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. అనుకున్న విధంగా ఈ గ్రీన్ కారిడార్ ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కితే... చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం భారీ సాయం అందించింది. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన రంగానికి కేంద్రం భారీ ఊతం ఇచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ ప్రసార వ్యవస్థను ఆధునీకరించే దిశగా ఏకంగా రూ.27,370 కోట్ల వ్యయంతో చేపట్టే 'గ్రీన్ ఎనర్జీ కారిడార్-3 ప్రాజెక్టుకు మోదీ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సోలార్, పవన విద్యుత్‌తో పాటు పంప్డ్ స్టోరేజ్ ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను నేరుగా మెయిన్ గ్రిడ్‌కు అనుసంధానం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 7,872 సర్క్యూట్ కిలోమీటర్ల మేర కొత్త కరెంట్ లైన్లను వేసేందుకు, అదే విధంగా రామాయపట్నం, కొప్పాక ప్రాంతాల్లో కొత్తగా 400 కేవీ సబ్‌స్టేషన్లను ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. వీటి ద్వారా మొత్తం 9,500 ఓఎం అదనపు విద్యుత్ ప్రసార సామర్థ్యం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా తీరప్రాంతాల్లోని పోర్టులు, పారిశ్రామిక వాడలకు నిరంతర, నాణ్యమైన కరెంట్‌ను అందించాలన్న లక్ష్యంతో రామాయపట్నం సబ్‌స్టేషన్ కీలకంగా మారనుంది. ఈ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పనులన్నింటినీ 2029-30 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్లాన్ చేసింది. అనుకున్న విధంగా ఈ గ్రీన్ కారిడార్ ప్రాజెక్ట్ పట్టాలు ఎక్కితే... చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఇందులో ఏర్పాటు చేసే భారీ బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల ద్వారా పగటి పూట ఉత్పత్తి అయిన కరెంట్‌ను స్టోరేజ్ చేసి రాత్రి పూట లేదా డిమాండ్ ఎక్కువగా ఉన్న సమయంలో వాడుకోవచ్చు. దీంతో ఎండాకాలంలో తరచుగా ఎదుర్కొనే పవర్ కట్స్ తగ్గుతాయి. అదే విధంగా గాలి, సూర్యరశ్మితో ఉత్పత్తి చేసే కరెంట్ ద్వారా చౌకగా లభిస్తుంది. ఈ మేరకు సామాన్యుల కరెంటు బిల్లుల పెంపు భారం తగ్గుతుంది. శిలాజ ఇంధనాల వాడకం తగ్గడం వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది. ఈ భారీ కారిడార్, బ్యాటరీ ప్లాంట్ల నిర్మాణం వల్ల పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. అంటే ఈ ప్రాజెక్ట్ వల్ల పరోక్షంగా, ప్రత్యక్షంగా కూడా అనేక ఉపయోగాలు ఉంటాయి.

రండి చెరువుల అభివృద్ధికి ఊతమివ్వండి

- సింగిల్ విండో మాదిరి అనుమతులు మంజూరు చేస్తాం
- ఢిల్లీ సదస్సులో సీఎస్ ఆర్ సంస్థలకు హైడ్రా కమిషనర్ పిలుపు
- రూ. 2 కోట్లతో రామంతాపూర్ చిన్న చెరువు అభివృద్ధికి జెన్‌ప్యాక్ట్ ఒప్పందం

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27:

చెరువుల అభివృద్ధితో వరదలను కట్టడి చేయవచ్చునని రాష్ట్ర ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. వర్షాకాలం వరదలు, వేసవి కాలం నీటి ఎద్దడి నివారణలో చెరువులు ప్రధాన పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే చెరువుల పునరుద్ధరణను పెద్దయెత్తున చేపట్టింది. ఈ క్రమంలో ఆక్రమణలు తొలగించి.. భారీ మొత్తంలో పూడికను తొలగించి.. చెరువు సహజలక్షణాలన్నీ ఉండేలా ఇప్పటికే 6 చెరువులను హైడ్రా అభివృద్ధి చేసింది. రెండో విడతా మరో 14 చెరువులను చేపట్టింది. ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.. కార్పొరేట్ సంస్థలు కూడా సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ)గా ఈ కార్యక్రమానికి ఊతమందించాలి అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పలు సంస్థలకు విజ్ఞప్తి చేశారు.

పట్టణ వరదల నిర్వహణపై కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సదస్సులో హైడ్రా కమిషనర్ పాల్గొని చెరువులు, నాలాల పునరుద్ధరణపై మాట్లాడారు. వరదల నివారణలో ప్రధాన పాత్ర పోషిస్తున్న చెరువులు, నాలాలను హైడ్రా పరిరక్షిస్తోందని.. ఇందుకు కార్పొరేట్ సంస్థల చేయూత కూడా చాలా అవసరమని పేర్కొన్నారు. చెరువుల అభివృద్ధికి సంబంధించి అన్ని అనుమతులు సింగిల్ విండో మాదిరి హైడ్రా మంజూరు చేయిస్తుందని పేర్కొన్నారు. అలాగే తగిన సాంకేతిక సహకారం కూడా అందిస్తామన్నారు. ఈ క్రమంలో హైడ్రా పునరుద్ధరించిన చెరువులను పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా సీఎస్ ఆర్ సంస్థలకు కళ్లకు కట్టారు. హైడ్రా పనులు చేపట్టక ముందు చెరువుల స్థితి ఎలా ఉండేది.. నేడు ఎలా ఉన్నాయనేది చూపించారు. ఎల్‌నినో వంటి కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా చెరువులు సహకరిస్తాయని కమిషనర్ చెప్పారు. నగరంలో చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న విమోస్ టెక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ పర్వేజ్ కూడా ఈ సదస్సులో పాల్గొని సీఎస్ ఆర్ నిధులతో ముందుకు వచ్చే సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు.

హైడ్రాతో జెన్‌ప్యాక్ట్ ఒప్పందం

నగరంలో చెరువుల అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రదర్శనలో చూసిన పలు సంస్థలు హైడ్రాతో కలిసి పని చేయడానికి ముందుకొచ్చాయి. ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతాపూర్ చిన్న చెరువును రూ. 2 కోట్లతో అభివృద్ధి చేయడానికి జెన్‌ప్యాక్ట్ సంస్థ సిద్ధమయ్యింది. ఈ మేరకు హైడ్రాతో అప్పటికప్పుడే ఒప్పందం కుదుర్చుకుంది. మరికొన్ని సంస్థలు ఆసక్తి చూపించాయి. అనంతరం అరైజ్ ఇండియా ఫోరం ఏర్పాటు చేసిన సమావేశంలో హైడ్రా చేపట్టిన చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధికి ప్రశంసలు అందాయి. ఇందులో పలు దేశాల ప్రతినిధులు కూడా పాల్గొని చెరువుల అభివృద్ధి జరిగిన తీరును అభినందించారు. నగరాలు కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో చెరువులకు వరదనీరు సాఫీగా చేరడానికి చేస్తున్న ఏర్పాట్లను శ్రీలంక రాజధాని కొలంబో పట్టణ మేయర్ రషీద్ అడిగి తెలుసుకున్నారు. మంగళవారం కూడా ఎన్‌డీఎంఏ(నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ) అధికారులను తెలంగాణ రాష్ట్ర ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఎంఏయూడీ విభాగం స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ నేతృత్వంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజన, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్యతో పాటు ఇతర అధికారులు ఎన్‌డీఎంఏ అధికారులను కలిసిన వారిలో ఉన్నారు. ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులు రాష్ట్రానికి సమకూర్చాలని కోరారు.

టీడీపీలో చేరిపోయిన పేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి !

గుంటూరు, వెలుతురు అక్టోబర్ 27:

పల్నాడు రాజకీయాల్లో మాజీ మంత్రి విడదల రజిని రాజకీయం నవ్వులపాలైంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ.. పోలీసులు తనను కింద పడేశారని, అడ్డుకున్నారని ఒక పెద్ద సెంటిమెంట్ డ్రామాకు తెరతీసిన ఆమె, ఇంట్లోనే కూర్చుని పరామర్శల రాజకీయం చేస్తున్నారు. సానుభూతి పొందేందుకు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలందరినీ తన వద్దకు పరామర్శలకు పిలిపించుకుంటూ లైవ్ కవరేజీలతో రచ్చ చేశారు. అయితే రజిని ఈ పరామర్శల పర్వంలో మునిగి తేలుతున్న సమయంలోనే, క్షేత్రస్థాయిలో పార్టీకి జరగాల్సిన అసలు నష్టం జరిగిపోయింది. విడదల రజిని ఒకవైపు సెంటిమెంట్ పొలిటికల్ గేమ్ ఆడుతుంటే, మరొకవైపు ఆమె ఎంతో నమ్మకంగా బరిలో నిలిపిన అభ్యర్థులే ఇదే సందు అనుకుని సైలెంట్‌గా గోడ దూకేశారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రజిని ప్రతిపాదించిన కరీమూన్ ఏకంగా వైఎస్సార్‌సీపీకి హ్యాండ్ ఇచ్చి తెలుగుదేశం పార్టీ కండువా కప్పేసుకున్నారు. అంతేకాకుండా, టిడిపి అభ్యర్థి గెలుపు కోసం స్వయంగా ప్రచారంలోకి దిగడం వైఎస్సార్‌సీపీ శ్రేణులను కోలుకోలేని దెబ్బతీసింది. మున్సిపల్ ఎన్నికల్లో కరీమూన్‌తో నామినేషన్ వేయించడం, అది ఉపసంహరణ కాకుండా చూసుకోవడం వరకే విడదల రజిని శ్రద్ధ చూపించారు. కానీ, సదరు నాయకురాలు తమ వైపే ఉందా లేదా, క్షేత్రస్థాయిలో పార్టీకి విధేయంగా ఉందా అనే విషయాన్ని గమనించడంలో రజిని ఘోరంగా విఫలమయ్యారు. పోటీ నుంచి ఉపసంహరించుకోకుండా జాగ్రత్తపడిన రజిని, కరీమూన్ టిడిపిలోకి క్యూ కట్టకుండా మాత్రం ఆపలేకపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చడంలో ఆమె అసమర్థత మరోసారి బయటపడింది. పోలీసులతో వివాదాన్ని ఆసరాగా చేసుకుని విక్టిమ్ కార్డ్ ఉపయోగించి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న విడదల రజిని వ్యూహం తుస్సుమంది. ఒకవైపు తాను ఇంట్లో కూర్చుని సెంటిమెంట్ డ్రామాలతో కాలక్షేపం చేస్తుంటే, తన చేతుల మీదుగా టికెట్ పొందిన కీలక అభ్యర్థే ప్రత్యర్థి కూటమిలో చేరి ప్రచారం చేసుకోవడం రజిని రాజకీయ భవిష్యత్తు దెబ్బేసింది. సొంత నియోజకవర్గంలోనే అభ్యర్థులను కాపాడుకోలేని నాయకురాలు రాష్ట్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని ఏం నడిపిస్తుందంటూ సొంత పార్టీ కేడరే పెదవి విరుస్తోంది

ఒంగోలులో ఎన్నికల బరిలో జెన్ జీ.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ముందుగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్నారు. నవంబర్ 1న 100 అర్బన్ లోకల్ బాడీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నం అయ్యారు. స్థానిక ఎన్నికల్లో పోటీకి జెన్ జీ యువత కూడా ఆసక్తి కనబరుస్తోంది. ఒంగోలులో 24 ఏళ్ల చావలి చర్విత కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్నారు. ఎంటెక్ చదివిన చర్విత ఉద్యోగం చేసుకొందామని భావించకుండా.. రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఒంగోలు 27వ డివిజన్ నుంచి కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ డివిజన్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో.. యాదవ సామాజికవర్గానికి చెందిన ఆమె బరిలో నిలిచారు. ఆమె ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువుకున్నారు. తమది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం అన్న చర్విత.. తన తాతయ్య చావలి కృష్ణయ్య గతంలో కౌన్సిలర్‌గా పని చేశారన్నారు. తమ కుటుంబానికి టీడీపీతో 40 ఏళ్లకుపైగా అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తేళ్లకుల అనంతమ్మ ప్రస్తుతం అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా పని చేస్తున్నారన్నారు. వీళ్ల స్ఫూర్తితోనే తాను చదువు పూర్తయ్యాక రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. తనకు టికెట్ రావడానికి ఎమ్మెల్యే దామరచర్ల జనార్ధన్ కారణమని చర్విత చెప్పారు. 27వ డివిజన్‌ను ఒంగోలులోనే ది బెస్ట్ డివిజన్‌గా నిలుపుతానన్నారు. ప్రజలకు ఏం చేస్తే బాగుంటుందనేది తాను నిత్యం ఆలోచిస్తుంటానన్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా టీడీపీకి చెందిన నల్లమిల్లి శ్రీశిల్ప బరిలోకి దిగారు. వైసీపీ తరఫున ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ బరిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా.. ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. అధికారుల తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎన్నికల బరిలో నుంచి తన పేరును తొలగించారని, తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించకపోతే న్యాయపోరాటానికి దిగుతానని ఆయన హెచ్చరించారు. 2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంగోలు కార్పొరేషన్‌ను వైసీపీ గెలుచుకుంది. వైసీపీ 41, టీడీపీ 6, జనసేన 1, స్వతంత్రులు రెండు స్థానాల్లో గెలిచారు. అయితే 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో మేయర్, డిప్యూటీ మేయర్ సహా 17 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో ఈ కార్పొరేషన్ టీడీపీ వశమైంది.

ఈదురుగాలులకు ఇంటిపై విరిగిపడిన చెట్టు..

విశాఖపట్నం, వెలుతురు అక్టోబర్ 27:

మహారాణిపేట పరిధిలోని అంగడిదిబ్బ వద్ద ఈదురుగాలులకు చెట్టు విరిగి పక్కనే ఉన్న నమ్మి నరసింగరావు ఇంటిపై పడింది. ప్రకాశ్ ఆర్ట్స్ కార్యాలయం ఆవరణలోని ఈ చెట్టు కూలడంతో ఇంటి పెంకులు దెబ్బతిన్నాయి. ఇంటి ఆవరణలో ఉన్న పాన్‌షాపు రేకులపై కూడా చెట్టు కాండం పడటంతో షాపు రేకులు, లోపల ఉన్న సామగ్రి ధ్వంసమయ్యాయి. విద్యుత్ వైర్లు సైతం తెగిపడ్డాయి.

గతంలో హుద్‌హుద్ తుఫాన్ సమయంలోనూ ఇదే చెట్టు ఇంటిపై పడి రేకులు దెబ్బతిన్నాయని బాధితులు తెలిపారు. చెట్టు కొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించకుండా నిర్లక్ష్యంగా

వ్యవహరించడమే ఈ ఘటనకు కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. చెట్టు ప్రమాదకరంగా ఉందని చుట్టుపక్కల వారు పలుమార్లు చెప్పినా ప్రకాశ్ ఆర్ట్స్ యాజమాన్యం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలో నష్టపోయిన తమకు ప్రకాశ్ ఆర్ట్స్ యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

టీడీపీకి అస్త్రంగా యలహంక ప్యాలెస్

విజయవాడ, వెలుతురు అక్టోబర్ 27:

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి కుటుంబ వివాదం చర్చనీయాంశంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన 'కంస మామ' వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లో తన కుమార్తె అంజలి రెడ్డి వివాహం నిర్వహించుకోవడానికి అనుమతి ఇవ్వలేదంటూ జగన్‌పై వస్తున్న కథనాల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇప్పటికే రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటున్న జగన్‌కు, కుటుంబ వ్యవహారాలు మరో కొత్త ఇబ్బందిగా మారుతున్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. వైఎస్ షర్మిల తన కుమార్తె వివాహాన్ని బెంగళూరులోని కుటుంబానికి చెందిన యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలని భావించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఆ భవనాన్ని ఉపయోగించుకునేందుకు జగన్ అనుమతి నిరాకరించినట్లు పలు కథనాలు పేర్కొంటున్నాయి. భద్రత, వ్యక్తిగత గోప్యత వంటి అంశాలను ఇందుకు కారణాలుగా చూపినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో వైఎస్ విజయమ్మ కూడా జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినట్లు వార్తలు రావడంతో వివాదం మరింత విస్తృతమైంది. అయితే, ఈ పరిణామాలపై కుటుంబ సభ్యుల నుంచి వెలువడే అధికారిక వివరణలు, వాస్తవ పరిస్థితులు పూర్తిగా స్పష్టమయ్యే వరకు ప్రచారంలో ఉన్న అంశాలను నిర్ధారిత వాస్తవాలుగా చూడలేం. అయినప్పటికీ, ఈ వివాదం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా చంద్రబాబు చేసిన 'కంస మామ' వ్యాఖ్య ఈ వ్యవహారానికి రాజకీయ రంగు పులిమింది. జగన్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకున్న ఈ వ్యాఖ్య సామాజిక మాధ్యమాల్లోనూ చర్చనీయాంశమైంది. జగన్ రాజకీయ ప్రస్థానంలో షర్మిల పాత్రను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభ దశలో కీలకంగా భావిస్తారు. పార్టీ బలోపేతం కోసం ఆమె రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టి ప్రజల్లోకి వెళ్లారు.

జగన్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. కుటుంబం, రాజకీయాలు రెండింటిలోనూ ఒకప్పుడు కనిపించిన ఈ అనుబంధం ఇప్పుడు తీవ్ర విభేదాల కారణంగా చర్చకు వస్తోంది. కాలక్రమేణా జగన్, షర్మిల మధ్య రాజకీయ విభేదాలు పెరిగాయి. షర్మిల కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు చేపట్టడం, ఏపీ రాజకీయాల్లో జగన్‌కు వ్యతిరేకంగా తన స్వరాన్ని వినిపించడం ఈ దూరాన్ని మరింత పెంచిన పరిణామాలుగా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పుడు కుటుంబ ఆస్తులు, వాటి వినియోగం వంటి అంశాలు కూడా వివాదంలోకి రావడంతో ఈ వ్యవహారం రాజకీయాలకు అతీతంగా కుటుంబ సంబంధాలపైనా ప్రభావం చూపుతోంది. ఆస్తులకు సంబంధించిన వివాదాలు న్యాయపరమైన వేదికలకు చేరినట్లు వచ్చిన వార్తలు ఈ సమస్య ఎంత సంక్లిష్టంగా మారిందో తెలియజేస్తున్నాయి. ప్రజల కోసం పోరాడే నాయకుడిగా, రాజకీయ ప్రత్యర్థులను ధీటుగా ఎదుర్కొనే వ్యక్తిగా జగన్ తన రాజకీయ ప్రతిష్ఠను నిర్మించుకున్నారు. అయితే, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వివాదాలు పదేపదే బహిరంగ చర్చకు రావడం ఆయన ప్రత్యర్థులకు విమర్శలు చేసేందుకు అవకాశం కల్పిస్తోంది. ముఖ్యంగా కుటుంబ సభ్యుల మధ్య విభేదాలు రాజకీయ వేదికలపై ప్రస్తావనకు రావడం ప్రజల్లో భిన్నమైన అభిప్రాయాలకు దారితీయవచ్చు. చంద్రబాబు నాయుడు ఈ వివాదాన్ని జగన్‌పై రాజకీయ విమర్శలకు ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా రాజకీయాల్లో విధానాలు, పాలన, అభివృద్ధి, ప్రజా సమస్యలే ప్రధాన చర్చాంశాలుగా ఉండాలి. కానీ వ్యక్తిగత, కుటుంబ వివాదాలు తెరపైకి వచ్చినప్పుడు రాజకీయ చర్చ దిశ మారే అవకాశం ఉంటుంది. జగన్‌పై ఇప్పటికే పలు రాజకీయ అంశాల్లో విమర్శలు చేస్తున్న కూటమి నేతలకు తాజా వివాదం మరో అస్త్రంగా మారే అవకాశం ఉంది. కుటుంబ సభ్యుల మధ్య విభేదాలను ప్రస్తావిస్తూ జగన్ రాజకీయ ప్రతిష్ఠను ప్రశ్నించే ప్రయత్నాలు మరింత పెరగవచ్చు. అయితే, ఈ వివాదం వల్ల జగన్‌కు రాజకీయంగా ఎంత నష్టం జరుగుతుందన్నది ప్రజల స్పందన, తదుపరి పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు, వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడంపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. వివాదానికి సంబంధించిన వాస్తవాలు పూర్తిగా వెల్లడికాకముందే రాజకీయ నిర్ణయాలకు రావడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యలహంక ప్యాలెస్ వ్యవహారం ఒక కుటుంబ వివాదంగా ప్రారంభమైనప్పటికీ, చంద్రబాబు వ్యాఖ్యలతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకప్పుడు జగన్‌కు అండగా నిలిచిన షర్మిలతో ఏర్పడిన దూరం, కుటుంబ ఆస్తులపై వివాదాలు, తాజాగా వెలుగులోకి వచ్చిన పెళ్లి వ్యవహారం కలిసి జగన్‌ను మరోసారి రాజకీయ చర్చ మధ్యలో నిలిపాయి. ఈ పరిణామాలు ఆయన ప్రజా ప్రతిష్ఠపై ఎలాంటి ప్రభావం చూపుతాయి? చంద్రబాబు విమర్శలు రాజకీయంగా ఎంతవరకు ఫలిస్తాయి? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

నవంబర్ రెండో వారంలో జగన్ విదేశీ పర్యటన

కడప, వెలుతురు అక్టోబర్ 27:

వైసీపీ అధినేత జగన్ పదిహేను రోజుల పాటు విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. నవంబర్ నెలాఖరు లోపు ఎప్పుడైనా 15 రోజుల పాటు యూరప్ వెళ్లే వెసులుబాటు ఉండేలా కోర్టు నుంచి అనుమతి తీసుకున్నారు. ప్రస్తుతానికి ఆయన ప్రయాణం వాయిదా పడటానికి క్షేత్రస్థాయి రాజకీయ అనివార్యతలే ప్రధాన కారణం. రాష్ట్రంలో స్థానిక సంస్థల సమరం వాడివేడిగా జరుగుతున్న వేళ.. అధినేత దేశం దాటి వెళ్తే పార్టీ నేతలు లైట్ తీసుకుంటారు. ఇప్పటికే బెంగళూరు ప్యాలెస్ కేంద్రంగా సాగుతున్న రాజకీయంపై క్యాడర్‌లో అసంతృప్తి రగులుతోంది. ఎన్నికల నడిమధ్యలో విదేశాలకు చెక్కేస్తే పార్టీ భవిష్యత్తుపై ఆయనకు ఏమాత్రం ఆసక్తి లేదన్న బలమైన సంకేతాలు ప్రజల్లోకి వెళ్తాయి. అందుకే స్థానిక పోరు ముగిసే వరకు అంటే వచ్చే నెల మధ్య వరకు ఆయన అందుబాటులో ఉండక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే, ఎన్నికల ప్రక్రియ చివరి దశకు వచ్చిన వెంటనే .. అంటే నవంబర్ రెండో వారం తర్వాత ఆయన విదేశీ బాట పట్టే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక్కడే అసలైన రాజకీయ, కుటుంబ సమీకరణల లింక్ ముడిపడి ఉంది. సరిగ్గా నవంబర్ 25వ తేదీన జగన్ సోదరి, ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కుమార్తె అంజలీ రెడ్డి వివాహం జరగనుంది. గత కొంతకాలంగా ఆస్తి వివాదాలు, రాజకీయ విభేదాలతో వైఎస్ కుటుంబంలో అన్నాచెల్లెళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల షర్మిల సైతం తన కుటుంబ కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాల్లోనూ, రాజకీయ విమర్శల్లోనూ జగన్ వైఖరిని తీవ్రంగా ఎండగడుతున్నారు. ఇలాంటి నిప్పులు చెరిగే వాతావరణంలో మేనకోడలి వివాహ వేడుకకు జగన్ హాజరవుతారా లేదా అన్నది రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఒకవేళ జగన్ ఆ పెళ్లికి వెళ్లకపోతే, సొంత చెల్లెలి కూతురి పెళ్లిని కూడా బహిష్కరించారనే నెగెటివ్ ప్రచారం రాజకీయంగా, వ్యక్తిగతంగా ఆయనకు మరింత నష్టం కలిగిస్తుంది. ఒకవేళ మొహమాటానికి వెళ్లినా.. అక్కడ వైఎస్ విజయమ్మ, షర్మిల కుటుంబం, ఇతర బంధువర్గం మధ్య నెలకొనే ఉద్రిక్తతలు, విపక్షాలు చేసే విమర్శలు మరింత రచ్చకు దారితీస్తాయి.

అందుకే ఇరువైపులా ఎదురయ్యే పెను ఇబ్బందుల నుంచి సునాయాసంగా తప్పించుకోవడానికి విదేశీ పర్యటన జగన్‌కు ఒక సరైన ఎగ్జిట్ రూట్ గా ఉపయోగపడుతుందని అంచనా. వివాహ సమయానికే సరిగ్గా లండన్ లేదా యూరప్ పర్యటనను షెడ్యూల్ చేసుకుంటే, నేను దేశంలో లేను కాబట్టే పెళ్లికి రాలేకపోయాను అని సహజసిద్ధమైన కారణాన్ని చూపించే వీలుంటుంది. రాజకీయంగా చూస్తే అటు క్యాడర్ అసంతృప్తికి గురికాకుండా ఉండటం, ఇటు కుటుంబ కలహాల సెగ తగలకుండా తప్పించుకోవడం అనే రెండు లక్ష్యాలను ఒకే దెబ్బతో కొట్టేలా జగన్ పర్యటన రూపుదిద్దుకుంటోంది. స్థానిక ఎన్నికల పోలింగ్, ఫలితాల ఘట్టం నవంబర్ మధ్య నాటికి తేలిపోగానే.. ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా నవంబర్ 15 నుంచి నెలాఖరు వరకు ఆయన యూరప్‌లో గడిపేలా షెడ్యూల్ ఖరారవుతుందని సమాచారం. తద్వారా స్థానిక ఎన్నికల పరాభవాల నెపం నుంచి తాత్కాలికంగా దూరంగా ఉండటంతో పాటు, నవంబర్ 25న జరిగే షర్మిల కుమార్తె వివాహ హాజరు తలనొప్పి నుంచి కూడా శాశ్వతంగా తప్పించుకోవచ్చనేదే జగన్ వ్యూహంగా కనిపిస్తోంది.

సజ్జలకు కీలక బాధ్యతలు

జగన్ విదేశాలకు వెళ్ళిపోతారు.. నవంబర్ నెలలో ఏదో ఒక వారంలో ఆయన కుటుంబంతో కలిసి యూరప్ పర్యటన చేస్తారు.. ఇదీ ఉదయం నుంచి సోషల్ మీడియాలో వైసిపి నాయకులు చేస్తున్న ప్రచారం.. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా కుటుంబంతో కలిసి జగన్ లండన్ లో పర్యటించారు. అప్పట్లో ఆయన విదేశాలలో పర్యటించిన ఫోటోలు కొన్ని మాత్రమే బయటికి వచ్చాయి. అధికారం కోల్పోయిన తర్వాత.. అది కూడా స్థానిక ఎన్నికల ముందు జగన్ విదేశాలకు వెళ్తారని ప్రచారం జరుగుతుంది. అక్రమ ఆస్తుల కేసులో విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. జగన్ సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తెచ్చుకున్నారని తెలుస్తోంది. స్థానిక ఎన్నికల ముందు జగన్ విదేశాలకు వెళ్లిపోతే పార్టీలో నైతిక స్థైర్యం దెబ్బతింటుందని కార్యకర్తలు అంటున్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో కూటమి దూకుడు మీద ఉంది. ఇప్పటికే చాలా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. ఎన్నికలు జరిగితే వార్ వన్ సైడ్ కావడం ఖాయమని.. సాక్షాత్తు వైసిపి కార్యకర్తలు వ్యాఖ్యానిస్తున్నారు. చేతిలో ఛానల్.. పేపర్ ఉన్నాయి కాబట్టి వైసిపి ఏదో ఒక రకంగా సానుభూతి పొందడానికి వార్తలను ప్రచారం, ప్రసారం చేస్తోంది. కానీ వాస్తవంలో అలాంటి పరిస్థితి లేదని టిడిపి కార్యకర్తలు చెబుతున్నారు. ఒకవేళ జగన్ విదేశాలకు వెళ్ళిపోతే అప్పుడు పార్టీ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారు? అనే చర్చ నడుస్తోంది. అంబటి రాంబాబుకు ఇచ్చే అవకాశం లేదు. బొచ్చ సత్యనారాయణకు అప్పగించే సాహసం జగన్ చేయరు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సకల శాఖా మంత్రిగా పనిచేసిన సజ్జల రామకృష్ణారెడ్డి.. పార్టీ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే సజ్జల మీద బోరుగడ్డ అనిల్.. ఇంకా అనేకమంది ఆరోపణలు చేశారు. విజయసాయిరెడ్డి కూడా కీలకమైన విషయాలను వెలుగులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ సజ్జల మీద జగన్ చర్యలు తీసుకోలేదు. సజ్జలకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిని పార్టీ నుంచి జగన్ బయటకి పంపించారు. ఇక ఈ నెలలోనే షర్మిల కూతురి వివాహం ఉంది. యలహంక ప్యాలెస్ లోనే చేయాలని ఆమె అనుకుంటున్నారు. దీనిపై రకరకాల వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ షర్మిల కూతురు వివాహానికి ముందు విదేశాలకు వెళ్తారా.. వివాహం జరిగిన తర్వాత వెళ్తారా అనేది తెలియాల్సి ఉంది. కాకపోతే వచ్చే నెలలో కుటుంబంతో కలిసి జగన్ విదేశీ యాత్రకు వెళ్ళడం మాత్రం ఖాయంగా కనిపిస్తోందని టీడీపీ నేతలు అంటున్నారు.

విదేశీ నిధులతో

పార్లమెంట్, ప్రధాని నివాసం ముట్టడికి కుట్రలు

నవంబర్ 2న హైదరాబాద్, 5న కరీంనగర్‌లో 'సేవ్ డెమోక్రసీ' ర్యాలీలు

పెద్దపల్లిలో కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

పెద్దపల్లి, వెలుతురు అక్టోబర్ 27:

విదేశీ నిధులతో బంగ్లాదేశ్ తరహాలో పార్లమెంట్, ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు విధ్వంసక శక్తులు కుట్రలు చేస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఇలాంటి శక్తుల కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రజలంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నవంబర్ 2న హైదరాబాద్‌లో,5న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'సేవ్ డెమోక్రసీ'ర్యాలీలకు విద్యార్థులు,యువత సహా అన్ని వర్గాల ప్రజలు భారీగా తరలిరావాలని కోరారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్త సుధాకర్ జీ తల్లి కుమ్మరికుంట రాజేశ్వరి ఇటీవల మరణించడంతో పెద్దపల్లిలోని ఆమె నివాసానికి వెళ్లిన బండి సంజయ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బోగస్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు తొలగించడం, ఒకే వ్యక్తికి పలు చోట్ల ఓట్లు ఉంటే సరిచేయడంలో తప్పేముందని ప్రశ్నించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 2004లోనే మరణించినప్పటికీ ఆయన ఓటు కొనసాగిందని, ఎస్ఐఆర్‌లో దాన్ని తొలగించారని పేర్కొన్నారు.

ఈ ప్రక్రియను అమలు చేస్తున్న బూత్ స్థాయి అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తున్నారని, అలాంటప్పుడు దీనికి బీజేపీకి సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మహేశ్వరం నియోజకవర్గంలో అక్రమంగా ఓటు హక్కు పొందినవారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని ఆరోపించారు. డూప్లికేట్ ఓట్లను, మరణించిన వారి ఓట్లను తొలగించాలా? వద్దా? రోహింగ్యాల పేర్లతో ఉన్న ఓట్లను తొలగిస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ సహా ప్రతిపక్షాలు ఎందుకు అభ్యంతరం చెబుతున్నాయని ప్రశ్నించారు.

ఎస్ఐఆర్ పేరుతో విధ్వంసానికి పాల్పడుతున్న శక్తులకు విదేశాల నుంచి నిధులు అందుతున్నాయని, వాటితో దేశంలో అశాంతి సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నాయని బండిసంజయ్ ఆరోపించారు. ఈ కుట్రలను ప్రజలు ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించే ర్యాలీకి కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతారని తెలిపారు. ప్రజలు, విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొని ర్యాలీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెపై సర్కారు నిర్లక్ష్యం

- న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి
- ఉద్యోగుల ఆందోళనకు ఎంపీ వద్దిరాజు సంపూర్ణ మద్దతు
- వైద్యారోగ్య శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన రవిచంద్ర
- కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలుస్తానని హామీ

ఖమ్మం, వెలుతురు అక్టోబర్ 27:

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న వైద్యులు, ఏఎన్ఎంలు, నర్సులు 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 13 నుంచి ఆందోళన చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మంగళవారం ఖమ్మంలో ఎంపీ వద్దిరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను విన్న ఆయన వెంటనే వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఫోన్ చేసి ఉద్యోగుల ఆవేదనను వివరించారు.

ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో అత్యధికులు మహిళా ఉద్యోగులేనని, వేతనంతో కూడిన ఎనిమిది నెలల ప్రసూతి సెలవులు కోరడం న్యాయబద్ధమేనన్నారు. ఈ మిషన్‌లో కేంద్రం వాటా 60శాతం, రాష్ట్రం వాటా 40శాతం ఉన్నప్పటికీ ఉద్యోగులకు ఆరోగ్య బీమా, ఈహెచ్ఎస్ కార్డులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. కేంద్రం ఇచ్చే ఇంక్రిమెంట్లు, 8శాతం లాయల్టీ బోనస్ వంటి ప్రయోజనాలను సైతం కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించడం లేదని విమర్శించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఎన్‌హెచ్‌ఎం మహిళా ఉద్యోగుల సమస్యలను మాత్రం పరిష్కరించడం లేదని మండిపడ్డారు. త్వరలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను స్వయంగా కలిసి ఉద్యోగుల డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ క్రికెట్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

- 3వ ఆల్ ఇండియా పోలీస్ క్రికెట్ టోర్నీకి తెలంగాణ పోలీస్ శాఖ ఆతిథ్యం
- డిసెంబరు 10 నుంచి21 వరకు ఆల్ ఇండియా పోలీస్ టీ20 (పురుషులు) క్రికెట్ టోర్నీ
- పాల్గొననున్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల క్రీడాకారులు

హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 27:

తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో మూడో ఆల్ ఇండియా పోలీస్ టీ20 క్రికెట్ టోర్నమెంట్ 2026-27 (పురుషులు) డిసెంబరు 10 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, పోలీసు విభాగాలకు చెందిన సుమారు 35 జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. టోర్నమెంట్ నిర్వహణ ఏర్పాట్లపై మంగళవారం డిజిపి సి.వి.ఆనంద్ డిజిపి కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి పోలీసు క్రికెట్ టోర్నమెంట్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరమని డిజిపి పేర్కొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో ప్రతి మ్యాచ్ 20 ఓవర్ల పాటు సాగనుంది.

ఎనిమిది మైదానాల ఎంపిక

టోర్నమెంట్ నిర్వహణ కోసం ఆరు ప్రధాన క్రికెట్ మైదానాలతో పాటు మరో రెండు రిజర్వు మైదానాలను ఎంపిక చేశారు. మొయినాబాద్‌లోని ఆసీస్ నగర్‌లో క్రికెట్ క్రికెట్ మైదానాలను ఎంపిక చేసినట్లు కమిటీ సభ్యులు డిజిపి కి వివరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పోలీసు క్రీడాకారుల వసతి కోసం తెలంగాణ పోలీసు అకాడమీలో ఏర్పాట్లు చేయనున్నారు. క్రీడాకారుల రవాణా, భోజన వసతి, మైదానాల నిర్వహణ, భద్రత, మ్యాచ్‌ల సమన్వయం తదితర అంశాలపై డీజీపీ అధికారులతో చర్చించారు. ప్రతి విభాగం సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.

పలు కమిటీలకు బాధ్యతలు

టోర్నమెంట్ నిర్వహణ కోసం అడ్మినిస్ట్రేషన్, రవాణా, మీడియా ప్రచారం, భద్రత, సాంకేతిక, మ్యాచ్‌ల సమన్వయం, ఆర్థిక వ్యవహారాల కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పగించారు. జాతీయస్థాయి పోటీలకు హైదరాబాద్ వేదిక కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని డిజిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఆరోగ్యమే అత్యంత విలువైన సంపద

కనక్కూర్ ధన్వంతరి మహాయాగానికి హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కనక్కూర్, వెలుతురు అక్టోబర్ 27:

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, భారతీయ ఆయుర్వేద వారసత్వాన్ని కాపాడుతూ శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. కేరళలోని కనక్కూర్ శ్రీ ధన్వంతరి ఆలయంలో నిర్వహించిన ధన్వంతరి మహాయాగానికి ఆయన హాజరై ఆరోగ్యం, ఆయుర్వేద ప్రాధాన్యం, ప్రజారోగ్యంపై ప్రసంగించారు.

ఆయుర్వేదానికి విశిష్ట స్థానం

భారతీయ వైద్య వారసత్వంలో ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానం ఉందని, ఔషధ మొక్కలపై సంప్రదాయ పరిజ్ఞానం, ప్రత్యేక చికిత్సా విధానాలతో కేరళం దేశవిదేశాల్లో గుర్తింపు పొందిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ధన్వంతరి జయంతిని ఆరోగ్య పరిరక్షణకు ప్రతీకగా గుర్తించాలని సూచించారు. ఆయుర్వేదాన్ని బాధ్యతాయుతంగా ఆచరిస్తూ, శాస్త్రీయ పరిశోధనలకు ప్రాధాన్యమివ్వాలని, రోగులకు సురక్షితమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. సరైన ఆహారం, సమతుల్య జీవనశైలి, ప్రకృతితో సామరస్యంగా జీవించడం ఆరోగ్యానికి కీలకమని అన్నారు.

ప్రజారోగ్యమే అభివృద్ధికి పునాది

ప్రజల ఆరోగ్యం, సంక్షేమం అభివృద్ధి విధానాల్లో ప్రధానంగా ఉండాలని భట్టి విక్రమార్క అన్నారు. ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వైద్య విద్య, పరిశోధన, వ్యాధుల నివారణకు నిరంతర పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు. వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని, వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య కార్యకర్తల సేవలను గౌరవించాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూనే యువతలో శాస్త్రీయ దృక్పథం, నూతన ఆవిష్కరణలు, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం అడవులు, ఔషధ మొక్కలు, స్వచ్ఛమైన నీరు, జీవవైవిధ్యాన్ని పరిరక్షించాలని అన్నారు. దేశంలో శాంతి, సమాజంలో సామరస్యం నెలకొనాలని, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. మహాయాగ నిర్వాహకులు, ఆలయ అధికారులు, స్వచ్ఛంద సేవకులు, భక్తులకు మలయాళంలో శుభాకాంక్షలు తెలిపారు.

వేగంగా.. పారదర్శకంగా

బీసీ సంక్షేమ పథకాల అమలు

- డిసెంబర్ 9న మహిళలకు కుట్టు మిషన్లు
- 38 ఆత్మగౌరవ భవనాల జీవోల ప్రక్రియ పూర్తి చేయాలి
- 327 గురుకులాల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు
- బీసీ సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27:

సచివాలయంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంక్షేమ శాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలో అమలవుతున్న పథకాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆత్మగౌరవ భవనాలు, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ, బీసీ వర్గాలకు స్వయం ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.

మహాత్మా జ్యోతిబా పూలే విదేశీ విద్యా నిధి పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకం ద్వారా అర్హులైన మెరిట్ విద్యార్థులకు పూర్తి పారదర్శకతతో పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు 38 ఆత్మగౌరవ భవనాలకు సంబంధించిన జీవోల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటింటా కుట్టు మిషన్ల పథకం అమలుపై మంత్రి సమీక్షించారు. ఈ పథకానికి మహిళల నుంచి మంచి స్పందన లభించిందని, సుమారు 4.80 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. నియోజకవర్గానికి వెయ్యి మంది చొప్పున మొత్తం 1.90 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 9న లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని, టెండర్ ప్రక్రియతో పాటు ఇతర అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

రాజీవ్ యువ వికాసం పథకం కింద వచ్చిన దరఖాస్తుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారిలో బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ఆర్సీవోలు పర్యటించి మౌలిక సదుపాయాలు, సిబ్బంది, విద్యార్థుల సంఖ్య, ఖాళీలు, సొంత భవనాల స్థితిగతులు తదితర అంశాలపై నివేదికలు అందించినట్లు మంత్రి తెలిపారు.

గురుకులాలకూ సొంత భవనాలకు చర్యలు

రాష్ట్రంలోని 327 గురుకుల పాఠశాలల్లో కేవలం 26 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉండగా, మిగిలిన 301 పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. 37 గురుకులాలకు సొంత స్థలాలు ఉన్నందున వాటిలో భవనాల నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. గురుకులాలకు కూడా సొంత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అధికారులు గురుకుల పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించాలని, జిల్లా కలెక్టర్లు నెలకు ఒక గురుకుల పాఠశాలను సందర్శించి నివేదిక అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురుకులాలకు అవసరమైన స్థలాల సేకరణను త్వరగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు, బీసీ సంక్షేమ శాఖ హాస్టల్ వార్డెన్లకు లేఖలు రాసి విద్యార్థులకు ఎల్ నినో ప్రభావం, నీటి పొదుపు, విద్యుత్ వినియోగంలో మితవ్యయం తదితర అంశాలపై అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు కూడా ఈ అంశాలను వివరించే అవకాశం ఉంటుందని తెలిపారు.

నిరుద్యోగులకు నాణ్యమైన శిక్షణ

బీసీ స్టడీ సర్కిళ్లలో సంస్కరణలు చేపట్టి నిరుద్యోగులకు ఉద్యోగాలే లక్ష్యంగా నాణ్యమైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ అంశంపై ఐదుగురు సభ్యుల కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సమర్థవంతమైన డైరెక్టర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డైరెక్టర్ల ఎంపిక కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల్లో మెరిట్ సాధించిన వారికి అవకాశాలు కల్పించేలా ఎంపిక ప్రక్రియ చేపట్టాలని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. మధిర వంటి నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా పశువుల పంపిణీ తరహా ఉపాధి పథకాన్ని ప్రారంభించి, లబ్ధిదారుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ పథకం కింద చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు వివిధ కుల సంఘాలకు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు, ఆర్థిక వృద్ధి పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల కార్యదర్శి సైదులు, అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, పద్మ, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి అభివృద్ధికి రూ.45 కోట్లతో పనులకు శ్రీకారం

- రూ.42.80 కోట్లతో రహదారుల అభివృద్ధి
- రెండు గ్రామాల్లో విద్యుత్ ఉపకేంద్రాలకు స్థల పరిశీలన

ఎల్లారెడ్డి, వెలుతురు అక్టోబర్ 27:

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ మంగళవారం శ్రీకారం చుట్టారు. రామారెడ్డి మండలం మోషంపూర్ చౌరస్తా వద్ద హైబ్రిడ్ యాన్యుటీ విధానం మొదటి దశలో రూ.42.80 కోట్ల వ్యయంతో 71.63 కిలోమీటర్ల మేర చేపట్టనున్న పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పోసానిపేట గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఏడు విద్యుత్ ఉపకేంద్రాల మంజూరుకు ఎమ్మెల్యే కృషి అభినందనీయం

రామారెడ్డి మండలం గిద్ద, సదాశివనగర్ మండలం కుప్రియాల్ గ్రామాల్లో నూతన విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాలను మంత్రి సీతక్క, ఎమ్మెల్యే మదన్ మోహన్ పరిశీలించారు. నియోజకవర్గానికి ఏడు విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే చూపిన చొరవ అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

గిద్ద గ్రామంలో రూ.2.88 కోట్లతో, కుప్రియాల్ గ్రామంలో రూ.2.63 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. వీటి నిర్మాణంతో ఆయా గ్రామాలతోపాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని, రైతుల విద్యుత్ సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

అభివృద్ధి పనులకు జిల్లా యంత్రాంగం సహకారం

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. అభివృద్ధి పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో కెమికల్ బ్లాస్ట్..

- ఇద్దరికి గాయాలు..
- ఒకరి పరిస్థితి విషమం..

రంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 27:

కాటేదాన్‌లోని బాటిళ్ల తయారీ కంపెనీలో కెమికల్ బ్లాస్ట్ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో సాయి అనే వ్యక్తికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కాలిపాదం సగం మేరకు తెగిపోవడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ఇద్దరూ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ప్రమాదానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సివిల్ సప్లయ్ శాఖలో అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 27:

సివిల్ సప్లయ్ శాఖలో అవినీతికి పాల్పడుతున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వారి అక్రమాస్తులను జప్తు చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లర్లపై జరుగుతున్న దాడులు, కేసుల నమోదును స్వాగతిస్తున్నామని, అధికారుల అండదండలు లేకుండా మిల్లర్లు అవినీతికి ఎలా పాల్పడతారని ప్రశ్నించారు. వనపర్తి జిల్లాలో అనుమతులు లేవంటూ రెండు రైస్ మిల్లులను కూల్చివేసిన అధికారులు, వాటికి ధాన్యం కేటాయింపులు ఎలా చేశారో సమాధానం చెప్పాలన్నారు. శాఖలోని డీఎంలు, డీఎస్‌వోలు ఒక్కో సీజన్‌లో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆరోపించారు. మిల్లర్ల మాదిరిగానే అధికారులపైనా ఏసీబీ, సీఐడీ సోదాలు నిర్వహించాలని కోరారు. అవినీతి అధికారుల అక్రమాస్తులు, బినామీల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. అవినీతిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అప్పటివరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com